PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 330 | విజయవాడ, బుధవారం 2 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 2 July 2025 | Rs

ప్లాట్ల నిర్వహణ బాధ్యత స్థానికులకే

- సిఆర్‌డిఎ రీజియన్‌లో తాజా భూసమీకరణ
- కొత్త నిబంధనలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఆరునెలల్లో ప్రక్రియ పూర్తి

6

10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌ను ఈ నెల 10న నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కొన శశిధర్ ఆదేశాలు జారీ చేశారు. తొలుత ఈ సమావేశం ఈ నెల 5న నిర్వహించాలని నిర్ణయించారు. అనివార్య కారణాలతో ముందుగా ప్రకటించిన తేదీని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో ఈ సమావేశాన్ని నిర్వహించాలన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, ఎస్-ఎస్ఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

కేంద్రం తొండాట !

తెలుగు రాష్ట్రాల మధ్య అగ్గి రాజేసే వైఖరి

గోదావరి జలాల్లో వాటా తేల్చాలని రెండు నెలల క్రితమే రాష్ట్రం లేఖ

సిడబ్ల్యుసిది నామమాత్రపు స్పందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాల మధ్య వివాదాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరిస్తోందా? తెలుగు రాష్ట్రాల్లో ఎలాగైనా పట్టు పెంచుకోవాలన్న బిజెపి వ్యూహంలో భాగంగా అగ్గిరాజేసి లబ్ధి పొందాలని చూస్తోందా? గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరే ఇందుకు కారణం. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ బనకచర్ల ప్రతిపాదనలను తిప్పి పంపుతూ ఆ ప్రాజెక్టుకు సంబంధించిన జలవివాదాలను సిడబ్ల్యుసిలో పరిష్కరించుకోవాలని రాష్ట్రానికి సూచించిన సంగతి తెలిసిందే. జల వివాదాలు పరిస్కారమైన తరువాతే అనుమతుల కోసం తమ వద్దకు రావాలని పర్యావరణ శాఖ పేర్కొంది. అయితే, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా తేల్చి. వివాదాలను పరిష్కరించాలని రెండు నెలల క్రితమే సిడబ్ల్యుసిని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఆ మేరకు రాసిన లేఖపై సిడబ్ల్యుసి స్పందన నామమాత్రమే! ఆసక్తి కరమైన విషయమేమింటే, పర్యావరణ శాఖతో పాటు సిడబ్ల్యుసి కూడా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదే కావడం గమనార్హం. సమస్మను పరిష్కరించాల్సిన కేంద్రం తనకు సంబంధం లేనట్లుగా ఊరుకోగా, పర్యావరణ శాఖ నీటికేటాయింపులు, పొరుగురాష్ట్రాల అభ్యంతరాలు ఇలా అనేక అంశాలు ప్రస్తావించి జల వివాదాన్ని మరింత జఠిలం చేసింది. బనకచర్ల అంశాన్ని తెలంగాణలో బిజెపి వివాదాస్పదం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం వైఖరి స్పష్టమౌతున్నా రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహిస్తుండటం విశేషం.

రాష్ట్రం ఏమి కోరింది?

విభజన హామీ ప్రకారం గోదావరి నికర జలాల్లో పంపిణీపైనా స్పష్టత ఇవ్వాలని ఎపి ప్రభుత్వం ఈ ఏడాది మే మొదటివారంలో లేఖ రాసింది. అనంతరం 22వ తేదీన మరోలేఖ రాసింది. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం గోదావరి జలాల్లో ఎపి వాటా తేల్చాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉందని, దీనిపై సిడబ్ల్యుసి నివేదిక కూడా ఇవ్వాలని కోరింది. 'రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల తరువాత కూడా గోదావరి నికర జలాలు పంపిణీ చేయలేదు. చివరి రాష్ట్రంగా వరద జలాలను వినియోగించుకునేందుకు మాకు హక్కులు ఉన్నాయి. ప్రస్తుతం గోదావరి నుండి సముద్రంలో 3000 టిఎంసిలు కలుస్తున్నాయి. వాటిని మా అవసరాలకోసం వినియోగించు కుంటాం' అని లేఖలో పేర్కొంది. '2014లో రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఉభయ రాష్ట్రాల మధ్య జల వివాదాలతోపాటు అన్నిరకాల సమస్యలనూ పరస్పరం చర్చించి పరిష్కరించాలని ఉంది. పదేళ్లు దాటితే సమస్యలన్నీ కేంద్రం చేతుల్లోకి వెళతాయి. అప్పటి నుండి కేంద్రమే వివాదాలను పరిష్కరించాల్సి ఉంది' అని కూడా ఈ లేఖలో పేర్కొన్నారు.

సిడబ్ల్యుసి స్పందనేంటి?

ఈ లేఖపై సిడబ్ల్యుసి స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ పంపిన లేఖపై ఎగువ రాష్ట్రాల ఇఎన్‌సిల అభిప్రాయాన్ని కోరుతూ లేఖలు రాశామనీ పేర్కొంది. రాష్ట్రాల నుండి అభిప్రాయాలు వస్తే క్రోడీకరించి సిడబ్ల్యుసి సాంకేతిక అంశాల నివేదిక ఆధారంగా పంపిణీ ప్రతిపాదన చేస్తామని తెలిపింది. అయితే, ఆ దిశలో కార్యాచరణ మాత్రం పెద్దగా లేదని సమాచారం. అదే సమయంలో పర్యావరణ శాఖ వివిదాల అంశాలను ప్రస్తావించి బనకచర్ల ప్రతిపాదనను తిప్పి పంపడం చర్చనీయాంశంగా మారింది.

నెలలో టీచర్ పోస్టుల భర్తీ

పింఛన్లతో గ్రామాల్లో పండగ సందడి • ప్రజల కోసం రాజకీయ నేరస్తులపై పోరాటం

• మలకపల్లి పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి- కొవ్వూరు, తాళ్లపూడి (తూర్పుగోదావరి జిల్లా)

నెలలోగా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేయడంతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంటోందన్నారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లిలో 'పేదల సేవ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. చర్మకారుడు సానమాంద్ర పోసిబాబు ఇంటికెళ్లి పింఛను అందజేశారు. పోసిబాబు కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరో లబ్ధిదారు గెడ్డం కృష్ణదుర్గ ఇంటికెళ్లి వితంతు పింఛను అందజేశారు. అనంతరం ప్రజావేదిక సభలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు సరిగా వచ్చేవి కావని, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు వచ్చేవి కావన్నారు. తమ ప్రభుత్వంలో ఒకటో తేదీనే పింఛన్లు, జీతాలు ఇస్తున్నామని తెలిపారు. ఏ రాష్ట్రంలోనూ ఇంతపెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదన్నారు. పింఛన్ల కోసం నెలకు రూ.2,750 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. వైసిపి నేతలు మెగా డిఎస్‌సికి అడ్డంకులు సృష్టించారని, వాటన్నింటినీ అధిగమించి డిఎస్‌సి నిర్వహించామన్నారు. మిత్రుడు పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళు తున్నామని పేర్కొన్నారు. ప్రజల కోసం రాజకీయ నేరస్తులపై పోరాటం చేస్తున్నామన్నారు.

ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో గోదావరి పుష్కరాలు

సమైక్యాంధ్రలో, నవ్యాంధ్రలో ముఖ్యమంత్రిగా తన ఆధ్వర్యంలో గోదావరి పుష్కరాలు నిర్వహించానని తెలిపారు. ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో గోదావరి పుష్కరాలను మళ్లీ నిర్వహిస్తామని ప్రకటించారు. 204 అన్నా క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా రూ.10 వేల కోట్లను తల్లుల ఖాతాలో వేశామన్నారు. 1, 11వ తరగతి విద్యార్థులకు అడ్మిషన్లు అవ్వగానే తల్లికి వందనం నిధులు వేస్తామని తెలిపారు. కేంద్రం అన్నదాత సుఖీభవ కింద డబ్బు వేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా జమ చేస్తుందన్నారు. ఆగస్టు 15 నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. రూ.9.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నామని, వీటి ద్వారా 8.50 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని, ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల పనులు ప్రారంభమయ్యాయని, 4.50 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని అన్నారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. డిసెంబర్‌కు డయాఫ్రం వాల్ పూర్తి చేస్తామని తెలిపారు.





చర్మకారుడు పోసిబాబుకు పింఛను అందిస్తున్న చంద్రబాబు, ఆయన ఇంటి వద్ద డప్పు మోగిస్తున్న సిఎం

పి4తో పేదరిక నిర్మూలన

పేదరికంలేని సమాజ సాధన లక్ష్యంగా పి4కు శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. ఆర్థికంగా ఉన్నతిలో ఉన్న పది శాతం మంది కింది స్థాయిలో ఉన్న 20 శాతం మందిని ఆదుకోవాలన్నారు. బిల్ గేట్స్ సంపాదనలో 99 శాతం తిరిగి సమాజానికి ఇచ్చేస్తున్నారని, వేదాంత కంపెనీ కూడా 75 శాతం సమాజానికి ఇచ్చేస్తోందని, అదే తరహాలో దాతలు ముందుకు రావాలని కోరారు. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను కనీసం లక్షమంది మార్గదర్శులు దత్తత తీసుకునే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దానికి టాటా, బిర్లా, అదానీ, జిందాల్ వంటివారిని పిలుస్తానని తెలిపారు.

డప్పు కొట్టి సందడి చేసి...

మలకపల్లికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాజీ ఎంఎల్ఎ టివి.రామారావు డప్పు కొడుతూ ఆహ్వానం పలికారు. అదే ఉత్సాహంతో ముఖ్యమంత్రి కూడా కాసేపు డప్పు కొట్టి సందడి చేశారు. చర్మకారుల కాలనీకి వెళ్లిన ఆయన కాసేపు డప్పు కొట్టి అలరించారు. చర్మకారుల కుటుంబాలతో ముచ్చటించారు.

అప్పుల ఊబిలో సామాన్యుడు

- వ్యక్తిగత సగటు రుణాల్లో 23 శాతం పెరుగుదల
- 2025 మార్చి నాటికి రూ.4.8 లక్షలకు చేరిక



న్యూఢిల్లీ : సామాన్యుడు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. నయా ఉదారవాద విధానాల నేపథ్యంలో స్థిరమైన ఆదాయ వనరులు లేకపోవడం, నిరుద్యోగం, చిరు ఉద్యోగాలు, అరకొర వేతనాలు తదితర కారణాల వల్ల సగటు వ్యక్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో, అప్పు చేయడం, వాయిదా పద్ధతుల్లో వడ్డీలతో చెల్లించడం మినహా మరో మార్గం లేకుండా పోతోంది. ఈ పరిణామాలతో గత రెండేళ్లుగా వ్యక్తిగత రుణగ్రహీతల సగటు భారం భారీగా పెరిగిపోయింది. ఇదే విషయాన్ని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2023 మార్చి నాటికి ఒక వ్యక్తి సగటు రుణం రూ.3.9 లక్షలుగా ఉంది. ఇది 2025 మార్చి నాటికి ఏకంగా రూ.4.8 లక్షలకు పెరిగింది. రెండేళ్లలోనే దాదాపు 23 శాతం పెరగడం ఆందోళనకరం. రుణగ్రహీతల నుంచి వచ్చిన డిమాండ్ వల్లే ఇది జరిగిందని ఆర్‌బిఐ పేర్కొంది. ప్రజల ఆదాయాలు తగ్గడం, ధరలు పెరగడంతో అప్పులపై ఆధారపడే వారి సంఖ్య పెరుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. మొత్తం కుటుంబ అప్పుల్లో గృహ రుణాల వాటా 29 శాతంగా ఉంది. ఇతర రుణాలతో పోల్చితే గృహ రుణాలు స్థిరంగా పెరగ్గా.. రిటైల్ రుణాలు మరింత పెరుగుతున్నాయి. వ్యాపార రుణాల కంటే గృహ, వ్యవసాయ రుణాలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది.

మైక్రోఫైనాన్స్‌లతో ఒత్తిడి..

తక్కువ రేటింగ్ ఉన్న రుణగ్రహీతలలో వాయిదాల చెల్లింపుల్లో జాప్యం స్థాయిలు ఎక్కువగా ఉన్నాయి. కోవిడ్-19 సమయంలో ఈ స్థాయిలు ఇంకా ఎక్కువగా ఉండేవని, ఆ తర్వాత కొంతమేర తగ్గాయని ఆర్‌బిఐ వెల్లడించింది. ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న రుణభారం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మైక్రోఫైనాన్స్ రంగంలో అధిక వడ్డీ రేట్లు, మార్జిన్లు రుణగ్రహీతలకు ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వర్‌రావు హెచ్చరించారు. మరోవైపు ఉన్నత సిబిల్ రేటింగ్ ఉన్న రుణగ్రహీతల వాటా, రుణ మొత్తం, రుణగ్రహీతల సంఖ్య పరంగా పెరగడం సానుకూల సంకేతం. 2024 డిసెంబర్ ముగింపు నాటికి మొత్తం జిడిపిలో కుటుంబాల అప్పులు 41.9 శాతానికి చేరాయి. గృహయేతర, ప్రాథమిక అవసరాల కోసమే 54.9 శాతం అప్పులు చేయడం గమనార్హం. పెరుగుతున్న కుటుంబాల అప్పులు దీర్ఘకాలంలో వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు

బివి పట్టాభిరామ్ కన్నుమూత

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



ప్రముఖ ఇంద్ర జాలికులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బివి పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. హైదరాబాద్‌లో సోమ వారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో ఖైరతా బాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. పట్టాభిరామ్‌కు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. ఖైరతా బాద్‌లోని స్వగృహంలో పట్టాభిరామ్ భౌతికకాయాన్ని ఉంచారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టాభిరామ్ మృతికి తెలంగాణ, ఎపి ముఖ్యమంత్రులు ఎ.రేవంత్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ సంతాపం తెలిపారు.

ఆటలూ ప్రయివేటుకే

- జాతీయ విద్యా విధానానికి కేబినెట్ ఆమోదం
- శాస్త్ర పరిశోధన, అభివృద్ధి రంగాలు కూడా
- పెట్టుబడుల ప్రోత్సాహానికి రూ.లక్ష కోట్లతో ఆర్‌డిఐ స్కీమ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని సహజ వనరులను, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, అంతరిక్ష పరిశోధన ఇలా కీలక రంగాలన్నిటినిటీని ఇప్పటికే ప్రయివేటుకు కట్టబెట్టిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం క్రీడా రంగాన్ని కూడా ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టేందుకు కంకణం కట్టుకుంది. ప్రయివేటు రంగానికి పెద్ద పీట వేస్తూ రూపొందించిన జాతీయ క్రీడా విధానానికి కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. అంతే కాదు శాస్త్ర పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి), నూతన ఆవిష్కరణల రంగంలోనూ ప్రయివేటు పెట్టు బడులను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన మంగళవారం నాడు కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. దాదాపు రూ.3 లక్షల కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ప్రధానంగా శాస్త్ర పరిశోధన, అభివద్ధి, ఆవిష్కరణ రంగంలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.లక్ష కోట్ల నిధితో రీసెర్చ్ డవలప్ మెంట్ అండ్ ఇన్నొవేషన్ (ఆర్‌డిఐ) పథకానికి ఆమోదముద్ర వేసింది. కేంద్ర మంత్రివర్గ సమావేశం అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసి)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంత్రివర్గ ఈ వివరాలను వెల్లడించారు. ఇజ్రాయెల్, అమెరికా, సింగపూర్, జర్మనీ వంటి దేశాల్లో విజయవంతమైన అంతర్జాతీయ నమూనాలను అధ్యయనం చేసి ఆ ప్రాతిపదికన అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఎన్ఆర్ఎఫ్) రూపొందించిన ఆర్‌డిఐ పథకానికి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఆర్అండ్‌డి రంగంలో ప్రయివేటు పెట్టుబడులకు అడ్డంకులను తొలగించడమే ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. తక్కువ వడ్డీ లేదా వడ్డీరహిత దీర్ఘకాలిక రుణాలను ప్రయివేటు సంస్థలకు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఇక ప్రయివేటు ఆటలు

క్రీడల్లో ప్రయివేటు భాగస్వామ్యాన్ని పెంచే జాతీయ క్రీడా విధానం-2025కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ-ప్రైవేట్ మిగతా 7లో

జగన్, ఇతరులపై కేసులో

చర్యలు నిలిపివేత

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి - అమరావతి

వాహనం కింద పడి చీలి సింగయ్య మృతి చెందాడంటూ గుంటూరు జిల్లా, నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇతర వైసిపి నేతలకు హైకోర్టులో ఊరట లభించింది. జగన్‌తోపాటు వైసిపి రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని, జగన్ పిఎస్ కె నాగేశ్వర్ రెడ్డిపై నమోదైన కేసులో తదుపరి చర్యలను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత విచారణలోనే వారిపై కఠిన చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు ఈ కీలక ఆదేశాలను జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ.. ఈ కేసులో పలు ఆధారాలను కోర్టు ముందు ఉంచేందుకు గడువు ఇస్తే కౌంటర్ వేస్తామన్నారు. కనీసం వారమైనా సమయం ఇవ్వాలన్నారు. కారులో ఉన్నవారు ఘటనకు ఎలా బాధ్యులో తెలియజేస్తామని, అప్పటి వరకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరారు. దీనిపై వైఎస్ జగన్ తరపున సీనియర్ అడ్వకేట్ ఎస్ శ్రీరామ్ స్పందిస్తూ.. సింగయ్య గుర్తు తెలియని వాహనం కింద పడి మరణించినట్లుగా సాక్షాత్తు ఎస్‌పి మీడియాకు చెప్పారని, ఆ తర్వాత స్వరం మార్చి బిఎన్ఎస్ సెక్షన్ 106ను సెక్షన్ 105 కింద కేసు నమోదు చేశారన్నారు. జగన్ కారును పోలీసులు సీజ్ చేశారని, కేవలం ఇది రాజకీయంగా వేధించే క్రమంలో నమోదు చేసిన కేసని చెప్పారు. ప్రమాదవశాత్తు సింగయ్యే కారు కింద పడ్డారనేందుకు వీడియో సాక్ష్యాలు ఉన్నాయన్నారు. వైఎస్ జగన్ పర్యటనలకు ప్రభుత్వం రక్షణ, జనాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తోందన్నారు. వాదనల తర్వాత హైకోర్టు స్పందిస్తూ.. ఇప్పటికే పిటిషనర్లకు రక్షణ కల్పించామని, ఎజి కోరినట్లుగా గడువు ఇస్తే ఏమౌతుందని ప్రశ్నించింది. జగన్ భద్రతను ప్రభుత్వం గాలికి వదిలేసి ఘటనలు జరిగాయని కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతోందని, ఈ నేపథ్యంలో విచారణ జరిపి మధ్యంతర ఉత్తర్వులివ్వాలని శ్రీరామ్ కోరారు. తర్వాత హైకోర్టు.. నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి వీల్లేదని ఎజి పేర్కొన్నారు. మధ్యంతర ఉత్తర్వులిచ్చే అధికారం తమకు ఉందని హైకోర్టు తేల్చి చెప్పింది.

ఎపి పిఇ సెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి పిఇ సెట్ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. ఈ పరీక్షకు 2,032 మంది దరఖాస్తు చేసుకోగా, 1,502 మంది పరీక్షలకు హాజరయ్యారని, 1,419 మంది ఉత్తీర్ణులయ్యారని కన్వీనర్ పిపిఎస్ పౌల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను మనమిత్రా వాట్సాప్ నెంబరు 95523 00009కు హాయ్ అని మెసేజ్ పంపి, వివరాలు నమోదు చేయడంతో తెలుసుకోవచ్చన్నారు. https://cets.apsche.ap.gov.in/PECET/PECET/PECET_HomePage.aspx వెబ్‌సైట్‌లోను సందర్శించడంతో ఫలితాలను తెలుసుకోవచ్చని వివరించారు. ఈ పరీక్షల్లో మొదటి ర్యాంక్‌ను మానేపల్లి లీలా గణేష్, రెండో ర్యాంక్‌ను ఆర్ సాయిశ్రీనివాస్, మూడో ర్యాంక్‌ను, వై పురుషోత్తం సాధించినట్లు తెలిపారు.

గరిష్టస్థాయికి శ్రీశైలం నీటిమట్టం

- నాలుగైదు రోజుల్లో గేట్లు ఎత్తే అవకాశం

3

సిగాచి మృత్యుఘోష

- 36 మంది మరణాన్ని ధ్రువీకరించిన అధికారులు
- మరో 15 మంది ఆచూకీ గల్లంతు
- గాయపడిన 34 మందిలో ఐదుగురి పరిస్థితి విషమం
- మృతుల కుటుంబాలకు కోటి పరిహారం : తెలంగాణ సిఎం హామీ



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సిగాచి కంపెనీలో భీతావహ పరిస్థితి నెలకొంది. శిథిలాల తొలగింపుతో శరీరభాగాలు తెగిపడిన శవాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ప్రమాదంలో 36 మంది మృతి చెందినట్టు అధికారులు మంగళవారం వెల్లడించారు. గుర్తుపట్టలేనంతగా కాలిన మృతదేహాలకు డిఎన్ఎ పరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. గాయపడిన 34 మందిలో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగి రెండు రోజులు గడుస్తున్నా శిథిలాలను పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో మరో 15 మంది ఆచూకీ మంగళవారం రాత్రి వరకు తెలియలేదు. ప్రమాద తీవ్రతను బట్టి చూస్తే వారు సైతం మరణించే ఉంటారని భావిస్తున్నారు. తమ వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీళ్లతో ఎదురుచూస్తున్నారు.

భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు -అధికారులతో రేవంత్‌రెడ్డి సమీక్ష

ప్రమాదం జరిగిన సిగాచీ కంపెనీలో జరుగుతున్న సహాయక చర్యలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మంత్రులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున మిగతా 7లో

గిరిజన గురుకులాల్లో

బోధనా సిబ్బందికి వేతనాల పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన గురుకులాల్లోని అవుట్‌సోర్సింగ్ బోధనా సిబ్బంది 1,659 మందికి వేతనాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. కేటగిరి 'ఎ' లో గిరిజన గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న వివిధ కేడర్లలో 1,596 మందికి కేడర్‌ను బట్టి వేతనాలు పెంచారు. జెల్, పిడి(సి), లైబ్రేరియన్లకు నెలకు రూ.18 వేల నుంచి రూ.24,150లకు, పిజిటిలకు నెలకు రూ.16,100 నుంచి 24,150లకు, టిజిటి, పిడి(ఎస్)లకు నెలకు రూ.14,800 నుంచి 19,350లకు, పిఇటి, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లకు రూ.10,900 నుంచి 16,350లకు పెంచారు. కేటగిరి 'బి'లో 58 మందికి జెఎల్ గ్రేడ్‌కు కనిష్టంగా రూ.37,500 నుంచి 65 వేల వరకూ వేతనాలు పెంచారు. పిజిటిలకు నెలకు రూ.25 వేల నుంచి రూ.31,250లకు పెంచినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేటగిరి 'సి'లో 5 పోస్టులకు కోచ్‌లకు రూ.25 వేల నుంచి రూ.31,250, అసిస్టెంట్ కోచ్‌లకు రూ.22 వేల నుంచి రూ.27,500లకు వేతనాలను పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు.

ఎయిమ్స్‌లో ర్యాగింగ్ కలకలం

- 15 మంది విద్యార్థుల సస్పెన్షన్

ప్రజాశక్తి మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిపై హాస్టల్లోని సీనియర్లు ర్యాగింగ్ చేశారు. సీనియర్ విద్యార్థుల వేధింపులు తాళలేక జూన్ 22న చెయ్యి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు జూన్ 23న మెయిల్ ద్వారా యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన అధికారులు విచారణ జరిపి 15 మంది విద్యార్థులను సస్పెండ్ చేసి హాస్టల్ నుంచి తొలగించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్ అయిన డీన్ కుమారుడు కూడా ఈ ఘటనలో భాగమై సస్పెండ్ కావడం గమనార్హం. ర్యాగింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థి తండ్రి సదరు ఘటనకు బాధ్యత వహిస్తూ డీన్ పదవి నుంచి తప్పుకున్నారు. పూర్తి నివేదికను మరో రెండు రోజుల్లో అందించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఎయిమ్స్ మెడికల్ కాలేజ్ హాస్టల్లో జరిగిన ర్యాగింగ్ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగళగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుతున్న గోదావరి

- పోలవరం స్పిల్‌వే నుంచి 49,477 క్యూసెక్కుల నీరు విడుదల
- ముంపు మండలాలకు వరద గండం

ప్రజాశక్తి- పోలవరం, కుక్కునూరు రూరల్

గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుండడంతో జలవనరుల శాఖాధికారులు మంగళవారం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుండి 49,477 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఐదు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో, ఎగువ రాష్ట్రాల్లో కురుస్తోన్న వర్షాలకు గోదావరి ఉప నదులు, కొండవాగులు ఉప్పొంగి గోదావరిలో కలుస్తుండడంతో నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. అదనంగా వస్తోన్న జలాలను ప్రాజెక్టు స్పిల్‌వేలో 48 గేట్లు, స్లూయిజ్ గేట్ల నుండి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.450 మీటర్లు, దిగువన 17.150 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఎగువన 26.550 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన 14.250 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యాముల మధ్య 15,420 మీటర్లు నీటిమట్టం నమోదైంది. పోలవరం ప్రాజెక్టు దిగువన గోదావరి నీటిమట్టం 4.27 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. మూడు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తోన్న భారీ వర్షాలకు గోదావరికి వరద నీరు క్రమంగా పెరుగుతోంది. భద్రాచలంలో సోమవారం ఆరు అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం మంగళవారం నాటికి 13.3 అడుగులకు చేరుకుని క్రమంగా పెరుగుతోంది. దీంతో, ముంపు మండలాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే కుక్కునూరు మండలంలోని రైతులు పత్తి సాగు పనిలో నిమగ్నమై ఉన్నారు. ఓవైపు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడం, మరోవైపు గోదావరి వరద క్రమంగా పెరుగుతూ ఉండడంతో ముంపు మండలాల రైతులు, ప్రజలు వరద గండం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు.



పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే వద్ద పెరిగిన గోదావరి నీరు



కొరటాల వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎడిటర్ బి తులసీదాస్, చిత్రంలో మార్క్సిస్ట్ ఎడిటర్ ఎస్ వెంకట్రావు తదితరులు

'ప్రజాశక్తి'కి కొరటాల సేవలు మరవలేనివి

- వర్ధంతి నివాళిలో ఎడిటర్ బి.తులసీదాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాశక్తి దిన పత్రిక అభ్యున్నతికి సాహితీ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ కొరటాల సత్యనారాయణ సేవలు మరువలేనివని ఎడిటర్ బి.తులసీదాస్ పేర్కొన్నారు. కొరటాల వర్ధంతి సందర్భంగా, తాడేపల్లిలోని ప్రజాశక్తి దినపత్రిక ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కొరటాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసీదాస్ మాట్లాడుతూ, ప్రజాశక్తిని విస్తరించడంలో, స్వయం పోషకంగా రూపొందించడంలో అద్వితీయమైన పాత్ర నిర్వహించారన్నారు. ప్రజాశక్తి పత్రికను అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేయాలని పార్టీ నిర్ణయించడంతో ఆ దిశగా విశేషమైన కృషి చేశారన్నారు. సాధారణ దినపత్రిక మాదిరిగా ప్రజాశక్తిని తీర్చిదిద్దడంలోనూ ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. యువకులను ప్రోత్సహించడంతోపాటు కార్యకర్తలను నాయకత్వ స్థానాలకు చేరుకునే విధంగా అభివృద్ధి చేశారన్నారు. ప్రజాశక్తి అభివృద్ధికి ఆయన చూపిన మార్గాన్నే ఇప్పటికీ అనుసరిస్తున్నట్లు తెలిపారు. నేటితరం ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. మార్క్సిస్టు మాసపత్రిక ఎడిటర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ. కొరటాల కన్వీనర్‌గా, కృష్ణయ్య జిఎంగా ప్రజాశక్తిలో సమూల మార్పులు చేశారన్నారు. రెండు దశాబ్దాలపాటు కొరటాల నాయకత్వంలో పని చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు సభ్యులు, సిబ్బంది పాల్గొని కొరటాలకు నివాళులర్పించారు.

బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా పివిఎన్ మాధవ్

- పురందేశ్వరి నుంచి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ ఎన్నికయ్యారు. పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికల నిర్వాహకులుగా వ్యవహరించిన బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు పిసి మోహన్.. మాధవ్ ఎన్నికైనట్లు మంగళవారం ప్రకటించారు. విజయవాడ బందరు రోడ్డు ఎస్-ఎస్ కన్వెన్షన్ హాల్‌లో దగ్గుబాటి పురందేశ్వరి నుంచి నూతన అధ్యక్షులుగా మాధవ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన సభలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదు శాతం సీట్లు తీసుకోవడం కాదు, మనమే మరో పార్టీకి సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు.

బిజెపిలో అంతా ప్రజాస్వామ్యం ప్రకారం ఎంపిక జరుగుతుందని పిసి మోహన్ తెలిపారు. బిజెపిలో తనను ప్రోత్సహించిన వారికి, ప్రతిఘటించిన వారికి పురందేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సిఎం కిరణ్ కుమార్‌రెడ్డి, లోక్‌సభ సభ్యులు సిఎం రమేష్, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, రాజ్యసభ మాజీ సభ్యులు జివిఎల్ నరసింహారావు, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖానమ్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

పదవి అనేది కీలకమైన బాధ్యత : పివిఎన్ మాధవ్

పదవి అనేది స్థానం కాదని, అది కీలకమైన బాధ్యత అని బిజెపి నూతన రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు. రాష్ట్రంలో పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పజెప్పిన పార్టీ కేంద్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కూటమిలో పెరుగుతున్న అంతరాలు

మాధవ్ బాధ్యతల స్వీకరణ సభలో నేతల వ్యాఖ్యలు

రాష్ట్రంలో కూటమి పార్టీల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న పార్టీపై బిజెపి నేతలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. విజయవాడ బందరు రోడ్డు ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన సంఘటన పర్వ్ (మాధవ్ నూతన అధ్యక్ష బాధ్యతలు స్వీకరణ సభ)లో నేతల ఉపన్యాసాలు దీనికి తాజా నిదర్శనం. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ కూటమిలో బిజెపికి సరైన స్థానం లేదని, నామినేటెడ్ పోస్టుల్లో పార్టీ వారికి ప్రాధాన్యత నివ్వడం లేదన్నారు. విశాఖపట్టణం ఎమ్మెల్యే, శాసనసభలో బిజెపి పక్ష నేత విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఏది మాట్లాడినా 80,15,5శాతం అంటున్నారని అలా అంటే కుదరదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రావాల్సిన కోటా కచ్చితంగా తెచ్చుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఎంపి సిఎం రమేష్ మాట్లాడుతూ టిడిపి, జనసేనకు జరిగినట్లు బిజెపి కార్యకర్తలకు న్యాయం జరగడం లేదన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కూటమి పక్షాల నుంచి బిజెపి కార్యకర్తలు ఆదరణ కోల్పోతున్నట్లు తన దృష్టికి అనేక అంశాలు వచ్చాయని చెప్పారు.



బిసి కాలేజీ హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి అనిత

బిసి బాలికల హాస్టల్‌లో మంత్రి అనిత ఆకస్మిక తనిఖీ

- ఆహార పదార్థాలు నాసిరకంగా ఉండటంతో ఆగ్రహం

ప్రజాశక్తి - పాయకరావుపేట, నక్కపల్లి (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోని బిసి బాలికల కాలేజీ హాస్టల్‌లో మంగళవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు నాసిరకంగా ఉండటాన్ని గమనించారు. మెనూ ప్రకారం భోజనం ఎందుకు తయారు చేయలేదని హాస్టల్ సిబ్బందిని ప్రశ్నించారు. హాస్టల్ వార్డెన్ అంకంరెడ్డి గంగాభవాని ఆ సమయంలో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో సాయంత్రానికి హాస్టల్ వార్డెన్‌ను అధికారులు సస్పెన్షన్ చేశారు.

భోజనంలో బొద్దింక అంటూ ప్రచారం.. కొట్టిపారేసిన మంత్రి

హాస్టల్ విద్యార్థులతో కలిసి మంత్రి అనిత భోజనం చేస్తుండగా బొద్దింక కనిపించినట్టు మంగళవారం కొన్ని మీడియా ఛానళ్లు, సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. వీటిని మంత్రి అనిత కొట్టిపారేశారు. ఇదంతా వైసిపి చేస్తున్న అసత్య ప్రచారమని అన్నారు. నక్కపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులతో తాను కలిసి భోజనం చేస్తుంటే భోజనంలో చిన్న తల వెంట్రుక కనిపించిందని, బొద్దింక కాదని తెలిపారు. విద్యార్థులకు మంచి వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంచిని కూడా వైసిపి చెడుగా ప్రచారం చేస్తోందన్నారు. వారి హయాంలో ఒక ఎమ్మెల్యే అయినా హాస్టల్‌కు వెళ్లి పరిశీలించారా ? అని ప్రశ్నించారు. శ్రీశైలం ప్రసాదంలో బొద్దింక అని నాడు ప్రచారం చేశారని, ఇప్పుడు హాస్టల్ భోజనంలో బొద్దింక అని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.


వైవి విక్రాంత్‌రెడ్డికి ఊరట

ప్రజాశక్తి-అమరావతి

వైసిపికి చెందిన రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి కొడుకు, వ్యాపారవేత్త వైవి విక్రాంత్‌రెడ్డిపై మంగళగిరి సిఐడి ఎస్‌పి జారీ చేసిన లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌బిసి) అమలును నిలిపివేస్తూ హైకోర్టు మంగళవారం స్టే ఆదేశాలిచ్చింది. పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలిచ్చారు. కాకినాడ సీ పోర్ట్ వాటాల బదిలీల వ్యవహారంలో కర్నాటి వెంకటేశ్వరరావు చేసిన ఫిర్యాదు ఆధారంగా గత డిసెంబర్‌లో సిఐడి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. ఆ కేసులో నిందితుడిగా ఉన్న తనకు హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చిందని, అయినప్పటికీ సిఐడి ఎస్‌పి ఎల్‌డిసి జారీ చేయడం చెల్లదని పిటిషన్ దాఖలు చేశారు. వాదనల తర్వాత పిటిషనర్‌పై ఎల్‌ఒసి అమలును నిలిపేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసిన పట్టాభి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో,అమరావతి బ్యూరో



ఇంద్రజాల విద్యతో ప్రజల్లో మూఢనమ్మకాలను తొలగించడంలో బివి పట్టాభిరామ్ ఎంతో కృషి చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో జన్మించిన ఆయన.. కౌమారదశలో కాలి వైకల్యంతో కలిగిన ఆత్మన్యూనతా భావాన్ని జయించి తనను తాను ఇంద్రజాలికుడిగా, రచయితగా తీర్చిద్దుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్య చదువుతున్న రోజుల్లో ఎంబేర్ రావు అనే ఇంద్రజాలికుడి నుంచి ఆ విద్యను నేర్చుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఆహార సంస్థలో ఉద్యోగం చేస్తూ రోజువారి సాధన చేసేవారు. 1970 దశకం నాటికి స్వతంత్రంగా రెండు, మూడు గంటలపాటు ప్రేక్షకులను కదలనీయకుండా ఇంద్రజాలం ప్రదర్శించే స్థాయికి ఎదిగారు. 1984లో హైదరాబాద్‌లో కళ్లకు గంతలు కట్టుకుని రవీంద్రభారతి నుంచి చార్మినార్ వరకు స్కూటర్ నడిపి ఇంద్రజాల విద్యలో తెలుగునేలపై కొత్త అధ్యాయాన్ని సృష్టించారు. చేతబడి వంటి మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. హిప్నాటిజాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చి పలు రుగ్మతలను పోగొట్టవచ్చని నిరూపించారు. అప్పటి సిఎం ఎన్‌టిఆర్ ప్రోత్సాహంతో ఇంద్రజాలాన్ని జోడించి ప్రభుత్వ పథకాలకు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలకు ప్రచారం కల్పించారు. గోదావరి వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. దూరదర్శన్‌లో కొన్ని సీరియళ్లతో పాటు పలు సినిమాల్లో నటించారు. జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన 'రెండురెళ్లఆరు'లోనూ డాక్టర్ పట్టాభిరామ్‌గానే కనిపించారు. ఈ క్రమంలో సినీ ప్రముఖులు శోభన్‌బాబు, అక్కినేని నాగేశ్వరరావు, జయసుధ, జయప్రద, రాజేంద్రప్రసాద్ తదితరులు ఆయనకు అభిమానులుగా మారిపోయారు. పలు పత్రికల్లో వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు.

పట్టాభిరామ్ మృతి పట్ల గవర్నర్ విచారం

హిప్నాటిజం, ఇంద్రజాలంపై పలు ప్రదర్శనల ద్వారా డాక్టర్ బివి పట్టాభిరామ్ ప్రజల హృదయాలను గెలుచుకున్నారని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజ్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది.

పట్టాభిరామ్ లేని లోటు తీర్చలేనిది : పవన్‌కల్యాణ్

బివి పట్టాభిరామ్ మృతి తీరని లోటని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఇంద్రజాల ప్రదర్శనల ద్వారా వినోదాన్ని పంచడమే కాకుండా మూఢ నమ్మకాలు పారదోలేలా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. పట్టాభిరామ్ మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

'సిగాచి' ప్రమాదంలో ముగ్గురు ఆంధ్రావాసులు మృతి

ప్రజాశక్తి-ముద్దనూరు, చాగల్లు



నిఖిల్ కుమార్‌రెడ్డి, శ్రీరమ్య (ఫైల్ ఫొటో) ప్రసన్న (ఫైల్)

తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి కెమికల్ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు మరణించారు. వీరిలో ఇద్దరు నవదంపతులు ఉన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నిఖిల్ కుమార్‌రెడ్డి (33) ఎన్‌టిఆర్ జిల్లా పుట్రెలకు చెందిన శ్రీరమ్య మూడు నెలల క్రితం ఆర్య సమాజంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో ఇద్దరూ ఉద్యోగంలో చేరారు. సోమవారం జరిగిన ప్రమాదంలో దంపతులిద్దరూ మరణించారు.

తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన యువతి పోలిశెట్టి ప్రసన్న (22) రెండు నెలల క్రితమే ఉద్యోగంలో చేరారు. ఇంతలోనే మరణించడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆమె తండ్రి పోలిశెట్టి శ్రీను చాగల్లులో మధర్ థెరిస్సా సేవా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెలు. ప్రసన్న ఆయన పెద్ద కుమార్తె. ప్రసన్న మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకునే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రతిపక్షంలోనే రాజకీయ ఎదుగుదల

- వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే రాజకీయ ఎదుగుదల ఉంటుందని, ప్రజల కోసం పనిచేసి మంచిపేరు తెచ్చుకుంటే వారే ఆదరిస్తారని వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వైసిపి యువజన విభాగం ప్రతినిధుల సమావేశం మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన జగన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కావడమే లక్ష్యంగా ప్రతి యువజన కార్యకర్త పనిచేయాలని అన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై చిరునవ్వుతో ప్రజలను పలకరించాలని, వారికి కష్టం వస్తే కలిసి పోరాడాలని సూచించారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ముఖ్యమని, వాటిని ఎప్పుడూ పాటిస్తున్నానని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు నాయకుడి దృష్టి పదవుల పంపకంపైనే ఉంటుందని, అందరిపైనా ఉండదని అన్నారు. అటువంటి సమయంలో నాయకుడిగా ఎదగాలంటే ప్రతిపక్షంలోనే అది సాధ్యమవుతుందని వివరించారు. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్‌తో టిడిపి కలిసి నడిచిందని పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీలపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే టిడిపి కలిసి రాలేదని వివరించారు. యువతతో గ్రామ, వార్డు, మండల కమిటీలు ఏర్పాటు కావాలని, పక్కా ప్రణాళికతో చొరవ చూపితే రాజకీయంగా ఎదుగుతారని, దానికోసం అందరూ కలిసి పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం కేసులు బనాయిస్తే తాము చూసుకుంటామని, అధైర్యపడవద్దని అన్నారు. యువజన విభాగం అధ్యక్షుడితో పాటు వర్కింగు ప్రెసిడెంట్లను నియమిస్తామని వివరించారు. సంస్థాగతంగా యువజన, మహిళ, విద్యార్థి, రైతు విభాగాలు బలంగా ఉండాలని, ఎస్‌సి, బిసి విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో వైసిపి యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, వర్కింగు ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు మోసకారి : రాజా

యువతను ముఖ్యమంత్రి చంద్రబాబు వంచించి మోసం చేశారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని వైసిపి యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. తాడేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క హామీని కూడా అమలు చేయకపోగా, నిరుద్యోగ యువతకు ఇస్తానన్న భృతి ఇవ్వకపోగా, ఇంకా మోసం చేసే ప్రకటనలు చేస్తూనే ఉన్నారని విమర్శించారు.

పట్టాభిరామ్ మృతి పట్ల సంతాపం


ప్రముఖ హిప్నాటిస్టు, మెజీషియన్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ బివి పట్టాభిరామ్ మృతి పట్ల వైఎస్ జగన్ జగన్ సంతాపం ప్రకటించారు. పట్టాభిరామ్ రాసిన పుస్తకాలు ఎంతో ప్రాచుర్యం పొందాయని పేర్కొన్నారు.

ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకం

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- డాక్టర్స్ డే సందర్భంగా ఉత్తమ వైద్యులకు సత్కారం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ (విజయవాడ)

ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య విజ్ఞాన విశ్వ విద్యాలయంలో ఉత్తమ వైద్యులను ఆయన మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక ప్రగతికీ, ప్రజల ఆరోగ్యానికీ మధ్య అవినాభావ సంబంధం ఉందన్నారు. నిరంతరం ప్రజా సేవ పట్ల చిత్త శుద్ధి, అంకితభావంతో పనిచేసే వైద్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. వైద్యుల పట్ల ప్రజలు, నాయకుల ధోరణిలో మార్పు రావాలన్నారు. చివరి క్షణం వరకూ రోగుల ప్రాణాలను కాపాడేందుకు శ్రమించే వైద్యులపై దాడులు, దౌర్జన్యాలు మంచిదికాదన్నారు. చికిత్సలో వైద్యులు నిర్లక్ష్యం చేసినట్లు భావిస్తే వాటిని ప్రభుత్వం, ఆయా ఆస్పత్రుల యాజమాన్యాల దష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అత్యధిక భాగం వైద్యులు అంకిత భావంతోనే పనిచేస్తారన్నారు. బాధ్యతా రాహిత్యంతో పనిచేసే వైద్యులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. తప్పు చేసేవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి మాట్లాడుతూ కరోనా విపత్తు సమయంలో వైద్యులు ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు. డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ బి.సి.రాయ్ జయంతి, వర్ధంతిలను డాక్టర్స్ దినోత్సవంగా జరుపుకుంటూ వైద్యులను గౌరవించుకోవడడం హర్షణీయమన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ ఉత్తమ సేవలందిస్తున్న వైద్యులు.. యువ వైద్యులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారన్నారు. పద్మశ్రీ డాక్టర్ ఎం.వి.పద్మశ్రీవాత్సవ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాల్లో వైద్య సేవలు మరింత పెరగాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, డిఎంఇ అకడమిక్ డాక్టర్ జి.రఘునంధనరావు, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, వర్సిటీ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



ప్రఖ్యాత న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎంవి.పద్మ శ్రీవాత్సవను సత్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

విశిష్ట సేవలందించిన 10 మంది వైద్యులకు సత్కారం

వైద్యుల దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో మూడు దశాబ్దాలకుపైగా విశిష్ట సేవలందించిన పది మంది వైద్యులను మంత్రి సత్య కుమార్ ఘనంగా సత్కరించారు. వీరిలో పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత న్యూరాలజిస్ట్ డాక్టర్ పద్మ శ్రీవాత్సవ, ప్రస్తుత డిఎంఇ, ప్రఖ్యాత శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ నరసింహం ఉన్నారు.

రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులు అరెస్టు

- తమిళనాడు, కేరళ, కర్ణాటక బాంబుపేలుళ్ల కేసులో నిందితులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ కేంద్రంలో ఇద్దరు ఉగ్రవాదులను సోమవారం రాత్రి తమిళనాడు యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఎటిఎస్) అరెస్టు చేసింది. వీరిలో అబూబకర్ సిద్ధిఖ్ (నాగూర్), మహ్మద్‌అలీ అలియాస్ యూనుస్ (మేళవలయం) ఉన్నారు. నిందితులను తమిళనాడు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు..తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలో 30 ఏళ్ల కిందట పలు బాంబుపేలుళ్ల కేసులో వీరు నిందితులుగా ఉన్నారు. 1995 సంవత్సరంలో చెన్నై నగరం చింతాద్రి పేటలోని హిందూమున్నాని కార్యాలయంలో బాంబుపేలుడు ఘటన మొదలుకుని 2013 వరకు పలు బాంబుపేలుళ్ల కేసులో వీరు నిందితులుగా ఉన్నారు. 1995 సంవత్సరం నుంచి ప్రధాన నిందితుడైన అబూబకర్‌సిద్ధిఖీ పరారీలో ఉన్నారు. 1995లో నాగూరులో పార్శిల్ బాంబుపేలుడు ఘటనలో తంగం అనే వ్యక్తి మృతి చెందారు. 1999 చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూరు ప్రాంతాల్లో చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయం కేంద్రంగా బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. కేరళలోని ఏడు ప్రాంతాల్లో బాంబులు ఏర్పాటు చేయడం, 2011లో మధురైలో ఎల్.కె అద్వానీ రథయాత్ర సమయంలో పైప్‌బాంబు పేలుళ్లు, 2012లో వెల్లూరులో డాక్టర్ అరవింద్‌రెడ్డిని హత్య చేయడం, 2013లో బెంగళూరు మల్లేశ్వరంలో బిజెపి కార్యాలయం సమీపంలో బాంబుపేలుడు కేసుల్లో నిందితునిగా ఉన్నారు. ఇతని సహచరుడైన మహ్మద్‌అలీ 26 ఏళ్లుగా పరారులో ఉన్నారు. 1999లో తమిళనాడు, కేరళ రాష్ట్రాలో చోటు చేసుకున్న పలు బాంబుకేసుల్లో భాగస్వామిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

9న సమ్మెను విజయవంతం చేయాలి

- కార్మిక, ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా ఈ నెల 9న కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జరగనున్న సమ్మెను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు, రైతులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తులు, మహిళా యువజన విద్యార్థి రాష్ట్ర నేతల సమావేశం ఐక్యవేదిక ఆధ్వర్యాన జరిగింది. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రాంపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని నేతలు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించకూడదని, విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు పెంచుతున్న విధానాన్ని తప్పుబట్టారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, శ్రామిక మహిళా నాయకులు వెంకట సుబ్బరావమ్మ, ఎఐటియుసి డిప్యూటీ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జల్లి విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు వై కేశవరావు, పి జమలయ్య, ఎలమందరావు, వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్‌రెడ్డి, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రాణాలైనా ఇస్తాం..మా భూములివ్వం

- రామకృష్ణాపురం గ్రామస్తుల ప్రతిజ్ఞ
- 8348 ఎకరాలు తీసుకోవడం దారుణం : వ్యకాస

ప్రజాశక్తి- ఉలవపాడు (నెల్లూరు)

ప్రాణాలైనా ఇస్తాం కానీ, మా భూములు, మా ఇళ్లు ఇవ్వబోమని నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోని కరేడు పంచాయతీలోని రామకృష్ణాపురం గిరిజనులు మంగళవారం నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఇండోసోల్ కంపెనీ చేపట్టిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడిన పోరాట యోధులను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేలాది ఎకరాల భూములు తీసుకొని పరిశ్రమలు ఏర్పాటు చేయకపోగా రైతులు, వ్యవసాయ కార్మికుల వద్ద తీసుకున్న భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ లాభాలు గడిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాజెక్టు వల్ల కరేడు, రామకృష్ణాపురం, ఉప్పరపాలెం, పొట్టేనుగుంటలో పేదలు సర్వస్వం కోల్పోతున్నారని తెలిపారు. బాధితులకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రాజెక్టు కోసం 8348 ఎకరాలు ప్రభుత్వం తీసుకోవడం దుర్మార్గమన్నారు. చేవూరులో రామాయపట్నం పోర్టు రోడ్డు కోసం దళితుల దగ్గర తీసుకున్న భూమికి నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని గుర్తు చేశారు. కరేడులో శుక్రవారం జరిగే గ్రామసభలో వేలాదిమంది పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు జివిబి కుమార్, పోరాట కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వెంకటేశ్వర్లు

పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు పూర్తి కావాలి

- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర



ప్రజాశక్తి- తిరుమల

రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగు నీరు అందించాలన్న లక్ష్యంతో సిఎం చంద్రబాబు నాయుడు తలపెట్టిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టులు శ్రీవారి ఆశీస్సులతో పూర్తి కావాలని మంత్రి కొల్లు రవీంద్ర అకాక్షించారు. తిరుమల శ్రీవారిని మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్వామివారి దర్శనం కోసం కాలినడకన వచ్చి తలనీలాలు సమర్పించానని, స్వామివారి ఆశీర్వాదం అందరికి ఉండాలని కోరుకుంటున్నాని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి వైపు అడుగులేస్తోందన్నారు. రాయలసీమలో నీరు పారించాలని సిఎం కషి చేస్తున్నారని, ప్రాజెక్టు పూర్తి కావడానికి స్వామివారి ఆశీస్సులు కావాలని కోరుకున్నానని తెలిపారు.

చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించండి

- మున్సిపల్ కార్మికుల డిమాండ్
- కొనసాగుతున్న ఆందోళనలు


ప్రజాశక్తి - యంత్రాంగం

మున్సిపల్ ఇంజనీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులకు బేసిక్ వేతనం రూ. 21000, టెక్నికల్‌కు రూ.24,500 ఇవ్వాలని, థర్డ్ పార్టీ కార్మికులకు ప్రతినెలా పదిలోపు వేతనాలు చెల్లించాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు మంగళవారం కొనసాగాయి. విజయవాడ ధర్నా చౌక్‌లో వెహికల్ డిపోలో రోజు వారి మరమ్మతులు చేసే వాహనాలను ధర్నా చౌక్ వద్ద ఉంచి, మరమ్మతు పనుల కష్టాలను చూపిస్తూ మెకానిక్స్ తమ నిరసనను తెలియజేశారు. వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తక్షణమే చర్చలకు పిలిచి తమ న్యాయమైన డిమాండ్స్‌ను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఆందోళనకు మున్సిపల్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమ్మెను పరిష్కరించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్చలు జరపాలని కోరారు. నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన



విజయవాడ ధర్నా చౌక్‌లో వాహనాల రిపేర్లను చూపుతూ నిరసన తెలుపుతున్న కార్మికులు

దీక్షలు ఏడవ రోజుకు చేరుకున్నాయి. పొర్లు దండాలు పెడుతూ, తాళం వేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సంక్షేమ పథకాలు, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఆదోనిలో మున్సిపల్ కార్మికులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి ఆందోళన చేపట్టారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల పట్టణ యూనియన్ అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఆప్కాస్‌లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరారు. విజయనగరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. నెల్లిమర్ల మున్సిపల్ కార్యాలయం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకొని, అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, నరసాపురం మున్సిపాల్టీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆందోళన చేపట్టారు.



నంద్యాలలో పొర్లుదండాలు, తాళం వేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు



పురపాలకశాఖ డైరెక్టర్ పి సంపత్ కుమార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయుకులు

4 తరువాత ఏ క్షణమైనా సమ్మెకు సిద్ధం

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపు, సమ్మె కాలపు ఒప్పందాల అమలు, ఎక్స్‌గ్రేషియా పెంపు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4 తరువాత ఏ క్షణమైనా సమ్మె చేయనున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పేర్కొంది. ఈ మేరకు పురపాలకశాఖ డైరెక్టర్ పి సంపత్ కుమార్‌కు, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సమ్మె నోటీసును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు షరతులు లేకుండా వర్తింపజేయాలని, సమ్మెకాలపు ఒప్పందంలోని అంశాలన్నింటినీ అమలు చేయాలని కోరారు. మరణించిన, అనారోగ్యంతో ఉన్న కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రాట్యుటీ చెల్లింపుతోపాటు కోవిడ్ బదిలీ కార్మికులు క్లాప్ డ్రైవర్లకు జిఓ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు గత ఏడేళ్లుగా జీతాల పెంపులో జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే సరిదిద్దాలని, రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఆందోళన, పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. సిఐటియు అనుబంధ సంఘం ఆధ్వర్యాన విజయవాడలో గత ఏడు రోజులుగా, అనకాపల్లి, నర్సీపట్నం, ధర్మవరంలో గత ఐదు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారని, బేషరతుగా కార్మికులు ఆందోళన, సమ్మెను విరమించి విధుల్లో చేరాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలివ్వడం పట్ల రాష్ట్ర కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందన్నారు. ఈ సందర్భంగా పురపాలకశాఖ డైరెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. గత శనివారం సిఎం సమక్షంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చ జరిగిందని, మంత్రుల ఉపసంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని, ఈ పరిస్థితుల్లో సమ్మె చేయడం సరికాదని సూచించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకత్వం స్పందిస్తూ.. గత ఏడాది కాలంగా సిఎం, పురపాలకశాఖ మంత్రి, అధికారులకు పలుమార్లు సమస్యల గురించి వివరించినా ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. మంత్రుల ఉపసంఘం చర్చల పేరుతో కాలయాపనకు దారితీయడం సరికాదని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీలోపు కార్మిక సంఘాలతో సంయుక్త సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ఫెడరేషన్ నాయకులు (ఇంజినీరింగ్ వర్కర్స్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్) బి ముత్యాలరావు, కో-కన్వీనర్ ఎస్ జ్యోతిబసు, రాష్ట్ర నాయకులు చిన్న, శ్రీను, నాగరాజు, దుర్గాప్రసాద్, పూర్ణవెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో 871 మందికి అడ్మిషన్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్ (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటిలో 871 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లోని అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజైన మంగళవారం అర్హులైన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిగింది. ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ మొదటిరోజు బాలురు 126 మంది, బాలికలు 311 మంది మొత్తం 437 మంది, రెండో రోజు బాలురు 134 మంది, బాలికలు 300 మంది మొత్తం 434 మంది అడ్మిషన్లు పొందినట్లు చెప్పారు. అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తాగునీరు, ఆహారం, భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించామన్నారు. శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటిలకు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ నూజివీడులో కొనసాగుతుందన్నారు. ఆర్‌కె వ్యాలీకి సంబంధించి ఇడుపులపాయలో అడ్మిషన్లకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు.

మా గ్రామాల్లోకి రావద్దు

- కార్గో ఎయిర్‌పోర్టు భూ సర్వే పనులు అడ్డగింత



సర్వే అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

పచ్చని ఉద్దానం భూముల్లో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూములు సర్వే చేపట్టేందుకు వచ్చిన సర్వే అధికారులను గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం రాంపురం పంచాయతీ పరిధిలోని ఎం.గంగువాడ, చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని అనకాపల్లిలో సర్వే కోసం అధికారులు గ్రామానికి వెళ్లారు. భూములను సర్వే చేసేందుకు అధికారులు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న స్థానికులు గ్రామం పొలిమేరకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు పేరుతో గ్రామంలోకి అడుగుపెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పచ్చని పంట పొలాల్లో ఎయిర్‌పోర్టు పెట్టడం వల్ల ఎవరికి ప్రయోజనమని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టుతో తమ బతుకులు మారవని, ప్రజాభిప్రాయానికి భిన్నంగా అధికారులు వ్యవహరించవద్దని తెలిపారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో తమ పొలాలు, బతుకుల్లో విధ్వంసానికి అవకాశం ఇవ్వబోమని తేల్చి చెప్పారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

ఐచ్ఛిక సెలవుపై స్పష్టత ఇవ్వాలి : ఆప్టా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


ఉపాధ్యాయులకు ఇచ్చే 5 ఐచ్ఛిక సెలవులు ఎలా వాడుకోవాలనే విషయంపై పాఠశాల విద్యాశాఖ స్పష్టత ఇవ్వాలని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎజిఎస్ గణపతిరావు, కె ప్రకాష్‌రావు కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు మంగళవారం లేఖ రాశారు. గతంలో మండల స్థాయిలో సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు కలిసి నిర్ణయం తీసుకుని మండలం అంతా అదే విధానంలో సెలవులు వాడుకునేవారని చెప్పారు. తాజాగా గత నెల 26న ఉపాధ్యాయుల ఐచ్ఛిక సెలవుల విషయంలో జిల్లా విద్యాశాఖాధికారుల జోక్యంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడినట్లు చెప్పారు. వాట్సాప్‌లో రకరకాల సందేశాలు వస్తున్నాయని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరారు.

గరిష్ట స్థాయికి 'శ్రీశైలం'

- నాలుగైదు రోజుల్లో గేట్లు ఎత్తే అవకాశం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షానికి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో జలాశయం నీటి మట్టం గరిష్టస్థాయికి చేరుకుంది. ఇదే వరద ప్రవాహం కొనసాగితే నాలుగైదు రోజుల్లో గేట్లు ఎత్తే యోచనలో అధికారులు ఉన్నారు. జలాశయ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో కుడి, ఎడమ జల విద్యుత్తు కేంద్రాల నుండి విద్యుత్తు ఉత్పాదన ద్వారా దిగువ నాగార్జునసాగర్‌కు నీరు విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ఎగువ జూరాల నుంచి విద్యుత్తు ఉత్పాదన ద్వారా 30,722 క్యూసెక్కులు, గేట్ల ద్వారా 60,075 క్యూసెక్కులతో మొత్తం 90,797 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి చేరుతుంది. అదే సమయానికి జలాశయం నీటిమట్టం క్రమంగా పెరుగుతూ గరిష్టస్థాయి 885 అడుగులకు 874.80 అడుగులకు ప్రవాహం



చేరింది. నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను ప్రస్తుతం 162.4372 టిఎంసిలుగా నమోదయింది. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో 23,435 క్యూసెక్కులతో మొత్తం 58,750 క్యూసెక్కుల నీటిని విద్యుత్తు ఉత్పాదన ద్వారా దిగువ నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ప్రస్తుతానికి నీటి విడుదలను నిలిపివేశారు.

ఆసియా ఫ్యాక్టరీల్లో మందగింపు

- అమెరికా సుంకాల భయాలు
- అనిశ్చితిలో కార్యకలాపాలు



టోక్యో : ఆసియా ఆర్థిక వ్యవస్థలలోని అనేక ఫ్యాక్టరీల కార్యకలాపాలు మందగించాయి. ఈ ఏడాది జూన్ నెలలో అమెరికా సుంకాల అనిశ్చితి కారణంగా డిమాండ్ తక్కువగా ఉండటంతో స్తబ్దతను ఎదుర్కొంటున్నాయని రాయిటర్స్ ఓ కథనంలో వెల్లడించింది. అయితే ఇటీవల అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చలతో తయారీదారులకు స్వల్ప ఉపశమనం లభించొచ్చని భావిస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో ఆర్థిక పునరుద్ధరణ అవకాశాలు మందగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జపాన్‌లో కొంత తయారీ కార్యకలాపాలు విస్తరించినప్పటికీ అమెరికా సుంకాల అనిశ్చితి కారణంగా కొత్త ఆర్డర్లు కుంచించుకుపోయాయి. దక్షిణ కొరియాలో ఫ్యాక్టరీ కార్యకలాపాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. మే నెలలో చైనాలో 48.3 నుండి కొత్త ఆర్డర్లలో పెరుగుదల చోటు చేసుకోవడం విశేషం. "మొత్తంగా జూన్‌లో తయారీ సరఫరా, డిమాండ్ పునరుద్ధరణ అయ్యాయి. కానీ బాహ్య పరిస్థితులు కఠినంగా, సంక్లిష్టంగా ఉన్నాయి. అనిశ్చితులు పెరుగుతున్నాయి." అని అకైక్సిన్ ఇన్సైట్ గ్రూప్ ఆర్థికవేత్త వాంగ్ జీ పేర్కొన్నారు. భారత్‌లో తయారీ కార్యకలాపాలు 14 నెలల గరిష్ట స్థాయికి చేరుకున్నాయని రాయిటర్స్ పేర్కొంది. ఇది అంతర్జాతీయ అమ్మకాలలో పెరుగుదలను సూచిస్తుంది. మార్చిలో అమెరికా విధించిన సుంకాలు ప్రపంచ వాణిజ్యాన్ని అస్తవ్యస్తం చేసిన విషయం తెలిసిందే. దీర్ఘకాలిక వాణిజ్య సమస్యలు ఇంకా పరిష్కరించబడలేదు. మే నెలలో చైనా ఎగుమతులు 34.5 శాతం తగ్గాయి. ఇది ఫిబ్రవరి 2020 తర్వాత అత్యంత క్షీణత. ఈ పరిస్థితి చైనా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచింది. ఈ సవాళ్ల ఆసియా ఆర్థిక వ్యవస్థలకు ఎగుమతి ఆధారిత వృద్ధిని కొనసాగించడం కష్టతరం చేస్తున్నాయి.

తిరుమలలో డీజిల్ బస్సులకు చెక్...!

- త్వరలో భారీగా ఎలక్ట్రిక్ బస్సులు
- మంగళం డిపోలో ఛార్జింగ్ పాయింట్లు

ప్రజాశక్తి- తిరుమల : తిరుమల ఘాట్ రోడ్డులో బస్సుల పొగ, ధ్వని కాలుష్యం నుంచి యాత్రికులకు ఉపశమనం కలగనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని భారీ ఎత్తున పెంచుతున్నాయి. వాయు, శబ్ద కాలుష్యానికి గురయ్యే ఆధ్యాత్మిక క్షేత్రాల్లో వీటి అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం.. తిరుమల- తిరుపతి మధ్య ప్రయాణించే వాహనాల పరంగా ఎలక్ట్రిక్ బస్సులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే తిరుమలలో 50 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. ఇవి ఘాట్ రోడ్డుల్లో తిరుగుతున్నాయి. వీటితోపాటు మరో 300 ఎలక్ట్రిక్ బస్సులు తిరుమలకు పలు విడతల్లో తిరుమలకు చేరుకోనున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొవచ్చిన ప్రధాన మంత్రి ఈ-బస్ సేవా పథకం కింద రాష్ట్రానికి ఇప్పటికే 750 విద్యుత్ బస్సులు కేటాయించింది. వీటిల్లో 50 బస్సులను తిరుమల- తిరుపతికి కేటాయించారు. 300 విద్యుత్ బస్సులను తిరుమలకు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత నెల కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రికి లేఖ రాశారు. దీనికి సానుకూల స్పందన వచ్చింది. దీనిలో భాగంగా తొలి దశలో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చే 50 బస్సులను మంగళం డిపోకు కేటాయించనున్నారు. భవిష్యత్తులో తిరుమలకు రానున్న 300 బస్సుల్లో 150 బస్సులను తిరుమల డిపోకు, అలిపిరి డిపోకు 50, తిరుపతిలో నిర్మించే కొత బస్ డిపోకు 50 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించనున్నారు. శ్రీకాళహస్తి- తిరుపతి మధ్య మరో 50 బస్సులు నడిపేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. తిరుమలకు భారీ మొత్తంలో ఎలక్ట్రిక్ బస్సులను కేటాయిస్తుండడంతో, సుమారు 150 బస్సులకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్లు, ఇతర సాంకేతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఐదెకరాల స్థలం అవసరం ఉంటుందని అంచనా వేశారు. తిరుమలలో విద్యుత్ బస్సులకు అవసరమైన ప్రత్యేక డిపో కోసం స్థల పరిశీలన కూడా పూర్తి చేసినట్లు ఆర్‌టిసి అధికారులు వెల్లడించారు. త్వరలోనే 50 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్న మంగళం డిపోలో ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు చేస్తున్నామని, బస్సులు వచ్చేలోగా ఈ పనులు పూర్తి చేస్తామని అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడాల్సి ఉందని వెల్లడించారు.

జిఎస్‌టిలో రికార్డు వసూళ్లు

- జూన్‌లో రూ.2,591 కోట్లు రాక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత నెల జిఎస్‌టి వసూళ్లలో రాష్ట్రం రికార్డు సృష్టించింది. జిఎస్‌టి అమలు ప్రారంభించిన తరువాత ఇదే అత్యుత్తమ వసూళ్లు అని, ఈ ఒక్క నెల్లోనే రూ.2,591 కోట్లు వచ్చిందని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ ఎ బాబు ప్రకటించారు. గతేడాది జూన్‌లో ఈ వసూళ్లు రూ.1,419 కోట్లుగా ఉన్నట్లు పేర్కొన్నారు. రద్దయిన చట్టాల ద్వారా, పెట్రో ఉత్పత్తులు, మద్యంపై వ్యాట్, వృత్తి పన్ను వంటి వాటి ద్వారా వచ్చిన వసూళ్లను కూడా వెల్లడించారు.ఈ ఏడాది తొలి త్రైమాసికంలో మొత్తం పన్నుల ఆదాయం రూ.13,361 కోట్లుగా తేలింది. గతేడాది తొలి త్రైమాసికంలో రూ.13,096 కోట్లు రాగా, ఈ ఏడాది 2.02 శాతం పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. అలాగే జూన్ నెల మొత్తం రూ.4,167 కోట్లు పన్నుల ద్వారా వసూలు కాగా, గతేడాది ఇదే నెల్లో రూ.3,910 కోట్లు వచ్చాయి. అలాగే జూన్‌లో ఐజిఎస్‌టి వసూళ్లు రూ.1,365 కోట్లు వచ్చాయని అధికారులు వెల్లడించారు. మొత్తం జూన్ ఆదాయానికి సంబంధించి ఈ ఏడాది రూ.4,168 కోట్లు రాగా, అందులో ఒక్క జిఎస్‌టి ద్వారానే రూ.2,591 కోట్లు, పాత పన్నుల చట్టాల ద్వారా రూ.7 కోట్లు, పెట్రోలియం ఉత్పత్తుల వ్యాట్ ద్వారా రూ.1,435 కోట్లు, మద్యంపై వ్యాట్ ద్వారా రూ.86 కోట్లు, వృత్తి పన్ను ద్వారా రూ.49 కోట్లు వచ్చినట్లు తేల్చారు. గతేడాది జూన్‌లో మొత్తం ఆదాయం రూ.3,910 కోట్లు వచ్చింది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారానే..

పన్నుల ఆదాయం గణనీయంగా పెరగడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ కారణమని అధికారులు తమ నివేదికలో వెల్లడించారు. పన్నుల చెల్లింపులపై స్పష్టమైన కాలపరిమితిని కఠినంగా అమలు చేయడం, చెల్లింపుల విధానాన్ని సరళీకృతం చేయడం, వసూళ్లపై నిరంతర టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, నిరంతర వాహనాల తనిఖీల నిర్వహణ, చెల్లింపుల సెక్యూరిటీ విధానంపై ఆటోమేషన్ అమలు వంటివి అమలు చేయడం వల్లనే ఆదాయం పెరుగుతున్నట్లు వారు వెల్లడించారు. ఇతర శాఖల నుంచి వచ్చిన సమాచారం మేరకు నిర్దిష్ట దర్యాప్తులు నిర్వహించడం, పన్ను ఎగవేతదారులపై నిఘా పెట్టి దాడులు నిర్వహించడం, పన్ను ఎగవేతదారుల బ్యాంకు ఖాతాలను గుర్తించి, రికవరీకి చర్యలు తీసుకోవడం వంటివి కూడా కారణాలుగా వారు తమ నివేదికలో వెల్లడించారు.

వల్లభనేని వంశీకి బెయిల్


ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి నూజివీడు కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. హనుమాన్ జంక్షన్‌లో నకిలీ ఇళ్ల పట్టాలు మంజూరు చేశారంటూ ఆయనపై కేసు నమోదయింది. అదే విధంగా టిడిపి కార్యాలయంపై దాడి కేసులోనూ, ఇంకా కొన్ని కేసుల్లో ఆయన పేరు చేర్చారు. విజయవాడ జిల్లా జైల్లో 137 రోజులుగా ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అన్ని కేసుల్లో ఆయనకు వరుసగా బెయిల్ మంజూరు అయింది. అయితే నకిలీ ఇళ్ల పట్టాల కేసు నెలల తరబడి కొనసాగింది. వంశీ జైల్లో ఉండి ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకసారి ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందారు. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుండి ఆయన విడుదలయ్యారు.



హైదరాబాద్‌లో శ్రీలంక టూరిజం రోడ్‌షో

ప్రజాశక్తి - హైదరాబాద్ : శ్రీలంక టూరిజం ప్రమోషన్ బ్యూరో ఆధ్వర్యంలో శ్రీలంక కన్వెన్షన్ బ్యూరో (ఎస్‌ఎల్‌సిబి) మంగళవారం హైదరాబాద్‌లో రోడ్‌షో క్యాంపెయిన్‌ను నిర్వహించింది. సమావేశాలు, ప్రోత్సాహకాలు, సదస్సులు, ప్రదర్శనలు (మైస్) ఏర్పాటు చేయడం ద్వారా ఇక్కడి పర్యాటకులను మరింత ఆకర్షించాలని నిర్దేశించుకున్నట్లు చెన్నయ్‌లోని శ్రీలంక డిప్యూటీ హై కమిషన్‌లో యాక్టింగ్ డిప్యూటీ హైకమిషనర్ హర్ష రూపరత్నే తెలిపారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి నుంచి మే 31 మధ్య 204,060 మంది భారతీయ సందర్శకులు శ్రీలంకకు వచ్చారన్నారు. తమ దేశాన్ని సందర్శించటానికి భారత ప్రయాణికులను స్వాగతిస్తున్నామన్నారు.

బుమ్రాతో బూమర్ కొత్త క్యాంపెయిన్




న్యూఢిల్లీ : మార్స్ రిగ్లీకి చెందిన చూయింగమ్ బ్రాండ్ బూమర్‌కు క్రికెటర్ జస్ప్రీత్ బూమ్రాతో నూతన క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. దేశ చూయింగమ్ వాడకంలో బూమర్ ఎప్పుడూ ముందంజలో ఉందని మార్స్ రిగ్లీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిఖిల్ రావ్ పేర్కొన్నారు.

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ కొత్త పథకం

న్యూఢిల్లీ : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ యువ ఖాతాదారులను దృష్టిలో పెట్టుకుని కొత్తగా మార్కెట్ లింక్డ్ పథకం అయిన ఐసిఐసిఐ ప్రు స్మార్ట్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్లస్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. ఈ జీవిత బీమా స్కీమ్‌ను కేవలం రూ.1000 నెలవారీ ప్రీమియంతో కొనుగోలు చేయవచ్చని పేర్కొంది. యువత పెద్ద సంఖ్యలో క్రమపద్ధతిలో పెట్టుబడి పెట్టడానికి, తమ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ఇది వీలు కల్పిస్తుందని ఆ సంస్థ ప్రతినిధి అమిత్ పాల్టా పేర్కొన్నారు. జీవిత బీమా రూపంలో కస్టమర్‌లకు ఆర్థిక భద్రతను అందిస్తుందన్నారు.

ఓబెన్ ఎలక్ట్రిక్ 24/7 కస్టమర్ సపోర్ట్ హెల్ప్‌లైన్ ఏర్పాటు



హైదరాబాద్ : విద్యుత్ మోటార్ సైకిల్ తయారీ కంపెనీ ఓబెన్ ఎలక్ట్రిక్ 24/7 కస్టమర్ సపోర్ట్ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. గత మూడు నెలల్లో 90 శాతం సర్వీస్ కేసులు 72 గంటల్లో పరిష్కరించబడ్డాయని ఓబెన్ ఎలక్ట్రిక్ సిఇఒ మధుమిత అగర్వాల్ తెలిపారు. ప్రతి కస్టమర్‌కు ఓబెన్ కేర్ సర్వీస్ సెంటర్లు వేగవంతమైన, పారదర్శకమైన సపోర్ట్‌ను అందిస్తాయన్నారు. ప్రస్తుతం ఈ సంస్థకు 37 షోరూంలు ఉండగా.. వచ్చే మార్చి నాటికి 50 నగరాల్లో 150 అవుట్‌లెట్‌లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సంపాదకీయం

పారిశ్రామిక విషాదం

నవ్వుతూ ఉద్యోగానికి వెళ్లిన కార్మికులు.... బూడిద కుప్పలుగా మారడం, డిఎన్ఎ ఆధారంగా వారి అవశేషాలను గుర్తించాల్సిన దుస్థితి... ఇది ఏమాత్రం క్షంతవ్యం కాదు. నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తూ... ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ ఎర్నింగ్ మనీ... ఈజ్ ఆఫ్ ఇన్వెటింగ్ కార్పొరేట్... అంటూ కార్మికుల భద్రతను గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకమే హైదరాబాద్ శివారు ఔషధ పరిశ్రమలో చోటు చేసుకున్న భారీ విస్ఫోటనం. తెలంగాణ చరిత్రలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రమాదంగా సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ దుర్ఘటన నిలిచిపోయింది. ఇప్పటికి 36 మంది కార్మికులు మరణించగా, మరో 34 మంది తీవ్రంగా గాయపడినట్టు గుర్తించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న 147 మందిలో మిగిలిన వారి కోసం రెండు రోజులుగా గాలింపు కొనసాగుతూనే ఉంది.

హైదరాబాద్ శివారులోని పరిశ్రమల్లోనే గత రెండు మూడు నెలల్లో నాలుగైదు ప్రమాదాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ కూడా అందుకు మినహాయింపేమీ కాదు. విశాఖలో 2020 నాటి ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదం 12 మంది కార్మికులను బలిగొంటే, చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ విషతుల్యంగా మార్చి, వందలమందిని ఆసుపత్రుల పాలు చేసింది. ఆ తరువాత అచ్యుతాపురం సెజ్‌లో 2022 జూన్, ఆగస్టులో 500 మందికిపైగా మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ ప్రమాదంపై నివేదిక అమలు మాట అటుంచి వెలుగుచూసిన పాపానే పోలేదు. గత ఏడాది అచ్యుతాపురం సెజ్ ఎసెన్షియా ఫార్మాలోనే 17 మంది మరణించగా, 38 మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఆరు నెలల్లోనే అనకాపల్లి జిల్లాలో జరిగిన 11 ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా, ఎనిమిదిమంది తీవ్ర గాయాలతో మంచంపట్టారు. పరవాడ ఫార్మాసిటీలో గత ఏడాది విషవాయువుల లీకేజిసహా పలు ప్రమాదాల్లో 10 మంది మరణించగా, 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాలకు తెగించి ప్రాణాంతక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పక్షాన నిలవకుండా, లాభం కోసం భద్రతను గాలికొదిలేసి ప్రాణాలను బలిగొంటున్న పరిశ్రమల అధిపతుల పక్షాన కేంద్ర, రాష్ట్ర పాలకులు నిలవడం మరింత విషాదం. దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రమాదాల్లో రోజూ కనీసం ముగ్గురు కార్మికులు మరణిస్తున్నారు. తనిఖీలను తగ్గించి, స్వీయ ధ్రువీకరణలను అనుమతించడం ద్వారా భద్రతాపరమైన నియంత్రణలను బలహీనపరచడమే భారీ ప్రమాదాలకు కారణమన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ హెచ్చరికలను ఇప్పటికైనా చెవికెక్కించుకోవాలి. యాజమాన్యాలు అత్యాశతో... రసాయన, ఔషధ పరిశ్రమలుసహా వివిధ పరిశ్రమల్లో అత్యంత కీలకమైన స్థానాల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేసే తగిన నైపుణ్యం, విద్యార్హత లేని వారిని, ఇతర రాష్ట్రాల వారిని కాంట్రాక్ట్, డైలీవేజ్ ప్రాతిపదికన నియమిస్తున్నాయి. కాలం చెల్లిన రియాక్టర్లు, యంత్రాలను వినియోగించడంతోపాటు వాటికి దగ్గరగా వెల్డింగ్, షోల్డరింగ్ చేయడం, యంత్రాలు, వాల్వులపై పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బందికి భద్రత పరికరాలు, తగిన శిక్షణ ఇవ్వకపోవడం, భద్రతా తనిఖీలు జరగకపోవడం పలు రసాయనాలను దగ్గరగా నిల్వచేయడం తదితర కారణాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలు నివేదికలు ఘోషిస్తున్నాయి. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసి, తమకు జరిగిన అన్యాయాన్ని, యాజమాన్యాల దుర్మార్గాన్ని ప్రశ్నించలేని స్థితికి కార్మికులను నెట్టేసిన కేంద్రంలోని మోడీ సర్కారే ఈ ఘోరాలకు ప్రధాన ముద్దాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్లకు కొమ్ముకాయడం మాని... ఈజ్ ఆఫ్ డూయింగ్ సేఫ్టీ వర్క్ లాంటి కార్మిక అనుకూల నినాదాలను తీసుకోవడం తక్షణ అవసరం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించి నిత్యం వల్లెవేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా భారీ పరిశ్రమలన్నింటిలో రెగ్యులర్‌గా సేఫ్టీ ఆడిట్ చేయించాలి. పని పరిస్థితులను మెరుగుపరచాలి. పారిశ్రామిక ప్రమాదాలు తరచూ జరిగే విశాఖ, జగ్గయ్యపేట తదితర ప్రాంతాల్లో వంద పడకల బర్న్స్ వార్డులతో కూడిన ఆసుపత్రులు నిర్మించాలి. ప్రతి నెలా అన్ని పరిశ్రమల్లోనూ తనిఖీలు నిర్వహించి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమంతట తాము ఈ చర్యలు చేపట్టవు కనుక ఐక్య ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవాలి.

మహనీయుల మాట




చరిత్ర నిర్మించేది
రాజులూ, సైనిక జనరల్సూ కాదు.
ప్రజలే.
- నెల్సన్ మండేలా,
దక్షిణాఫ్రికా జాతిపిత.



నయా ఫాసిజం-మేధావులు

> **ప్రపంచీకరణ కాలంలో మేధావులలోని చాలా భాగం తమ తమ దేశీయ సమాజాల మూలాల నుండి విడిపోయారు. గ్లోబల్ నెట్‌వర్కింగ్‌లో అంతకంతకూ అంతర్భాగం అయిపోయారు. అందుచేత వారు తమ స్వంత దేశాల శ్రామిక ప్రజానీకానికి దూరం అయ్యారు. దాంతో నయా ఫాసిజానికి ఈ మేధావి వర్గం మీద దాడి చేయడం తేలిక అయిపోయింది. సాధారణంగా మేధావులు ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సహనాన్ని సమర్థిస్తారు. వారి మీద నయా ఫాసిజం దాడికి పూనుకోవడానికి కావలసిన భూమికను నయా ఉదారవాదం రూపొందించింది.**





ప్రభాత్ పట్నాయక్

కమ్యూనిస్టులు తాము పని చేసే ప్రాంతాల్లో స్కూళ్ళను, కాలేజీలను ఏర్పాటు చేసి నిర్వహించడం, అందుకోసం ప్రజల నుండి విరాళాలను సేకరించడం, వాటి నిర్వహణలో ప్రజల తోడ్పాటు తీసుకోవడం పరిపాటి. ఫాసిస్టు సంస్థ ఆరెస్సెస్, దాని సంస్థలు కూడా పిల్లల కోసం స్కూళ్ళను ఏర్పాటు చేసి నడుపుతాయి. ఐతే, ఈ స్కూళ్ళకు, కమ్యూనిస్టులు నడిపే స్కూళ్ళు పూర్తిగా భిన్నం. మొదటిది: కమ్యూనిస్టులు ఏర్పాటు చేసిన స్కూళ్ళను తమ నియంత్రణలో ఉంచాలని గాని, అందులో చదివే విద్యార్థులకు కేవలం తమ ప్రాపంచిక దృక్పథాన్ని మాత్రమే నేర్పాలని గాని భావించలేదు. ప్రజల విద్యా ప్రమాణాలను మొత్తంగానే మెరుగుపరిచే కృషిలో తమ వంతు పాత్ర పోషించాలన్న లక్ష్యంతో వారు స్కూళ్ళు ఏర్పాటు చేశారు. ప్రజలు గనుక తమ విద్యా స్థాయిని మెరుగు పరుచుకుంటే సహజంగానే వారు కమ్యూనిస్టు ప్రాపంచిక దృక్పథం విలువ, ప్రాధాన్యత గ్రహించగలుగుతారు అన్న విశ్వాసం కమ్యూనిస్టులకు ఉంది. కమ్యూనిస్టులు నిర్వహించిన విద్యాసంస్థలు ఈ కారణంగానే ఒక సాధికార, ప్రామాణిక విద్యా సంస్థలుగా రూపొందాయి. రెండవది: పిన్న వయస్సులోనే తమ భావజాలాన్ని ఎక్కించాలన్న ఎత్తుగడతో స్కూళ్ళ ఏర్పాటు మీద ఫాసిస్టులు దృష్టి పెడతారు. కాని కమ్యూనిస్టులు స్కూళ్ళతోబాటు కాలేజీలను కూడా ఏర్పాటు చేసి పరిపక్వత పొందిన యుక్త వయస్కులు అక్కడ తమ తమ భావాలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడాన్ని ప్రోత్సహిస్తారు.

అందుచేత విద్య పట్ల కమ్యూనిస్టుల దృక్పథం వేరు, ఫాసిస్టు దృక్పథం దానికి పూర్తి విరుద్ధం.

"ఆకలితో ఉన్న మనిషి పుస్తకం చేత పట్టుకోవాలని ఆరాటపడతాడు" అని బెర్టోల్ట్ బ్రెక్ట్ రాశాడు. విద్య అనేది మనిషి దృక్పథాన్ని విశాలంగా పెంపొందిస్తుందని, అందుచేత అది విముక్తి పొందడానికి దోహదపడుతుందని దాని భావం. విద్య ఎడల ఫాసిస్టు దృక్పథం ఇందుకు పూర్తి భిన్నం. ప్రజల దృక్పథం ఎంత విశాలంగా పెరిగితే అంతగా అది తిరుగుబాటుకు దారి తీస్తుందని, అందుచేత విద్యను పరిమితుల్లో ఉంచి అదుపు చేయాలని, దాని స్థానంలో ఫాసిస్టు ప్రచార భావజాలాన్ని మాత్రం ఎక్కించాలని వాళ్ళు భావిస్తారు. "ఆకలిగొన్న మనిషిని పుస్తకం చేత పట్టమని" కమ్యూనిస్టులు ప్రోత్సహిస్తే, ఫాసిస్టులు నాజీ జర్మనీలో మాదిరిగా పుస్తకాలను తగులబెట్టమని ప్రోత్సహిస్తారు.

ఈ విషయంలో నేటి నయా ఫాసిస్టులు తమ పూర్వీకుల అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. సమాజంలో మేధావులు సర్వ సాధారణంగా చేపట్టే కార్యక్రమాల పట్ల గాని, ఒక సామాజిక గ్రూపుగా మేధావుల పట్ల గాని వాళ్ళు ప్రదర్శిస్తున్న శత్రుపూరిత వైఖరి ఏ విధంగా చూసినా సమర్థనీయం కానేకాదు. ఇప్పుడు ఎంతో ఉన్నత స్థాయిని సాధించిన విద్యా సంస్థలను వాళ్ళు భారతదేశంలో నాశనం చేస్తున్నట్లే, ఇటువంటి నయా ఫాసిస్టు పాలకులు ఉన్న ఇతర దేశాలలో కూడా చేస్తున్నారు. అమెరికాలో సైతం విద్యా సంస్థలకు ఇదే గతి పడుతోంది. భారతదేశంలో తమ భావాలను ధైర్యంగా, స్వేచ్ఛగా వెల్లడిస్తున్న మేధావుల మీదకు ఇ.డి అధికారులను దాడులకు పంపించి భయభ్రాంతుల్ని చేస్తున్నారు. వారి పట్ల సాధారణ ప్రజల్లో వ్యతిరేకతను రెచ్చగొట్టేలా వారిని "ఖాన్ మార్కెట్ గ్యాంగ్" అని (దీనర్థం ఏమిటో వాళ్ళే చెప్పాలి), "టుక్డే టుక్డే గ్యాంగ్" అని (అంటే ఈ దేశాన్ని ముక్కముక్కలుగా చేసే ముఠా), "అర్బన్ నక్సల్స్" అని అభివర్ణిస్తూ ప్రచారం చేస్తున్నారు. అమెరికాలో యూనివర్సిటీలన్నీ కమ్యూనిస్టులతో నిండిపోయి వున్నాయని, వారందరినీ అక్కడి నుండి తరిమివేయాలని ట్రంప్ ప్రకటించాడు. ఇదేమీ యాదృచ్ఛికం కాదు. నయా ఫాసిస్టు రాజ్యంలో అటువంటి మితిమీరిన అనుమానపు రోగం పాలకులకు అనివార్యంగా కలుగుతుంది.

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాన్ని నాశనం చేయాలని, విశ్వభారతి విశ్వవిద్యాలయం నడవకుండా చేయాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని దెబ్బ తీయాలని, జామియా మిలియా ఇస్లామియాను భయోత్పాతానికి గురి చేయాలని, ఢిల్లీ విశ్వవిద్యాలయాన్ని అస్థిరతపాలు చేయాలని, పూనే ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌ను స్వాధీనం చేసుకోవాలని (దీన్ని వ్యతిరేకిస్తూ అక్కడి విద్యార్థులు చాలా దీర్ఘకాలం పాటు ఆందోళన చేశారు), బరోడా లోని మహారాజా శాయాజీరావ్ యూనివర్సిటీలోని ఫైన్ ఆర్ట్స్ విభాగాన్ని తమ అదుపులోకి తెచ్చుకోవాలని మోడీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం ప్రయత్నించింది. ఈ విద్యా సంస్థలన్నీ ప్రధానంగా స్వాతంత్ర్యానంతరం నిర్మించి పెంపొందించినవే. ఇవన్నీ మన దేశానికి గర్వకారణంగా నిలుస్తాయి. అటువంటి సంస్థల మీద అత్యంత వికృతమైన రీతిలో దాడికి పూనుకోవడం అంటే దానర్థం దేశంలో స్వతంత్రమైన, సృజనాత్మకమైన భావాలు తలెత్తకుండా అణచివేయడమే. భావాల మీద మూఢత్వంతో ఇదే విధంగా ట్రంప్ ప్రభుత్వం కూడా కొలంబియా విశ్వ విద్యాలయం మీద, హార్వర్డ్ విశ్వ విద్యాలయం మీద, ఇంకా ఇతర ప్రఖ్యాత విశ్వ విద్యాలయాల మీద దాడులకు తెగబడుతోంది. స్వతంత్ర ఆలోచనకు విలువనివ్వకుండా మేధోపరమైన కార్యకలాపాలను అణచివేయడం నయా ఫాసిజం స్వభావం అని గ్రహించడం పెద్ద కష్టం ఏమీ కాదు. కాని మన దేశంలో ఈ విషయంలో పరిస్థితిని అర్థం చేసుకోవడం కొంత ప్రశ్నార్థకం గానే తయారైంది. మన దేశంలో మేధావులను ఎప్పుడూ చాలా గౌరవంతో ఉన్నతంగా పరిగణించే లక్షణం ఉంది.

ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడడానికి ముందునుంచీ ఉన్న సాంప్రదాయం. అటువంటి మన దేశంలో ఈ మాదిరిగా మేధావుల మీద, సంస్థల మీద దాడులు ఇంత మోతాదులో ఎలా జయప్రదం కాగలిగాయి? ఇటీవలి దాకా మేధావులను, ముఖ్యంగా విద్యా రంగంలోని వారిని, సామాన్య ప్రజలు చాలా ఉన్నతంగా పరిగణించే పరిస్థితి ఉండేది. అటువంటప్పుడు మోడీ ప్రభుత్వం ఈ విధంగా మేధస్సుపై దాడులకు పూనుకున్నప్పుడు ఆ ప్రజలలో వ్యతిరేకత రావలసినంత స్థాయిలో ఎందుకు రావడం లేదు? అమెరికా పరిస్థితి వేరు. అక్కడ ఫ్యూడల్ నేపథ్యం లేదు. మేధావులను గౌరవంగా పరిగణించిన సాంప్రదాయమూ లేదు. కాని ప్రాచీన వారసత్వం ఉన్న భారతదేశంలో ఎందుకిలా స్పందన కరువైంది?

దీనికి ప్రధానమైన కారణం దేశంలో నయా ఉదారవాద విధానాలు ప్రవేశించడమే. మూడు విధాలుగా నయా ఉదారవాదం ఈ పరిస్థితికి దోహదం చేసింది. మొదటిది: అది ఆదాయాలలో వ్యత్యాసాలను బాగా పెంచివేసింది. మేధావులు అంత ఉన్నతాదాయ వర్గాలవారు కారు. అయినప్పటికీ, దేశంలోని అత్యధిక ప్రజానీకంతో పోల్చుకున్నప్పుడు వారు నయా ఉదారవాద కాలంలో మెరుగుగానే ఉన్నారు. దీనిని వివరించడానికి ఒక ఉదాహరణ ఇస్తాను: 1974లో ఒక క్వింటాలు గోధుమకు కనీస మద్దతు ధర అధికారికంగా రూ.85 లభించేది. ఆ కాలంలో ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ నెల జీతం రూ.1200 ఉండేది. ఇప్పుడు గోధుమ మద్దతు ధర రూ.2275 ఉంది. అసోసియేట్ ప్రొఫెసర్ బేసిక్ వేతనం రూ.1,31,400 ఉంది. విద్యావేత్త ఆదాయం 100 రెట్లు పెరిగితే అన్నదాత ఆదాయం 27 రెట్లు మాత్రమే పెరిగింది. అంటే వీరిద్దరి నడుమ ఆదాయ నిష్పత్తి మూడు రెట్లు పెరిగింది. ఇదే కాలంలో నయా ఉదారవాద విధానాలు అమలయ్యాయి. ఈ కాలంలో విద్యావేత్తలు శ్రామిక ప్రజానీకానికి దూరం కావడం ఆశ్చర్యం కలిగించదు.

రెండవ కారణం: పెట్టుబడిదారీ విధానం అంతకు పూర్వపు సమాజాలలో ఉండిన వివిధ సామాజిక దొంతరలను, సమూహాలను కరిగించివేసి తనలో ఇముడ్చుకుంటుంది. నయా ఉదారవాద విధానాలు ప్రవేశించాక ఫక్తు పెట్టుబడిదారీ పద్ధతులను ఏ మాత్రమూ జంకూ గొంకూ లేకుండా అమలు జరుపుతూ వివిధ ఫ్యూడల్ అవశేష సమూహాలను తనలో కరిగించివేస్తూ ఆ క్రమంలో మేధావులకు, శ్రామిక ప్రజానీకానికి నడుమ అగాధాన్ని పెంచివేసింది.

మూడవది: దీనికి తోడు వ్యక్తివాదం బలపడింది. ప్రపంచీకరణ కాలంలో మేధావులలోని చాలా భాగం తమ తమ దేశీయ సమాజాల మూలాల నుండి విడిపోయారు. గ్లోబల్ నెట్‌వర్కింగ్‌లో అంతకంతకూ అంతర్భాగం అయిపోయారు. అందుచేత వారు తమ స్వంత దేశాల శ్రామిక ప్రజానీకానికి దూరం అయ్యారు. దాంతో నయా ఫాసిజానికి ఈ మేధావి వర్గం మీద దాడి చేయడం తేలిక అయిపోయింది. సాధారణంగా మేధావులు ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సహనాన్ని సమర్థిస్తారు. వారి మీద నయా ఫాసిజం దాడికి పూనుకోవడానికి కావలసిన భూమికను నయా ఉదారవాదం రూపొందించింది.

ఈ మేధావి వర్గం సమాజంలోని అసమానతలను, ప్రత్యేకతలను కనిపించకుండా గందరగోళ పరుస్తుందని, అందుచేత అటువంటి మేధావుల పట్ల శ్రామిక ప్రజానీకంలో గౌరవం తగ్గిపోతే దానిని ఆహ్వానించవలసిందేనని ఎవరైనా భావిస్తే అది పొరపాటు. సమసమాజంలో ప్రత్యేకంగా మేధావులు అని ఎవరూ ఉండరు. ఎందుకంటే అప్పటికి ప్రతీ ఒక్కరూ శ్రమజీవిగాను, మేధావిగాను తయారౌతారు (అటువంటి మార్పు కోసమే కమ్యూనిస్టులు విద్యా సంస్థలను ఏర్పాటు చేయడానికి తాపత్రయ పడతారు). కాని ఇప్పుడు ఆ పేరుతో మేధావుల పాత్రను చిన్నబుచ్చడం చాలా నష్టదాయకం. ఇప్పుడు మన సమాజాన్ని దారీ తెన్నూ లేకుండా, నయా ఫాసిస్టుల బారిన, ప్రేలాపరాయుళ్ళ బారిన వదిలిపెట్టడానికి దోహదం చేస్తుంది. ఆలోచనలు ఒక చిన్న గ్రూపు వరకే పరిమితమైపోయి, వారే ఆ భావాల మీద గుత్తాధిపత్యం చెలాయిస్తూ, ఇతర భావాలను ధ్వంసం చేస్తున్న దశ నేడు రూపొందుతోంది. దానికి భిన్నంగా భావాలను సామాన్య ప్రజానీకం మధ్యకు విస్తృతంగా తీసుకుపోవలసిన అవసరం ఉంది.


కీన్స్ వంటి ఉదారవాద పెట్టుబడిదారీ మేధావి కూడా పెట్టుబడిదారీ సమాజానికి "విద్యావంతులైన బూర్జువాలు" చాలా అవసరం అని భావించాడు. అటువంటివారు సమాజం మీద గణనీయమైన ప్రభావాన్ని చూపగలుగుతారని, వారు ఆ సమాజంలో వ్యక్తం ఔతున్న లోపాలను గుర్తించి వాటిని సరి చేయడానికి తోడ్పడతారని అతడు భావించాడు. కాని నయా ఉదారవాద దశలో తమ స్వంత గోల తప్ప సమాజం గురించి ఏమాత్రమూ పట్టించుకోని మేధావులు తయారయ్యారు. వారు సమాజాన్ని ఏ విధంగానూ ప్రభావితం చేయలేకపోతున్నారు. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పన్నం అయిన ఒక ముఖ్యమైన వైరుధ్యం. భారతదేశం వంటి దేశాల్లో నయా ఫాసిజం అభివృద్ధి చెందడానికి ఇది తోడ్పడింది. ఇప్పుడు శ్రామిక ప్రజలకు, మేధావులకు నడుమ ఏర్పడిన అగాధాన్ని అధిగమించి నయా ఫాసిజాన్ని ఓడించేందుకు అవసరమైన పరిస్థితులను సృష్టించాలి. నయా ఉదారవాదం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభం నుండి అది సాధ్యమౌతుంది. నయా ఉదారవాదంలో తొలుత ప్రత్యేక స్థానాన్ని అనుభవించిన మేధావి వర్గం ఇప్పుడు ఈ సంక్షోభానికి బలి అవుతోంది. క్రమంగా తన ప్రత్యేక స్థానాన్ని కోల్పోతోంది. రైతులతో పోల్చితే ఎక్కువ వేతనాలు విద్యావేత్తలు పొందుతున్నారని మొదట నేను పేర్కొన్నాను. ఐతే ఇటీవల కొన్నేళ్ళుగా వారిలో చాలా మందికి వేతనాలు సకాలంలో చెల్లించడం లేదు. ఈ నయా ఉదారవాద సంక్షోభ కాలంలో విద్యావేత్తలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు క్రమంగా ఈ విద్యావేత్తల భవిష్యత్తును శ్రామిక ప్రజల భవిష్యత్తుతో ముడిపడేలా నెడుతున్నాయి. ఇప్పుడు నయా ఉదారవాద విధానాలతోబాటు నయా ఫాసిజం కూడా ఎదుర్కొంటోన్న సంక్షోభం అన్నింటికీ కేంద్రంగా ముందుకు వస్తోంది.

ఇప్పుడు శ్రామిక ప్రజలకు, మేధావులకు నడుమ ఏర్పడిన అగాధాన్ని అధిగమించి నయా ఫాసిజాన్ని ఓడించేందుకు అవసరమైన పరిస్థితులను సృష్టించాలి. నయా ఉదారవాదం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభం నుండి అది సాధ్యమౌతుంది.

(స్వేచ్ఛానుసరణ)

విశ్లేషణ

పాఠశాలల కుదింపు కోసమే...





కె.ఎస్.లక్ష్మణరావు

> **86వ రాజ్యాంగ సవరణ ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా మార్చిన తర్వాత, దాన్ని అమలు చేయడానికి 2009లో చేసిన జాతీయ విద్యాహక్కు చట్టం 2010 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వచ్చింది. జాతీయ విద్యాహక్కు చట్టం చాలా స్పష్టంగా...ప్రాథమిక పాఠశాల అంటే ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకూ లేదా 1 నుండి 8 తరగతులు నిర్వహించే పాఠశాల అని చెప్పింది. జాతీయ విద్యాహక్కు చట్టాన్ని సవరణ చేయకుండా మన రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలు, టిడిపి కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలు ఏర్పాటు చేయడం ఆ చట్టానికి పూర్తిగా విరుద్ధం.**

గత 15 రోజులుగా రాష్ట్రంలో అనేక జిల్లాలలో తమ నివాస ప్రాంతం లోని పాఠశాలను మూసివేస్తున్నారని లేక తరగతులు తరలిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. కలెక్టర్లకు, ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు అందచేస్తున్నారు. పాఠశాల విద్యలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్నది. గత ప్రభుత్వం ఆరు రకాల స్కూళ్లను ప్రతిపాదించగా కూటమి ప్రభుత్వం ఇప్పుడు తొమ్మిది రకాల పాఠశాలలను ప్రతిపాదించింది. ప్రాథమిక పాఠశాలలో పిల్లలు తగ్గడం, ఉపాధ్యాయులను సర్దుబాటు లేదా రేషనలైజేషన్ చేయడం, స్కూళ్లను విలీనం చేయడం లేదా మూసివేయడం, తల్లిదండ్రులకు నమ్మకం సడలిపోవడం పాఠశాల విద్యలో ప్రధాన సమస్యగా ఉన్నది.

'రాజ్యాంగంలోని 45వ నిబంధన 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్య కల్పించాలని చెప్పింది. 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కులలో 21-ఎ నిబంధన చేర్చి ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా మార్చారు. దీని అమలు కోసం 2009లో జాతీయ విద్యా హక్కు చట్టం ఆమోదించారు.

గత ప్రభుత్వ విధానాలు

2019 మే లో వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాలల్లో నాడు-నేడు పేరుతో మౌలిక వసతులు కల్పించామని, అదే విద్యా రంగ అభివృద్ధి అని ఊదరగొట్టింది. కాని ఆచరణలో జీవో నెం. 117 ద్వారా మొత్తం పాఠశాల విద్యా వ్యవస్థను కుదించటానికి పూనుకున్నది. ఈ జీవో పాఠశాల విద్యకు ఉరితాడుగా మారింది. రేషనలైజేషన్ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు తగ్గించటం, పని భారాన్ని పెంచటం వంటి చర్యలు చేపట్టారు. హైస్కూళ్లలో ఇంగ్లీషు మీడియం ఒక్కటే కొనసాగించి తెలుగు మీడియం రద్దు చేయడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నష్టం జరిగింది. అనేక చోట్ల ఉపాధ్యాయులు లేక పాఠశాలలు విశ్వసనీయత కోల్పోయాయి.

ఆ ప్రభుత్వం ఆరు రకాల స్కూళ్లను ప్రతిపాదించింది. 3 కిలోమీటర్ల లోపు ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను హైస్కూళ్లకు తరలించాలనే నిర్ణయం ప్రాథమిక పాఠశాలల మనుగడను దెబ్బతీసింది. ఒక కిలోమీటర్ లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను తరలించారు. ఉపాధ్యాయ సంఘాల వ్యతిరేకత, పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషి ఫలితంగా అనేక పాఠశాలల్లోని తరగతుల తరలింపును నిలుపుదల చేయించాము. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో 12 వేలకు పైగా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. తరగతుల తరలింపునకు వ్యతిరేకంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేసిన 'బడి కోసం బస్సు యాత్ర' సందర్భంగా వేలాది మంది తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. 3,4,5 తరగతులకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మాత్రమే బోధించాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ స్పష్టంగా పేర్కొన్నది.

కూటమి ప్రభుత్వం-9 రకాల స్కూళ్లు

2024 జూన్‌లో వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వంలో నారా లోకేష్ విద్యామంత్రి కావడంతో విద్యారంగ మార్పులపై అనేక మంది ఆశాభావం వెలిబుచ్చారు. జీవో నెం.117 రద్దు చేసినప్పటికీ, ఇంతకు ముందు ప్రభుత్వం ప్రారంభించిన సంస్కరణలనే కొనసాగిస్తున్నారు. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన "జాతీయ విద్యా విధానం-2020" అమలు చేస్తామని ఆ ప్రభుత్వం, ఈ ప్రభుత్వం కూడా ప్రకటించటమే. జాతీయ విద్యా విధానం-2020లో ప్రతిపాదించిన 5+3+3+4 విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. దీనితో పాటు ప్రపంచ బ్యాంక్‌తో చేసుకున్న 'సాల్ట్' వంటి ఒప్పందాలు పాఠశాల సంఖ్యను, ఉపాధ్యాయ సంఖ్యను తగ్గించాలని స్పష్టంగా నిర్దేశించాయి. వీటిని అమలు చేయటానికి కూటమి ప్రభుత్వం కూడా సంస్కరణల పేరుతో పాఠశాలలను కుదించటానికి పూనుకున్నది.

కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిన 9 రకాల పాఠశాలలు

1. శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ (పి.పి1, పి.పి2), 2. ఫౌండేషన్ స్కూల్ (పి.పి1, పి.పి2, 1,2 తరగతులు), 3. బేసిక్ ప్రైమరీ స్కూల్ (1 నుండి 5 తరగతులు), 4. మోడల్ ప్రైమరీ స్కూల్ (1 నుండి 5 తరగతులు), 5. యు.పి. పాఠశాల (1 నుండి 7 లేక 8 తరగతులు), 6. హైస్కూల్ (6 నుండి 10వ తరగతి వరకు), 7. హైస్కూల్ (1 నుండి 10వ తరగతి వరకు), 8. హైస్కూల్ ప్లస్ (1 నుండి 12వ తరగతి వరకు), 9. హైస్కూల్ ప్లస్ (6 నుండి 12వ తరగతి వరకు).

శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్‌లో పిపి1, పిపి2 తరగతులకు అంగన్వాడీలలో బోధిస్తారు. ఫౌండేషన్ స్కూళ్లు సుమారు 5 వేలు ఉంటాయి. వీటిలో పిపి1, పిపి2 తరగతులకు అంగన్వాడీలు, 1,2 తరగతులు బోధించటానికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను ఇస్తారు. బేసిక్ ప్రైమరీ స్కూల్స్ 19 వేలు ఉంటాయి. వీటిలో విద్యార్థుల సంఖ్యను బట్టి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయలను కేటాయిస్తారు.

విద్యాశాఖ నూతనంగా 9,700 మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేసి, వాటిలో ఐదుగురు ఉపాధ్యాయులు అంటే తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఐదు గదులు ఉండేలా చేయాలని ప్రయత్నిస్తున్నది. కొన్ని యు.పి పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసింది. కాని అదే సమయంలో అనేక యు.పి పాఠశాలలను డౌన్‌గ్రేడ్ చేసి ప్రాథమిక పాఠశాలలుగా మార్చింది. ఈ మార్పులతో మోడల్ ప్రైమరీ పాఠశాలలు కొంతవరకు కొనసాగడానికి అవకాశముంది. కానీ ఐదు వేల సంఖ్యలో ఉన్న ఫౌండేషన్ స్కూళ్లు, 19 వేలుగా ఉన్న బేసిక్ ప్రైమరీ స్కూళ్లు భవిష్యత్తులో కొనసాగడం కష్టమే. అంటే సుమారు 24 వేల పాఠశాలలు మూతపడే ప్రమాదం కనబడుతున్నది. హైస్కూళ్లలో 'హైస్కూల్స్ ప్లస్' పేరుతో ఏర్పాటు చేసిన 'ప్లస్ 2' తరగతులు కూడా కొనసాగుతాయా? లేదా? అనే సందిగ్ధత నెలకొన్నది. తగిన సంసిద్ధత లేకుండానే అంటే అధ్యాపకులు, తరగతి గదులు, ల్యాబ్‌లు, ప్రచారం లేకుండానే హైస్కూళ్లలో 'ప్లస్ 2' ప్రారంభించినప్పటికీ తగిన ఆదరణ పొందలేకపోయాయి.

జాతీయ విద్యా హక్కు చట్టానికి విరుద్ధం

86వ రాజ్యాంగ సవరణ ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా మార్చిన తర్వాత, దాన్ని అమలు చేయడానికి 2009లో చేసిన జాతీయ విద్యాహక్కు చట్టం 2010 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వచ్చింది. జాతీయ విద్యాహక్కు చట్టం చాలా స్పష్టంగా...ప్రాథమిక పాఠశాల అంటే ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకూ లేదా 1 నుండి 8 తరగతులు నిర్వహించే పాఠశాల అని చెప్పింది. జాతీయ విద్యాహక్కు చట్టాన్ని సవరణ చేయకుండా మన రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలు, టిడిపి కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలు ఏర్పాటు చేయడం ఆ చట్టానికి పూర్తిగా విరుద్ధం. ప్రాథమిక పాఠశాలలు, హైస్కూల్స్ మాత్రమే కొనసాగాలి.

పాఠశాల విద్యాశాఖ ఏమి చేయాలి?

విద్యామంత్రి నారా లోకేష్ పాఠశాల విద్యలో సంస్కరణలు, మార్పులు కేవలం అధికారులతోనే కాకుండా విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు మొదలైన వారితో వివరంగా చర్చించాలి. నారా లోకేష్ విద్యాశాఖకు సమయాన్ని కేటాయించాలి. కేరళ, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో పాఠశాల విద్యలో మార్పులను అధ్యయనం చేయాలి. కార్పొరేట్ సంస్థలకు సవాలు విసిరేలాగా పాఠశాలల ఆధునికీకరణ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా చర్యలు చేపట్టాలి. 9 రకాల స్కూళ్లను రద్దు చేసి, ప్రాథమిక పాఠశాలలు అన్నింటిని తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి తరగతికి ఒక గది ఉండే విధంగా తీర్చిదిద్దాలి. ఈ విద్యా సంవత్సరంలోనే ప్రభుత్వ పాఠశాలలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన చోట పిల్లల చేరిక బాగా ఉన్నదని అనేక ప్రతికలలో వార్తలు వచ్చాయి. తల్లిదండ్రులకు నమ్మకం, విశ్వాసం కలిగే విధంగా పాఠశాలలను రూపొందించాలి.

ఉపాధ్యాయుల బాధ్యత

క్షేత్ర స్థాయిలో విద్యార్థులతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండేది ఉపాధ్యాయులు మాత్రమే. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణలో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులు బాగా పనిచేయటం లేదనే ప్రచారం కొనసాగుతున్నదని ఉపాధ్యాయులు గమనించాలి. దీనికి ఒకటే మార్గం. చరిత్ర నిర్మాతలు ప్రజలే. మనం పని చేసే గ్రామాన్ని, ప్రజలను, పాఠశాలను ఉపాధ్యాయుడు ప్రేమించాలి. మన దగ్గర చదివే బిడ్డలను ప్రేమించి వారందరి అభిమానం పొందాలి. అవసరమైతే పాఠశాలలో ఒక గంట అదనంగా గడపాలి. విద్యను సృజనాత్మకంగా బోధించాలి. పిల్లలతో మమేకం కావాలి. అప్పుడు మాత్రమే ప్రజల సహకారంతో ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానలకు ఓడించగలుగుతాం. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలనే నినాదాన్ని ఉపాధ్యాయులు ఆచరణలో చూపించవలసిన అవసరమున్నది.

దార్శనికత కరువు

ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో దార్శనికత కొరవడింది. సమగ్ర శిక్ష వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు బలమైన పాఠశాల విద్యా వ్యవస్థ రూపొందించుకోవడానికి ప్రణాళికలు అమలు చేశాయి. కేరళలో అన్ని ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. కేరళలోని ప్రతి ప్రాథమిక పాఠశాలలో 200 నుండి 400 మంది వరకు పిల్లలు ఉండి అన్ని సౌకర్యాలతో తల్లిదండ్రులకు విశ్వాసం కలిగించే విధంగా ఉన్నాయి. మన రాష్ట్రంలో దీనికి భిన్నంగా అనేక పాఠశాలలు 20 లేక 30 పిల్లలు, ఒకరు లేక ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే పాఠశాలలుగా మారాయి. సమగ్ర శిక్ష విద్యాశాఖకు సమాంతరంగా నడుస్తూ శిక్షణ, పర్యవేక్షణ పద్ధతులు ప్రవేశపెట్టి పాఠశాల విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసింది.

రాష్ట్రంలో పాఠశాల విద్యను పరిరక్షించాలంటే సమగ్ర దృక్పథం, దార్శనికత అవసరం. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానం-2020 నేపథ్యంలో రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన 9 రకాల పాఠశాలలను రద్దు చేసి, ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి చర్యలు చేపట్టాలి.

/ వ్యాసకర్త శాసనమండలి మాజీ సభ్యులు,
సెల్ : 8309965085 /

'కోల్‌కతా' ఘటనకు వ్యతిరేకంగా
విద్యార్థులు, న్యాయవాదుల నిరసన ప్రదర్శన



కోల్‌కతా : దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించిన కాలేజీ ఆవరణలోనే సామూహిక అత్యాచార ఘటనపై దక్షిణ కోల్‌కతా లా కాలేజీ విద్యార్థులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాలేజీ ముందు జరిగిన ఈ ప్రదర్శనలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని, న్యాయం కోసం నినాదాలు చేశారు. అలాగే కాలేజీ పాలక మండలిలో సమగ్ర సంస్కరణలు కోసం డిమాండ్ చేశారు. ఈ ఘటనలో బాధ్యులైన వారికి తమ కళాశాలలో స్థానం ఉండకూడదని ఒక విద్యార్థి తెలిపారు. ఇలాంటి వ్యక్తులు తమ కళాశాల ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. కాలేజీ అధికారులు తమకు భద్రత కల్పిస్తారనే పూర్తి నమ్మకంతో మా తల్లిదండ్రులు ఇక్కడకు పంపారని, కానీ మాకు ప్రతిఫలంగా ఏమి లభించిందని ఒక విద్యార్థి ప్రశ్నించారు. అలాగే, మరోవైపు అలీపోర్ కోర్టు ఆవరణలో కూడా కోర్టుకు సంబంధించిన దాదాపు వంద మంది న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ఘటనకు పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ క్యాంపస్ చుట్టూ ర్యాలీ చేశారు. విచారణ సమయంలో అత్యాచార నిందితుల తరఫున ఏ న్యాయవాది కూడా వాదించకూడదని డిమాండ్ చేశారు. ప్రధాన నిందితుడు ప్రాక్టీస్ చేస్తున్న లాయర్ కావడం సిగ్గు చేటని, ఇక క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నప్పటికీ అతనికి లాయర్ లైసెన్స్ ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. కాగా, ఈ కేసులో ప్రధాన నిందితుడు, తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు, సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగి అయిన మోనోజిత్ మిశ్రాను పదవి నుంచి తొలగించారు. మరో ఇద్దరు నిందితులు, కళాశాల విద్యార్థులు జైబ్ అహ్మద్, ప్రమిత్ ముఖర్జీలను కాలేజీ నుంచి శాశ్వతంగా తొలగించారు. ఈ మేరకు మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ ముగ్గురు శాశ్వతంగా కాలేజీ బహిష్కరిస్తున్నట్లు కాలేజీ వైస్-ప్రిన్సిపాల్ నయన ఛటర్జీ తెలిపారు.

జగన్ భద్రతపై నిర్లక్ష్యం
- హైకోర్టులో వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

మాజీ సిఎం వైఎస్ జగన్‌కు జడ్ ప్లస్ భద్రత ఉన్నప్పటికీ వాటిని కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ ఆయన న్యాయవాది ఎస్ శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. జగన్ పర్యటనకు వెళ్లిన ప్రతిచోటా అవాంఛనీయ ఘటనలు జరిగే విధంగా ప్రభుత్వం పోలీసుల ద్వారా చేయిస్తోంది. జనాన్ని నియంత్రించడం నిర్లక్ష్యం ఉంది. జడ్ ప్లస్ భద్రత ఉన్న వ్యక్తులకు రక్షణ కల్పించే నిబంధనలను తిలోదకాలిచ్చింది. ఈ నెల 3న జగన్ నెల్లూరు పర్యటనకు వెళుతున్నారు. అక్కడ భద్రత కల్పించేలా పోలీసులకు ఉత్తర్వులివ్వాలి. తగిన హెలిప్యాడ్ ఏర్పాటు చేసే విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా ఉంది' అని వాదించారు. జగన్ నెల్లూరు పర్యటన వివరాలు అందజేయాలని పోలీసులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు పర్యటనకు వస్తున్న సందర్భంగా తాత్కాలిక హెలిప్యాడ్ ఏర్పాటు చేసేలా ఉత్తర్వులివ్వాలంటూ వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి వేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌పై విచారణను బుధవారానికి వాయిదా వేశారు. ప్రభుత్వ ప్లీడర్ యతీంద్రదేవ్ వాదనలు వినిపిస్తూ, కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్నారని, జైలుకు సమీపంలో హెలిప్యాడ్ సిద్ధం చేసుకుంటే అభ్యంతరం లేదన్నారు.

బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

(గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనం అక్రమాలపై విజయవాడ సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ ఇవ్వాలంటూ పి మధుసూదన్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైసిపి నేతలకు నోటీసులిస్తాం : హైకోర్టుకు తెలిపిన పోలీసులు

మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేశ్వర్‌రెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, వైసిపి అధికార ప్రతినిధి యనమల సాయి నాగార్జునకు బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులిచ్చాకే విచారణ చేస్తామని పోలీసులు హైకోర్టుకు హామీ ఇచ్చారు. దీంతో వాళ్లు వేసిన పిటిషన్లపై విచారణను ముగిస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ జగన్ రెంటపాళ్ల గ్రామ పర్యటనకు వచ్చినప్పుడు తాము ట్రాఫిక్ జామ్ అయ్యేలా చేశామంటూ రెంటపాళ్ల విఆర్ఒ బూసిరాజు లక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టేయాలంటూ వైసిపి నేతలు పిటిషన్‌పై విచారణ ముగించింది.


పిన్నెల్లి సోదరులపై కఠిన చర్యలొద్దు : హైకోర్టు

టిడిపికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్య కేసులో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోరాదని, కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణ వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, గుండ్లపాడుకు చెందిన టిడిపి నేతలు గత నెల 24న హత్యకు గురయ్యారు. టిడిపి నేతల మధ్య అంతర్గత పోరులో వారు హత్యకు గురయ్యారని, అయితే, రాజకీయ ఒత్తిళ్ల తర్వాత పోలీసులు తమపై కేసు బనాయించారని పిన్నెల్లి సోదరుల తరఫున సీనియర్ న్యాయవాది మనోహర్ రెడ్డి వాదించారు. పోలీసుల తరఫున పిపి మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ, పోలీసుల దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో పిటిషనర్లకు వెసులుబాటు ఇవ్వొద్దని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు స్పందిస్తూ.. పిన్నెల్లి సోదరులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది.

తొక్కిసలాటకు ఆర్‌సిబిదే బాధ్యత
- బెంగళూరు ఘటనపై ట్రిబ్యునల్ వ్యాఖ్య
- అధికారిపై సస్పెన్షన్ రద్దు

బెంగళూరు : ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఛాంపియన్‌గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) విజయోత్సవ ర్యాలీలో తొక్కిసలాట చోటుచేసుకున్న ఘటనకు భారీ జనసమీకరణే కారణమని, ఇందుకు ఆర్‌సిబిదే బాధ్యత అని కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (సిఎటి) వ్యాఖ్యానించింది. ఈ ఘటనకు సంబంధించి నగర అదనపు పోలీస్ కమిషనర్ (పశ్చిమం) వికాశ్ కుమార్ వికాశ్‌ను కర్ణాటక ప్రభుత్వం సస్పెన్షన్ చేయడాన్ని సిఎటి తప్పుపట్టింది. సస్పెన్షన్‌ను రద్దు చేసింది. ఆయన్ను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సరైన ఆధారాలు లేకుండా, యాంత్రిక పద్ధతిలో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారని విమర్శించింది. ఇదే ఉత్తర్వుల ద్వారా సస్పెన్షన్ చేసిన ఇతర అధికారుల విషయంలోనూ ప్రభుత్వం ఇదే విధంగా వ్యవహరించిందని పేర్కొంది. మాజీ నగర పోలీసు కమిషనర్ బి. దయానంద, మాజీ డిసిపి (సెంట్రల్) హెచ్‌టి శేఖర్, కబ్బన్ పార్క్ మాజీ ఎసిపి బాలకృష్ణ, కబ్బన్ పార్క్ మాజీ ఇన్‌స్పెక్టర్ గిరీష్ అనే ఇతర నలుగురు అధికారులను కూడా ఇదే ఉత్తర్వు ద్వారా ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. సిఎటి జస్టిస్ బి.కె. శ్రీవాస్తవ, అడ్మినిస్ట్రేటివ్ సభ్యులు సంతోష్ మెహ్రా జారీ చేసిన ఆదేశాల్లో పోలీసులు కూడా మనుషులేనని వ్యాఖ్యానించారు. తక్కువ సమయంలో తగిన ఏర్పాట్లు చేయడానికి వారు 'మాంత్రికులు కాదు' అని తెలిపారు. అలాగే, ఈ కార్యక్రమానికి భారీగా జనం హాజరుకావడానికి ఆర్‌సిబిదే బాధ్యతని వ్యాఖ్యానించింది. ఆర్‌సిబి తన సోషల్ మీడియా ఖాతాల్లో ఈ విజయ పరేడ్ గురించి పదేపదే ప్రకటనలు జారీ చేసిందని, కనీసం ఐదు లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోందని తెలిపింది. పోలీసుల నుంచి ఆర్‌సిబి పోలీసుల నుంచి సరైన అనుమతి, సమ్మతిలను తీసుకోలేదని విమర్శించింది. అదేవిధంగా కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కెఎస్‌సిఎ) కూడా నిబంధనలు ఉల్లంఘించిందని సిఎటి తెలిపింది. ఈ ఘటనకు అంటే జూన్ 3న పోలీసులకు ఇచ్చిన లేఖలో అనుమతి మంజూరు చేయమని లేదా భద్రతా ఏర్పాట్లు చేయమని కూడా కెఎస్‌సిఎ కోరలేదని విమర్శించింది. అయినప్పటికీ పోలీసులు వీలైనంత వరకూ సరైన ఏర్పాట్లు అందించారని పేర్కొంది.

మమ్దానీపై ట్రంప్ మరోసారి విమర్శ
- అతను నిజమైన కమ్యూనిస్టు
- అమెరికాలో సోషలిజం ఉండదంటూ ఆక్రోశం



న్యూయార్క్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ న్యూయార్క్ సిటీ మేయర్ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ పై మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "అతను కమ్యూనిస్ట్ , అమెరికాలో సోషలిజం ఉండదని నేను చెప్పాను. అతను నగరానికి నష్టం కలిగిస్తాడు" అని ట్రంప్ మరోసారి విమర్శించారు. పాలస్తీనా ప్రతిఘటనకు మద్దతుగా ఉపయోగించే " గ్లోబలైజ్ ది ఇంతిఫాదా "అనే పదాన్ని ఖండించడానికి మమ్దానీ నిరాకరించడంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.."అతను పూర్తి వెర్రివాడు. న్యూయార్క్ ప్రజలు ఇలాంటి వ్యక్తిని ఎన్నుకోవడం పిచ్చితనం. గ్రాసరీ స్టోర్లు, డిపార్ట్‌మెంట్ స్టోర్లను నడపాలని చూస్తున్నాడు. ఇది దారుణం" అని ట్రంప్ మంగళవారం విలేకరులతో అన్నారు. జోహ్రాన్ మమ్దానీ డెమొక్రటిక్ సోషలిస్ట్ గుర్తించబడ్డారు. ఆయన జూన్‌లో న్యూయార్క్ సిటీ మేయర్‌గా డెమొక్రటిక్ పార్టీ ప్రైమరీలో సోషలిస్ట్ విధానాలకు అనుగుణమైన అంశాలను ప్రచారం చేసి గెలిచిన సంగతి తెలిసిందే. ఆదివారం ఎన్‌బిసి న్యూస్‌తో జరిగిన ఇంటర్వ్యూలో మమ్దానీ "గ్లోబలైజ్ ది ఇంతిఫాదా" అనే పదాన్ని ఖండించ లేదు. "భాషను నియంత్రించడం నా పని కాదు" అని ఆయన స్పష్టం చేశారు. మమ్దానీని లక్ష్యంగా చేసుకోని ట్రంప్ విమర్శించడంతో జాతీయ స్థాయిలో ఆయనకు సానుకూలత పెరుగుతుందని, న్యూయార్క్ మేయర్ ఎన్నికలపై ప్రభావం పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ముగిసిన టాఫె, అగ్కో వివాదం

చెన్నయ్ : బ్రాండ్ హక్కులు, వాణిజ్య ఒప్పందాలు, వాటాలపై సమగ్ర ఒప్పందం కుదుర్చుకున్నట్లు టాఫె, అగ్కో తెలిపాయి. ప్రపంచంలోని అతిపెద్ద ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాల తయారీదారులలో ఒకటైన టఫె, బ్రాండ్ హక్కులు, వాణిజ్య అంశాలు, వాటాలపై అగ్కోతో సమగ్ర అవగాహనకు వచ్చినట్లు పేర్కొంది. అగ్కో అధినంలో ఉన్న 20.7 శాతం ఈక్విటీ వాటాను 260 మిలియన్ డాలర్లతో కొనుగోలు చేయనున్నట్లు టాఫె తెలిపింది.

భారత్, పాక్‌ల మధ్య ఖైదీలు, మత్స్యకారుల జాబితా మార్పిడి

న్యూఢిల్లీ : భారత్, పాకిస్తాన్ తమ అదుపులో ఉన్న ఖైదీలు, మత్స్యకారుల జాబితాను మంగళవారం మార్పిడి చేసుకున్నాయి. ఈమేరకు భారత విదేశీ మంత్రిత్వశాఖ ప్రకటన విడుదల చేసింది. 2008 కాన్సులర్ యాక్సెస్ ఒప్పందం ప్రకారం, ప్రతీ సంవత్సరం జనవరి1, జులై1 వ తేదీల్లో ఈ జాబితాలను ఇరు దేశాలు ప్రకటిస్తాయి. భారత్ తన అదుపులో ఉన్న 382 మంది ఖైదీలు, 81 మంది మత్స్యకారుల జాబితాను పాకిస్తాన్‌కి అందచేయగా, పాక్ తన అదుపులో ఉన్న 53 మంది ఖైదీలు, 193 మంది మత్స్యకారుల జాబితాను భారత్‌కి పంపింది.

సిఎం హెలికాప్టర్, ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)

విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రయాణిస్తున్న హెలికాప్టర్, బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 214 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్ అయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని కాపవరంలో జరిగే పి-4 కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం 10.20 గంటలకు ఉండవల్లిలోని స్వగృహం వద్ద నుండి హెలికాప్టర్లో రాజమండ్రికి బయలుదేరారు. మేఘాలు కమ్ముకుని ఉండడంతో ప్రయాణం ముందుకు సాగే వాతావరణ పరిస్థితి లేకపోవడంతో పైలెట్ వెనక్కి తిరిగి వచ్చి గన్నవరం విమానాశ్రయంలో ఉదయం 10.40 గంటలకు అత్యవసరంగా ల్యాండింగ్ చేశాడు. దీంతో సిఎం చంద్రబాబు ఉదయం 11.15 గంటలకు ప్రత్యేక విమానంలో రాజమండ్రి వెళ్లారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన కాపవరం వెళ్లి కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 214 మంది ప్రయాణికులతో సాయంత్రం బయలుదేరిన ఇండిగో విమానం కూడా వాతావరణం అనుకూలించకపోవడంతో రాత్రి 9.20 గంటల సమయంలో గన్నవరం విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. ప్రయాణీకులతో హైదరాబాద్ వెళ్లిన విమానం ల్యాండ్ అయ్యేందుకు వాతావరణం అనుకూలించలేదు. దీంతో పైలెట్ గన్నవరం విమానాశ్రయానికి వచ్చి అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఏమైందో తెలియక ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. గన్నవరంలో అత్యవసరంగా ల్యాండ్ అవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఆందోళనకు గురైన ముగ్గురు ప్రయాణీకులు గన్నవరంలో విమానం నుండి దిగిపోయారు. అర్ధగంట సేపు ఇక్కడే ఉండిపోయిన విమానం రాత్రి 9.50 గంటల సమయంతో మిగిలిన ప్రయాణీకులతో తిరిగి హైదరాబాదుకు బయలుదేరి వెళ్లింది.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా

అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, 1వ అంతస్తు, ప్లాట్ నెం. 50, శ్రీనగర్ కాలనీ, రోడ్ నెం. 3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073,
ఫోన్: 040-23755686/23745686
ఇ-మెయిల్: hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్: www.karnatakabank.com
CIN: L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

స్థిరాస్తుల అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన.

రుణదాతకు మార్టిగేజి చేసిన/చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను **కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్,** అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడినదని, సదరు ఆస్తులను రుణదాతచే **"ఎక్కడ ఉన్నది అక్కడే" "ఉన్నది ఉన్నట్లే"** మరియు **"యదాతథం"** ప్రాతిపదికపై **30.07.2025** అమ్మకానికి తెలిపిన తేదీన విక్రయించబడునని దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు బకాయిపడిన మొత్తాన్ని వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించబడుచున్నవని సాధారణప్రజలకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)లకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

గుంటూరు బ్రాంచ్- 0863-2222444 (బి), 0863-2256148 (బిఎం), 9985202444 (బిఎం), 9676444469 (ఎబిఎం),

వ.నెం. 1: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, స్వాధీనతా యొక్క తేది మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: 1) మెస్సర్స్ అంజలి సుచరిత కాటన్ ట్రేడర్స్ ప్రతినిధిగా దాని ప్రొప్రైట్రిక్స్ శ్రీమతి శశికళ కూనంనేని, చిరునామా: నెం. 63/3, కేరాఫ్ శ్రీ రామ్ కాటన్ గిన్నింగ్ మిల్, యూనిట్ 1, ఏటుకూరు రోడ్, మహాలక్ష్మిపురం, గుంటూరు-522003, **(2) శ్రీమతి శశికళ కూనంనేని, భర్త శ్రీ శ్రీనివాస హరి ప్రసాద రావ్ కూనంనేని, 3) శ్రీ వెంకట సుబ్బారావ్ గోగినేని తండ్రి శ్రీ లక్ష్మీనారాయణ,** చిరునామా: నెం. 3-8, హైస్కూల్ రోడ్, పెదరావూరు, గుంటూరు-522202, **(4) శ్రీ శ్రీనివాస హరి ప్రసాద రావ్ కూనంనేని తండ్రి శ్రీ పుల్లయ్య,** ఇరువురి (2) & (4) ల చిరునామా: డి.నెం. 13-15-37, రామాలయం వీధి, పినపాడు, తెనాలి, గుంటూరు-522202. **నిర్మాణాత్మక స్వాధీనతా తేదీ: 08.07.2022 మరియు 27.09.2022. బకాయి మొత్తం: PSOD ఖాతా నెం. 2557000600475501** క్రింద **రూ. 1,70,58,826.49 (రూపాయలు ఒక కోటి డెబ్బై లక్షల యాభై ఎనిమిది వేల ఎనిమిది వందల ఇరవై ఆరు మరియు పైసలు నలభై తొమ్మిది మాత్రమే)** ప్లస్ **01.08.2021** నుండి తదుపరి వడ్డీ ప్లస్ ఖర్చుల క్రింద వర్తించును.

స్థిరాస్తుల యొక్క వివరణ:

ఐటం నెం. 1: శ్రీమతి శశికళ కూనంనేని కి చెంది ఉండి గుంటూరు జిల్లా, తెనాలి మున్సిపాలిటీ, చెరువు మరియు పోతరాజు టెంపుల్ దగ్గర, పినపాడు ఎక్స్‌టెన్షన్, 16వ బ్లాక్, 1వ వార్డు, టి.ఎస్ నెం. 574/2 వద్ద డోర్ నెం. 13-17-6 ఆవరణలో 152 చ॥గ॥ల విస్తీర్ణము కలిగిన నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **డీడ్ ప్రకారం/వాస్తవ సరిహద్దులు: తూర్పు:** 20' వెడల్పు జాయింట్ బజార్/20' వెడల్పు జాయింట్ బజార్, **దక్షిణం:** సిహెచ్ వెంకట రత్నం యొక్క ఆస్తి/సిహెచ్ వెంకట రత్నం యొక్క ఆస్తి, **పడమర:** ఎస్‌కె. బుడె సాహెబ్ యొక్క ఆస్తి/ఎస్‌కె. బుడె సాహెబ్ యొక్క ఆస్తి, **ఉత్తరం:** పి. వెంకట ఆది నారాయణ & ఇతరులకు చెందిన ఆస్తి/పి. వెంకట ఆదినారాయణ & ఇతరులకు చెందిన ఆస్తి. **అక్షాంశము: 16.231100'N మరియు రేఖాంశము: 80.6345689'E.**

రిజర్వు ధర: రూ. 11,00,000.00 (రూపాయలు పదకొండు లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 1,10,000.00 (రూపాయలు ఒక లక్ష పది వేలు మాత్రమే)

ఐటం నెం. 2: శ్రీమతి శశికళ కూనంనేని కి చెంది ఉండి గుంటూరు, తెనాలి మున్సిపాలిటీ, చెరువు మరియు పోతరాజు టెంపుల్ దగ్గర, పినపాడు ఎక్స్‌టెన్షన్, 16వ బ్లాక్, 1వ వార్డు, టి.ఎస్ నెం. 574/2 వద్ద డోర్ నెం. 13-17-6 దగ్గర 153.77 చ॥గ॥ల విస్తీర్ణము కలిగిన నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **డీడ్ ప్రకారం/వాస్తవ సరిహద్దులు: తూర్పు:** 20' వెడల్పు జాయింట్ బజార్/20' వెడల్పు జాయింట్ బజార్, **దక్షిణం:** కె. సీతారావమ్మ యొక్క ఆస్తి/కె. సీతారావమ్మ యొక్క ఆస్తి, **పడమర:** ఎస్‌కె. బుడె సాహెబ్ & ఇతరులకు చెందిన ఆస్తి/ఎస్‌కె. బుడె సాహెబ్ & ఇతరులకు చెందిన ఆస్తి, **ఉత్తరం:** అమ్మకందారు యొక్క ఆస్తి/అమ్మకందారు యొక్క ఆస్తి. **అక్షాంశము: 16.2304017'N మరియు రేఖాంశము: 80.6354156'E.**

రిజర్వు ధర: రూ. 11,00,000.00 (రూపాయలు పదకొండు లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 1,10,000.00 (రూపాయలు ఒక లక్ష పది వేలు మాత్రమే)

ఐటం నెం. 3: శ్రీమతి శశికళ కూనంనేని కి చెంది ఉండి గుంటూరు, తెనాలి మున్సిపాలిటీ, చెరువు మరియు పోతరాజు టెంపుల్ దగ్గర, పినపాడు ఎక్స్‌టెన్షన్, 16వ బ్లాక్, 1వ వార్డు, టి.ఎస్ నెం. 574/2 వద్ద డోర్ నెం. 13-17-6 ఆవరణలో 300 చ॥గ॥ల విస్తీర్ణము కలిగిన నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **డీడ్ ప్రకారం/వాస్తవ సరిహద్దులు: తూర్పు:** ఎన్. సత్యనారాయణ యొక్క ఆస్తి/ఎన్. సత్యనారాయణ యొక్క ఆస్తి, **దక్షిణం:** చల్లా వెంకట సాంబి రెడ్డి యొక్క ఆస్తి/చల్లా వెంకట సాంబి రెడ్డి యొక్క ఆస్తి, **పడమర:** 20' వెడల్పు రోడ్డు/20' వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** వంగర కోటి లింగం యొక్క ఆస్తి/వంగర కోటి లింగం యొక్క ఆస్తి. **అక్షాంశము: 16.2310442'N మరియు రేఖాంశము: 80.6356808'E.**

రిజర్వు ధర: రూ. 21,00,000.00 (రూపాయలు ఇరవై ఒక్క లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 2,10,000.00 (రూపాయలు రెండు లక్షల పది వేలు మాత్రమే)

ఐటం నెం. 4: శ్రీమతి శశికళ కూనంనేని కి చెంది ఉండి గుంటూరు, తెనాలి మున్సిపాలిటీ, చెరువు మరియు పోతరాజు టెంపుల్ దగ్గర, పినపాడు ఎక్స్‌టెన్షన్, 16వ బ్లాక్, 1వ వార్డు, టి.ఎస్ నెం. 574/2 వద్ద డోర్ నెం. 13-17-6 ఆవరణలో 300 చ॥గ॥ల విస్తీర్ణము కలిగిన నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **డీడ్ ప్రకారం/వాస్తవ సరిహద్దులు: తూర్పు:** జాయింట్ బజార్/జాయింట్ బజార్, **దక్షిణం:** పంట కాలువ/పంట కాలువ, **పడమర:** ఎస్‌కె. బుడె సాహెబ్ యొక్క ఆస్తి/ఎస్‌కె. బుడె సాహెబ్ యొక్క ఆస్తి, **ఉత్తరం:** పి. వెంకట ఆదినారాయణ & ఇతరులకు చెందిన ఆస్తి/పి. వెంకట ఆదినారాయణ & ఇతరులకు చెందిన ఆస్తి. **అక్షాంశము: 16.2310442'N మరియు రేఖాంశము: 80.6356808'E.**

రిజర్వు ధర: రూ. 18,90,000.00 (రూపాయలు పద్దెనిమిది లక్షల తొంబై వేలు మాత్రమే)
ధరావత్తు: రూ. 1,89,000.00 (రూపాయలు ఒక లక్ష ఎనభై తొమ్మిది వేలు మాత్రమే)

ఐటం నెం. 5: శ్రీ వెంకట సుబ్బారావ్ గోగినేని కి చెంది ఉండి గుంటూరు, తెనాలి మం॥, అంగలకుదూరు గ్రా॥, డొంక రోడ్డు ఏరియా, హాస్టల్ బిల్డింగ్ దగ్గర డోర్ నెంలు. 43/బి1, 43/బి2, 43/బి3, ప్లాట్ నెంలు. 65,66,67 వద్ద 317 చ॥గ॥ల విస్తీర్ణము కలిగిన నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **డీడ్ ప్రకారం/వాస్తవ సరిహద్దులు: ఎ) ప్లాట్ నెం. 65: తూర్పు:** 30' వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నెం. 64, **పడమర:** సరిహద్దు లేదు, **ఉత్తరం:** రైల్వే యొక్క ఆస్తి. **బి) ప్లాట్ నెం. 66 & 67: తూర్పు:** బోడె కెనాల్, **దక్షిణం:** ప్లాట్ నెం. 68, **పడమర:** 30' వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** రైల్వే యొక్క ఆస్తి. **అక్షాంశము: 16.2311847'N మరియు రేఖాంశము: 80.644776'E.**

రిజర్వు ధర: రూ. 27,00,000.00 (రూపాయలు ఇరవై ఏడు లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 2,70,000.00 (రూపాయలు రెండు లక్షల డెబ్బై వేలు మాత్రమే)

ఐటం నెం. 6: శ్రీ శ్రీనివాస హరి ప్రసాద రావ్ కూనంనేని కి చెంది ఉండి గుంటూరు, తెనాలి మున్సిపాలిటీ, మారీస్‌పేట్, రవివారి స్ట్రీట్, 14వ బ్లాక్, 2వ వార్డు, టిఎస్ నెం. 449/3 వద్ద 106.55 చ॥గ॥ల విస్తీర్ణము కలిగిన నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **డీడ్ ప్రకారం/వాస్తవ సరిహద్దులు: తూర్పు:** కె. వెంకట రెడ్డి యొక్క ఆస్తి/కె. వెంకట రెడ్డి యొక్క ఆస్తి, **పడమర:** సిహెచ్. హరి గోపాల్ యొక్క ఆస్తి/సిహెచ్. హరి గోపాల్ యొక్క ఆస్తి, **ఉత్తరం:** 12' వెడల్పు రోడ్డు/12' వెడల్పు సిసి రోడ్డు, **దక్షిణం:** ఎం. రాజేశ్వరి యొక్క ఆస్తి/ఎం. రాజేశ్వరి యొక్క ఆస్తి. **అక్షాంశము: 16.2311847'N మరియు రేఖాంశము: 80.644776'E.**

రిజర్వు ధర: రూ. 21,10,000.00 (రూపాయలు ఇరవై ఒక లక్షల పది వేలు మాత్రమే)
ధరావత్తు: రూ. 2,11,000.00 (రూపాయలు రెండు లక్షల పదకొండు వేలు మాత్రమే)

ఐటం నెం. 7: శ్రీ శ్రీనివాస హరి ప్రసాద రావ్ కూనంనేని కి చెంది ఉండి గుంటూరు జిల్లా, తెనాలి మం॥, డొంక రోడ్డు ఏరియా, జెఎంజె కాలేజ్ దగ్గర, అంగలకుదూరు గ్రా॥, డి.నెం. 448/2, ప్లాట్ నెం. 6 వద్ద 220 చ॥గ॥ల నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **డీడ్ ప్రకారం/వాస్తవ సరిహద్దులు: తూర్పు:** కొడాలి సాంబశివ రావ్ యొక్క ప్లాట్ నెం. 5లోని ఆస్తి/కొడాలి సాంబశివ రావ్ యొక్క ప్లాట్ నెం. 5లోని ఆస్తి (ప్రస్తుతం ఖాళీ భూమి), **దక్షిణం:** 30' వెడల్పు రోడ్డు/30' వెడల్పు రోడ్డు (స్పష్టంగా ఏర్పడలేదు), **పడమర:** ప్లాట్ నెం. 7లోని ఆస్తి/ప్లాట్ నెం. 7లోని ఆస్తి (ప్రస్తుతం ఖాళీ స్థలం), **ఉత్తరం:** చదలవాడ తిరుపతి రావ్ & ఇతరులకు చెందిన ఆస్తి/చదలవాడ తిరుపతి రావ్ & ఇతరులకు చెందిన ఆస్తి. **అక్షాంశము: 16.228969'N మరియు రేఖాంశము: 80.620995'E.**

రిజర్వు ధర: రూ. 9,00,000/- (రూపాయలు తొమ్మిది లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 90,000/- (రూపాయలు తొంబై వేలు మాత్రమే)

ఐటం నెం. 8: శ్రీ శ్రీనివాస హరి ప్రసాద రావ్ కూనంనేని కి చెంది ఉండి గుంటూరు, తెనాలి మం॥, డొంక రోడ్డు ఏరియా, జెఎంజె కాలేజ్ దగ్గర, అంగలకుదూరు గ్రా॥, డి.నెం. 448/2, 43/బి2, 43/బి3, ప్లాట్ నెం. 9 వద్ద 238.33 చ॥గ॥ల నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **డీడ్ ప్రకారం/వాస్తవ సరిహద్దులు: తూర్పు:** దేవభక్తుని లక్ష్మీ నరసమ్మ యొక్క ప్లాట్ నెం. 8లోని ఆస్తి/దేవభక్తుని లక్ష్మీ నరసమ్మ యొక్క ప్లాట్ నెం. 8లోని ఆస్తి (ప్రస్తుతం ఖాళీ భూమి), **దక్షిణం:** సర్కార్ డొంక/సర్కార్ డొంక (స్పష్టంగా ఏర్పడలేదు), **పడమర:** ప్లాట్ నెం. 10లోని ఆస్తి/ప్లాట్ నెం. 10లోని ఆస్తి (ప్రస్తుతం ఖాళీ భూమి), **ఉత్తరం:** చదలవాడ తిరుపతి రావ్ & ఇతరులకు చెందిన ఆస్తి/చదలవాడ తిరుపతి రావ్ & ఇతరులకు చెందిన ఆస్తి. **అక్షాంశము: 16.228969'N మరియు రేఖాంశము: 80.620995'E.**

రిజర్వు ధర: రూ. 10,00,000/- (రూపాయలు పది లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 1,00,000/- (రూపాయలు ఒక లక్ష మాత్రమే)

వ.నెం. 2: ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు యొక్క పేరు & చిరునామా, స్వాధీనతా యొక్క తేది మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: (1). మెస్సర్స్ మారం కాటన్ సిండికేట్ ప్రతినిధిగా దాని ప్రొప్రైటర్ శ్రీ అంజి రెడ్డి మారం, చిరునామా: నెం. 27, ఏటుకూరు రోడ్, గుంటూరు-522003, **(2) శ్రీ అంజి రెడ్డి మారం తండ్రి శ్రీ హనుమా రెడ్డి, (3) శ్రీ బాల అంజి రెడ్డి మారం తండ్రి శ్రీ పెద్ద హనుమా రెడ్డి మరియు (4) శ్రీమతి మారం సుజాత భర్త అంజి రెడ్డి మారం,** నెం. (2), (3) మరియు (4) ల నివాసం: డి.నెం. 20-18-17, మేనక గాంధీ నగర్, 3వ లైన్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు-522003. **నిర్మాణాత్మక స్వాధీనత తేది: 08.07.2022. బకాయి మొత్తం: 1) PSOD ఖాతా నెం. 2557000600475001** క్రింద **రూ. 2,87,18,386.89 (రూపాయలు రెండు కోట్ల ఎనభై ఏడు లక్షల పద్దెనిమిది వేల మూడు వందల ఎనభై ఆరు మరియు పైసలు ఎనభై తొమ్మిది మాత్రమే) + 01.03.2023** నుండి తదుపరి వడ్డీ + ఖర్చులు, **2) PSTL ఖాతా నెం. 2557001801150301** క్రింద **రూ. 43,43,080.27 (రూపాయలు నలభై మూడు లక్షల నలభై మూడు వేల ఎనభై మరియు పైసలు ఇరవై ఏడు మాత్రమే) + 01.03.2023** నుండి తదుపరి వడ్డీ + ఖర్చులు, ఖాతా నెంలు. 1 & 2 రెండు కలిపి **రూ. 3,30,61,467.16 (రూపాయలు మూడు కోట్ల ముప్పై లక్షల అరవై ఒక్క వేల నాలుగు వందల అరవై ఏడు మరియు పైసలు పదహారు మాత్రమే)**ల క్రింద వర్తించును.

స్థిరాస్తుల వివరణ:

శ్రీ అంజి రెడ్డి మారం కి చెంది ఉండి గుంటూరు, బైపాస్ రోడ్, వాల్‌కాట్ డాబా నగర్, వాల్‌కాట్ దాదాసాహెబ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద పట్టా నెం. 1053, సర్వే నెంలు. 43/5, 43/6, 43/7 & 44/7 లలో 1733.33 చ॥గ॥ల విస్తీర్ణములోని పారిశ్రామిక ప్లాట్ యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** బి. నవీన్ కుమార్ మరియు ఇతరుల యొక్క ఆస్తి, **దక్షిణం:** 30' అడుగుల వెడల్పు రోడ్డు, **పడమర:** 40' అడుగుల వెడల్పు రోడ్డు మరియు **ఉత్తరం:** వేముల పద్మావతి యొక్క స్థలం. **లొకేషన్: అక్షాంశము & రేఖాంశము: 16.274485 & 80.429858.**

రిజర్వు ధర: రూ. 2,00,00,000.00 (రూపాయలు రెండు కోట్లు మాత్రమే) (1% టిడిఎస్ కలుపుకొని)
ధరావత్తు: రూ. 20,00,000.00 (రూపాయలు ఇరవై లక్షలు మాత్రమే)

వ.నెం. 3: ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు యొక్క పేరు & చిరునామా, స్వాధీనతా యొక్క తేది మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: (1) మెస్సర్స్ శ్యామ్ కాటన్ ట్రేడింగ్ కార్పొరేషన్, చిరునామా: డి.నెం. 6-35, బి సి కాలనీ, కాకుమాను, గుంటూరు-522112, **(2) శ్రీ శ్యామ్ ప్రసాద్ పెదపూడి తండ్రి శ్రీ పెదపూడి అక్కయ్య ప్రొప్రైటర్ మెస్సర్స్ శ్యామ్ కాటన్ ట్రేడింగ్ కార్పొరేషన్, (3) శ్రీమతి నవ జ్యోతి పెదపూడి భర్త శ్రీ శ్యామ్ ప్రసాద్ పెదపూడి,** క్ర.సం. (2) & (3) ల చిరునామా: డి.నెం. 6-149, కాకుమాను, గుంటూరు-522112 మరియు **(4) శ్రీ శ్యామ్ రాజు నీలం తండ్రి శ్రీ బెంజమిన్,** చిరునామా: 26-20-25, టీచర్స్ ఎన్‌క్లేవ్, ఎ బ్లాక్, సర్తి నగర్, 4వ లేన్, నాగారంపాలెం, గుంటూరు-522004. **నిర్మాణాత్మక స్వాధీనతా తేది: 04.01.2023. బకాయి మొత్తం: 1) PSOD ఖాతా నెం. 2557000600474601** క్రింద **రూ. 1,51,58,969.84 (రూపాయలు ఒక కోటి యాభై ఒక్క లక్షల యాభై ఎనిమిది వేల తొమ్మిది వందల అరవై తొమ్మిది మరియు పైసలు ఎనభై నాలుగు మాత్రమే) + 01.12.2024** నుండి తదుపరి వడ్డీ + ఖర్చులు, **2) PSTL ఖాతా నెం. 2557001801150801** క్రింద **రూ. 24,69,740.48 (రూపాయలు ఇరవై నాలుగు లక్షల అరవై తొమ్మిది వేల ఏడు వందల నలభై మరియు పైసలు నలభై ఎనిమిది మాత్రమే)+ 01.12.2024** నుండి తదుపరి వడ్డీ + ఖర్చులు. **1) & 2) ల బకాయి మొత్తం కలిపి రూ. 1,76,28,710.32 (రూపాయలు ఒక కోటి డెబ్బై ఆరు లక్షల ఇరవై ఎనిమిది వేల ఏడు వందల పది మరియు పైసలు ముప్పై రెండు మాత్రమే).**

స్థిరాస్తుల యొక్క వివరణ:

1) శ్రీ శ్యామ్ ప్రసాద్ పెదపూడి పేరున ఉండి గుంటూరు జిల్లా, పెదకాకాని మం॥, జెడ్‌పి స్కూల్ రోడ్, అంబేద్కర్ సెంటర్ దగ్గర, నంబూరు గ్రా॥ వద్ద డోర్ నెం. 18-221 సమీపాన 629.20 చ॥గ॥ల విస్తీర్ణములో ఉన్న డి.నెం. 427/బి1, 427/బి-1బి లోని నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** లేట్ భీమవరపు సీతారత్తమ్మ యొక్క స్థలము, **దక్షిణం:** తియ్యగూర అంజి రెడ్డి యొక్క స్థలం, **పడమర:** షేక్ మీరస, షేక్ బాజి మొ॥గు॥ వారి స్థలం మరియు **ఉత్తరం:** సర్కార్ డొంక కవరింగ్ డి.నెం. 428. **లొకేషన్: అక్షాంశము & రేఖాంశము: 16.361960 & 80.524265.**

రిజర్వు ధర: రూ. 65,65,000.00 (రూపాయలు అరవై ఐదు లక్షల అరవై ఐదు వేలు మాత్రమే) (1% టిడిఎస్ కలుపుకొని)
ధరావత్తు: రూ. 6,56,500.00 (రూపాయలు ఆరు లక్షల యాభై ఆరు వేల ఐదు వందలు మాత్రమే)

2) శ్రీ శ్యామ్ రాజు నీలం పేరున ఉండి గుంటూరు, శాంతి నగర్ ఎక్స్‌టెన్షన్, 4వ లేన్, నాగారంపాలెం, అగ్రహారం వద్ద 400 చ॥గ॥లలో 32 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా కలిగి టీచర్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, మొదటి అంతస్తులోని నివాస ఫ్లాట్ నెం. ఎఫ్‌ఎఫ్1 గల డోర్ నెం. 26-20-65 యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** కామన్ కారిడార్, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **పడమర:** ఖాళీ ప్రదేశం మరియు **ఉత్తరం:** ఫ్లాట్ నెం. ఎఫ్‌ఎఫ్3. **మొత్తం ఆస్తికి సరిహద్దులు: తూర్పు:** ఐ. సత్యనారాయణ యొక్క ఆస్తి, **దక్షిణం:** ఎన్ నిల్సన్ & డాన్ భూషణం యొక్క ఆస్తి, **పడమర:** 30' వెడల్పు మున్సిపల్ రోడ్డు మరియు **ఉత్తరం:** సుబ్బా రావ్ యొక్క ఆస్తి. **లొకేషన్: అక్షాంశము & రేఖాంశము: 16.294357 & 80.426930**

రిజర్వు ధర: రూ. 22,00,000.00 (రూపాయలు ఇరవై రెండు లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 2,20,000.00 (రూపాయలు రెండు లక్షల ఇరవై వేలు మాత్రమే)

వ.నెం. 4: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, స్వాధీనతా యొక్క తేది మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: 1. మెస్సర్స్ సమీర కాటన్ ట్రేడర్స్ ప్రతినిధిగా దాని భాగస్వాములు ఎ) శ్రీ సయ్యద్ మస్తాన్ వలి, బి) శ్రీ సయ్యద్ మహబూబ్ సుభాని, చిరునామా: డి.నెం. 9-206, మెయిన్ రోడ్, పుల్లడిగుంట, వట్టిచెరుకూరు మం॥, గుంటూరు-522017, **(2) శ్రీ సయ్యద్ మస్తాన్ వలి తండ్రి శ్రీ సయ్యద్ అల్లాబక్షి, (3) శ్రీమతి సయ్యద్ మహబూబ్ సుభాని భర్త శ్రీ సయ్యద్ మస్తాన్ వలి,** నెం. (2), (3) ల చిరునామా: డి.నెం. 9-159/1, పుల్లడిగుంట గ్రా॥, వట్టిచెరుకూరు మం॥, గుంటూరు-522017, **4) శ్రీ షేక్ మస్తాన్ వలి తండ్రి శ్రీ హుస్సేన్ సాహెబ్,** చిరునామా: డి.నెం. 9-209, పుల్లడిగుంట, కొరెనపాడు శివారు, వట్టిచెరుకు మం॥, గుంటూరు-522017. **నిర్మాణాత్మక స్వాధీనతా తేది: 22.07.2019. బకాయి మొత్తం: PSOD ఖాతా నెం. 2557000600468301** క్రింద **రూ. 2,26,54,464.44 (రూపాయలు రెండు కోట్ల ఇరవై ఆరు లక్షల యాభై నాలుగు వేల నాలుగు వందల అరవై నాలుగు మరియు పైసలు నలభై నాలుగు మాత్రమే) + 01.02.2024** నుండి తదుపరి వడ్డీ + ఖర్చుల క్రింద వర్తించును.

స్థిరాస్తుల యొక్క వివరణ:

1) శ్రీ షేక్ మస్తాన్ వలి కి చెంది ఉండి గుంటూరు జిల్లా, వట్టిచెరుకు మం॥, పుల్లడిగుంట గ్రా॥ & గ్రామ పంచాయతీ, ఆంజనేయ స్వామి గుడి దగ్గర, డోర్ నెం. 9-209, పుల్లడిగుంట యొక్క డి.నెం. 443/1 వద్ద గల 194 చ॥గ॥ల భూమి విస్తీర్ణములో బిల్టప్ ఏరియా 816.77 చ॥అ॥ల విస్తీర్ణము గల ఆర్‌సిసి రూఫ్ నివాస గృహము (గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే) యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** ప్రభుత్వ రోడ్డు, **పడమర:** ఎస్‌డి. అల్లా బక్షు, **ఉత్తరం:** ఎస్‌కె. ఖాసీం సాహెబ్ మరియు **దక్షిణం:** 1 గజం వెడల్పు గల్లి.

రిజర్వు ధర: రూ. 25,00,000.00 (రూపాయలు ఇరవై ఐదు లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 2,50,000.00 (రూపాయలు రెండు లక్షల యాభై వేలు మాత్రమే

2) శ్రీ సయ్యద్ మస్తాన్ వలి కి చెంది ఉండి గుంటూరు జిల్లా, వట్టిచెరుకు మం॥, పుల్లడిగుంట గ్రామ పంచాయతీ, కొర్నెపాడు శివారు వద్ద డి.నెం. 9-206 వైపు, పుల్లడిగుంట యొక్క డి.నెం. 443/1 వద్ద గల 133.33 చ॥గ॥ల విస్తీర్ణము గల నివాస ఖాళీ స్థలం యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** ఎస్‌కె ఖాదర్ వలి, **పడమర:** సయ్యద్ మహబూబ్ సుభాని, **ఉత్తరం:** పి.ఎస్. వెంకటరత్న శ్రీనివాసు మరియు **దక్షిణం:** 15' వెడల్పు రోడ్డు.

రిజర్వు ధర: రూ. 11,00,000.00 (రూపాయలు పదకొండు లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 1,10,000.00 (రూపాయలు ఒక లక్ష పది వేలు మాత్రమే)

3) శ్రీమతి సయ్యద్ మహబూబ్ సుభాని కి చెంది ఉండి గుంటూరు జిల్లా, వట్టిచెరుకు మం॥, పుల్లడిగుంట గ్రామ పంచాయతీ, కొర్నెపాడు శివారు వద్ద డి.నెం. 9-150, పుల్లడిగుంట యొక్క డి.నెం. 443/1 వద్ద గల 153 చ॥గ॥ల భూమి విస్తీర్ణంలో బిల్టప్ ఏరియా 913.64 చ॥అ॥ల విస్తీర్ణము గల ఆర్‌సిసి రూఫ్ నివాస గృహము (గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే) యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** ఎస్‌కె మొహమద, **పడమర:** ఎస్‌కె. ముల్ల, **ఉత్తరం:** ప్రభుత్వ సిసి రోడ్డు మరియు **దక్షిణం:** సర్కార్ డొంక.

రిజర్వు ధర: రూ. 23,00,000.00 (రూపాయలు ఇరవై మూడు లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 2,30,000.00 (రూపాయలు రెండు లక్షల ముప్పై వేలు మాత్రమే)

4) శ్రీ సయ్యద్ మస్తాన్ వలి కి చెంది ఉండి గుంటూరు జిల్లా, చేబ్రోలు గ్రా॥ మరియు మం॥, చేబ్రోలు గ్రామ పంచాయతీ ఏరియా, తెనాలి నుండి గుంటూరు రోడ్డు, శ్రీ లలిత పరమేశ్వరి స్పిన్నింగ్ మిల్ దగ్గర, ప్లాట్ నెం. 7 వద్ద చేబ్రోలులోని డి.నెంలు. 134/1, 134/2 లలోని 495 చ॥గ॥ల విస్తీర్ణము కలిగిన ఖాళీ నివాస స్థలం యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** 40' అడుగుల వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం. 10 యొక్క ఆస్తి, **ఉత్తరం:** కె. లక్ష్మీ యొక్క ప్లాట్ నెం. 7ఎ లోని ఆస్తి మరియు **దక్షిణం:** ప్లాట్ నెం. 6 యొక్క ఆస్తి.

రిజర్వు ధర: రూ. 25,00,000.00 (రూపాయలు ఇరవై ఐదు లక్షలు మాత్రమే)
ధరావత్తు: రూ. 2,50,000.00 (రూపాయలు రెండు లక్షల యాభై వేలు మాత్రమే)

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు/తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించుకోవలెను). (సెక్యూర్డ్ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8 సబ్ రూల్ (6) ప్రకారం ఋణగ్రహీతలు/హామీదారులు వారికి నోటీసుగా కూడా పరిగణించబడుతుంది). అమ్మకానికి సంబంధించిన వివరమైన నియమ నిబంధనల కొరకు కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ www.karnatakabank.com లో "mortgaged assets for sale" పైన క్లిక్ చేయవలెను. ఇ-వేలం 30.07.2025న ఉ. 11.00 గం||ల నుండి ఉ. 11.20 గం||ల వరకు www.auctionbazaar.com పోర్టల్ ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును. ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును మెస్సర్స్ ఆర్క్ ఈమార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ www.auctionbazaar.com నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందవలెను మరియు ఇ-వేలంలో శిక్షణ (తాత్కాలికంగా 27.07.2025) ఆన్‌లైన్ ద్వారా మెస్సర్స్ ఆర్క్ ఈమార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, 7-1-28/1/D/1, శ్యామ్ ఎవెన్యూ 1, అమీర్‌పేట్, సికింద్రాబాద్, తెలంగాణా-500016, వెబ్‌సైట్: www.auctionbazaar.com. సంప్రదించవలసిన మొబైల్ నెం. 9603716999, 9581498999, 8370969696, ఇ-మెయిల్ ఐడి: contact@auctionbazaar.com, support@auctionbazaar.com నుండి పొందవచ్చును.

తేది: 30.06.2025, ప్రదేశం: హైదరాబాద్.
సం/- అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

ప్లాట్ల నిర్వహణ బాధ్యత స్థానికులకే

- సిఆర్‌డిఏ రీజియన్‌లో తాజా భూసమీకరణ
- రెసిడెన్షియల్ అసోసియేషన్‌కు యూజర్ ఛార్జీల వసూలు బాధ్యత
- కొత్త రూల్స్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఆరునెలల్లో ప్రక్రియ పూర్తి

APCRDA Andhra Pradesh Capital Region Development Authority I ❤ AMARAVATI

ప్రజాశక్తి - అమరావతి

"రాజధాని పరిధిలో కొత్తగా సమీకరించే భూముల నుండి తీసుకునే ప్లాట్ల నిర్వహణ కమిషనర్ గుర్తించిన రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ లేదా స్థానిక సంస్థ యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ద్వారా నిర్వహించాలి"

"సమీకరించిన భూముల్లోని ప్లాట్లను కమిషనర్‌ద్వారా, మరల తిరిగి తీసుకోవాలని ముందుగానే రైతులు ధ్రువీకరించాలి"

"భూములిచ్చే రైతులు ఆన్‌లైన్ పద్ధతిలో ఆధార్ గుర్తింపు ఓటిపి ద్వారా తిరిగి తీసుకోవడానికి వీలైన పద్ధతుల్లో భూములు అప్పగించడంతోపాటు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నట్లు వెల్లడి చేయాలి"

ఇవి సిఆర్‌డిఏ పరిధిలో పూలింగు తీసుకోబోయే భూముల్లో అమలు చేయనున్న కొత్త నిబంధనలు. ప్రస్తుతం అమరావతి రాజధాని 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో కాకుండా అదనంగా భూముల సమీకరణలో ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలోనూ కొత్త రూల్స్‌కు ఆమోదం తెలిపారు. కొత్త రూల్స్‌కు సంబంధించిన ఉత్తర్వులను పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. ప్రజా రాజధాని పరిధిలో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయాలు, పోర్టులు ఇతర సదుపాయాలు కల్పించేందుకు వీలుగా అదనపు భూముల సమీకరిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న క్యాపిటల్ సిటీ ఏరియాను మినహాయించి మిగిలిన రీజియన్ పరిధిలో సమీకరించే భూములకు ఈ నిబంధనలు వర్తింపజేయనున్నారు. దీన్ని ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ భూ సమీకరణ పథకం రూల్స్ 2025గా దీన్ని పిలవనున్నారు.

ఇవి సెక్షన్లు ...

ఈ పథకం కింద తీసుకునే భూములకు ఏపిసిఆర్‌డిఏ చట్టం 2014లోని సెక్షన్ 43(3) కింద ప్లాట్లు అప్పగించనున్నారు. చట్టంలో 55(2) కింద రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నట్లుగా పరిగణించనున్నారు. రీజియన్ పరిధిలో ఎక్కడైనా కమిషనర్ గుర్తించిన ప్రాంతంలో సమీకరించనున్నట్లు పేర్కొన్నారు. సెక్షన్ 43(5)(6) ప్రకారం ప్రభుత్వం గుర్తించి చెబితే దానికి కమిషనర్ అనుమతి పూలింగు ఏరియాలో నియమించే అధికారులు సెక్షన్ 55(4) కింద ప్రాంతాల వారీగా పూలింగు ప్రకటన చేయనున్నారు. నోటిఫికేషన్ 16లో సూచించిన ఫార్మాట్‌లోని 55(5) కింద అభ్యంతరాలను వారు స్వీకరించే అధికారం కల్పించారు. సెక్షన్ 48(1), 50 ప్రకారం రైతుల నుండి భూములు దరఖాస్తులు తీసుకోనున్నారు. ఆమోదించిన అనంతరం రైతులకు ప్లాట్లు తిరిగి ఇచ్చేందుకు గతంలో మాదిరి కాకుండా ఓపెన్ ప్లాట్స్‌ను వినియోగించనున్నారు. వాటిని సర్వే చేయనున్నారు. భూముల్లో అభ్యంతరాలను తెలిపేందుకు సెక్షన్ 56(2) కింద 30 రోజులపాటు అవకాశం కల్పించారు. 2025 పూలింగు చట్టంలోని సెక్షన్ 44, సెక్షన్ 53 అనుసరించి పార్కులు, ఆటస్థలాలు, తోటలకు, ఓపెన్‌స్పేస్‌కు 10 శాతం, రోడ్లు, యుటిలిటీ సేవలకు 30 శాతం, సామాజిక సదుపాయాలకు ఐదుశాతం, గృహాలకు ఐదుశాతం కేటాయించనున్నారు. ప్రభుత్వం గుర్తించిన చోట విమానాశ్రయం లేదా ఏదైనా అభివృద్ధి కోసం థర్డ్‌పార్టీకి పూలింగు భూములు ఇవ్వాల్సి వస్తే అటువంటి వారికి ఒకేచోట ప్లాట్లు కేటాయిస్తారు.

నోటిఫికేషన్ వెలువడిన వెంటనే...

పూలింగు నోటిఫికేషన్ జారీచేసినప్పటి నుండి ఆయా ప్రాంతాల్లో భూములు రైతులు వినియోగించకోకుండా సెక్షన్ 49 ప్రకారం నిషేధించనున్నారు. సెకన్ 57(2) ప్రకారం తుది నోటిఫికేషన్ జారీచేసిన అనంతరం భూమి సిఆర్‌డిఏ పరమవుతుంది. సెక్షన్ 57(3) ప్రకారం రైతులకు ల్యాండ్ పూలింగు ఓనర్‌షిప్ సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. దీనికి ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ అవసరం లేదని, చట్టపరంగా అన్ని హక్కులూ ఉంటాయని కొత్త నిబంధనల్లో పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టంలోని 107,108 సెక్షన్ల కింద ఈ తరహా పద్ధతి ప్రవేశపెట్టినట్లు కొత్త నిబంధనలో పొందుపరిచారు. ఈ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ పద్ధతిలోనే డౌన్‌లోన్ చేసుకోవచ్చని, అదే అసలు ధృవపత్రంగా గుర్తించనున్నామని తెలిపారు. సెటిల్‌మెంట్ రిజిస్టర్లో ఎండోమెంట్ భూములుగా ఉంటే వాటిని దేవాదాయభూములుగానే పరిగణిస్తామని, యాజమాన్య హక్కులు రైతులకు వర్తింపజేయనీయబోమని తెలిపారు. సమీకరించేందుకు ఉద్దేశించిన ప్రాంతంలో భూములన్నీటిని సిఆర్‌డిఏకు చెందుతాయని తెలిపారు. నీటివనరులను ధ్వంసం చేయకూడదని, చెట్ల సంరక్షించాలని నిబంధనల్లో పేర్కొన్నారు.

అసైన్డ్ భూములుంటే...

అసైన్డ్ భూములను నాలుగు భాగాలుగా వర్గీకరించారు. వారికి కేటాయింపులు నిర్దేశిత నిబంధనల ప్రకారం కేటాయిస్తారు. శాశ్వత అసైనీలు, కొనుగోలు చేసుకున్నారా, ఎన్ని సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారు అనే అంశాన్ని తహశీల్దార్ నిర్ధారించిన తరువాత వారికి ప్లాట్లు కేటాయిస్తారు. ఇతరులకు అమ్మిన భూములు, శివాయి జమిందారు భూమలును ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని నిబంధనల్లో పొందుపరిచారు. సెక్షన్ 55(4) ప్రకారం 2019 జనవరి ఒకటోతేదీ నాటికి జరిగిన ఆక్రమణలకు ఐదో కేటగిరీ కింద, అభ్యంతరకర ప్రభుత్వ భూముల్లో ఉన్న వారికి ఆరోకేటగిరీ కింద ప్లాట్లు తిరిగి ఇవ్వనున్నారు. పూలింగు ఏరియాలో జాయింట్ కలెక్టర్ ద్వారా నిర్ధారించిన అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములపై అభ్యంతరాలను 15 రోజుల్లో తెలపాల్సి ఉంటుంది. పూలింగు ఏరియాలో అనధికార లేఅవుట్లలో ఉన్న రిజిస్టర్డ్ ప్లాట్ల విస్తీర్ణంలో 65 శాతం కనీసం 500 గజాలకు పెరగకుండా తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. అనుమతి ఉన్న లేఅవుట్లను పూలింగు నుండి మినహాయించారు. గ్రామాల చుట్టుపక్కల గ్రామకంతంగా నిర్ధారించిన భూములనూ పూలింగు నుండి మినహాయించారు. నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి గ్రామాలకు శివారులో ఉండే కట్టడాలను మాత్రమే గ్రామకంతంగా నిర్ధారిస్తారు. పూలింగు పరిధిలోకి వచ్చే మత సంస్థలు ప్లానుకు ఇబ్బందిగా ఉందనిపిస్తే వారికి వేరేచోట భూములు కేటాయించనున్నారు. సర్వే నెంబర్లు రికార్డుల్లో కనిపించకపోతే అధికారుల సమన్వయం చేసుకుని యజమానికి ప్లాటు కేటాయించాలని నిబంధనల్లో పొందుపరిచారు. పూలింగుకు ఇచ్చిన భూమిపై కాంపిటెంట్ అథారిటీకి సర్వహక్కులూ కల్పిస్తూ ఫారం -2 కింద అంగీకారం తెలపాలి. ఫారం-3 ద్వారా రైతు ల్యాండ్ టైటిల్‌ను అప్పగించాల్సి ఉంటుంది. ఎల్‌పిఓసి పొందేందుకు ముందే భూమిని అమ్మాలనుకుంటే రైతు ఎన్‌ఓసి పొందాల్సి ఉంటుంది. అయితే కొనుగోలు చేసే భూమిని ఎల్‌పిఎస్‌కు అప్పగిస్తామని ఖచ్చితమైన హామీని ఇవ్వాల్సి ఉంటుంది. సెక్షన్ 43 ప్రకారం అథారిటీ జారీచేసే నోటిఫికేషన్ ద్వారా పూలింగు కింద తీసుకున్న భూముల్లో ప్రభుత్వం ఏమైనా చేయొచ్చని నిబంధనల్లో పొందుపరిచారు. . పూలింగు భూముల్లో అథారిటీగానీ టెండర్లు, బిడ్ల ద్వారా ఆహ్వానించే సంస్థలు, ఏజెన్సీలతోనైనా పనులు చేపట్టేందుకు వీలుగా నిబంధనలు పొందుపరిచారు. ప్లాను రూపొందించే క్రమంలో వీధిశూల ప్లాట్లు ఏర్పాటైతే వాటిని లాటరీలో చేర్చబోమని తెలిపారు. తిరిగి కేటాయించే ప్లాట్లను యాజమానుల ఇష్టం ప్రకారం ఒకే చోట కేటాయించేందుకు వీలు కల్పించారు. తుది ల్యాండ్ పూలింగు నోటిఫికేషన్ జారీచేసిన 12 నెల్లో ప్లాటును రైతుకు అప్పగించాలని, మూడేళ్లలో పూర్తిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. సెక్షన్ 55(5) ప్రకారం నోటిఫికేషన్ జారీచేసిన 30 రోజుల్లో అభ్యంతరాలు తీసుకుంటామని, అయితే వాటిని పరిశీలించిన అనంతరం ఆమోదించేందుకు, తిరస్కరించేందుకు కాంపిటెంట్ అథారిటీకి హక్కులు ఉంటాయని పేర్కొన్నారు. ఆరునెలల్లో మూడో నోటిఫికేషన్ విడుదల చేస్తారని, అదే తుది నోటిఫికేషన్ అవుతుందని తెలిపారు. భూమిలేని పేదలకు 10 సంవత్సరాల పాటు 5000 పెన్షన్ ఇవ్వనున్నారు.

ప్లాట్ల కేటాయింపు ఇలా

పూలింగుకు భూములిచ్చిన రైతులకు సంబంధించి పట్టాదారులకు మెట్ట, జరీబులో నివాస ప్రాంతం 1000 గజాలు ఇవ్వనున్నారు. కమర్షియల్ ప్లాట్లను 250 గజాలు, 450 గజాల చొప్పున కేటాయిస్తారు. అసైన్డ్ భూములకు సంబంధించి మొదటి కేటగిరీ వారికి రెండు ప్రాంతాల్లోనూ 1000 గజాల చొప్పున కేటాయిస్తారు. కమర్షియల్ ప్లాట్లనూ 250, 450 గజాల చొప్పున ఇవ్వనున్నారు. రెండో కేటగిరీ వారికీ ఇదే పద్ధతి అమలు చేయనున్నారు. మూడో కేటగిరీ వారికి 800 గజాలు, వాణిజ్య ప్లాట్లు మెట్టలో 100 గజాలు, జరీబులో 200 గజాలు ఇవ్వనున్నారు. నాలుగు, ఐదు కేటగిరీ వారికి నివాస భూమిని 500 గజాల చొప్పున ఇస్తారు. కమర్షియల్ ప్లాల్లను మెట్టలో 50 గజాలు, జరీబులో 100 గజాలు ఇవ్వనున్నారు. ఆరో కేటగిరీ వారికి 250 గజాల చొప్పున నివాస భూమిని ఇస్తారు. వాణిజ్య భూమి కేటాయింపు లేదు. అలాగే వార్షిక కౌలును మెట్టకు రూ.30 వేలు, జరీబుకు రూ.50 వేలు ఇస్తారు. ప్రతి ఏటా మూడువేల, ఐదువేలు చొప్పున పెంచనున్నారు. నిమ్మ, సపోట, జామకాయ తోటలకు ఒకేసారి లక్ష రూపాయల పరిహారం ఇవ్వనున్నారు.

ఆదిలోనే వర్షాభావం

- జూన్‌లో ఎనిమిది జిల్లాల్లో తక్కువ వర్షం
- సీమలో 5, దక్షిణాంధ్రలో 2, ఉత్తరాంధ్రలో 1

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఈ మారు ఖరీఫ్ ప్రారంభంలోనే రాష్ట్రాన్ని వర్షాభావం వెంటాడుతోంది. జూన్ మాసంలో ఎనిమిది జిల్లాల్లో సాధారణస్థాయి కంటే తక్కువ వర్షం నమోదైంది. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, దక్షిణాంధ్రలో పల్నాడు, నెల్లూరు, రాయలసీమలో అనంతపురం, కర్నూలు, నంద్యాల మినహా తతిమ్మా జిల్లాల్లో వర్షాభావం నెలకొంది. ఆదిలోనే వర్షాభావం ఎదురుకావడంతో ఆయా ప్రాంతాల్లో పంటల సేద్యం దాదాపు నిలిచిపోయింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఎప్పటి కంటే కాస్తంత ముందుగా మే 26, 27 తేదీల్లో రాష్ట్రాన్ని పలకరించడంతో ఖరీఫ్ పంటల సాగుపై రైతుల్లో ఆశలు చిగురించాయి. అంత లోనే రుతుపవనాలు సుదీర్ఘకాలం ముఖంచాటేయడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిరిగి వారం రోజులుగా రుతుపవనాల్లో కదలిక రావడంతోపాటు అల్పపీడనం, ఉపరితల ఆవర్తనాల వలన కొద్దిపాటి వానలు కురుస్తున్నాయి. కాగా రుతుపవనాల ఆగమనంతో సీజన్ మొదటి నెల జూన్‌లో సాధా రణ వర్షం పడటం కద్దు. కానీ ఈ తడవ ఎనిమిది జిల్లాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. అల్లూరి, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల సగటు లెక్కల ప్రకారం వర్షాభావానికి దగ్గరగా ఉన్నాయి. ఎ.పి. వ్యాప్తంగా జూన్ 1 నుంచి జులై 1 వరకు సాధారణ వర్షం 86.46 మిల్లీమీటర్లు కాగా 76.47 మిమీ పడింది. లోటు 11.55 శాతం. సాంకేతికంగా రాష్ట్రంలో సగటున సాధారణ వర్షం కురిసినట్లు కనిపిస్తోంది. మొత్తం 26 జిల్లాలుండగా ఎనిమిది జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా అన్నమయ్య జిల్లాలో 54.69 శాతం తక్కువ వర్షం పడింది. సాధారణం కంటే ఎక్కువ వర్షం తొమ్మిది జిల్లాల్లో కురిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో 70.72 శాతం ఎక్కువ వర్షం నమోదైంది. తతిమ్మా తొమ్మిది జిల్లాల్లో సాధారణ స్థాయిలో వానలు పడ్డాయి. ఈ ఏడాది అనంతపురంలో సాధారణం కంటే ఎక్కువ వర్షం పడింది. జూన్‌లో ఆ జిల్లాలో మామూలుగా 41.85 మిమీ వర్షం పడాల్సి ఉండగా 54.73 మిమీ పడింది. రాయలసీమలో వేరుశనగ రైతులు వానల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం అరకొరగా సబ్సిడీపై అందిస్తున్న విత్తనాల పంపిణీ మందకొడిగా సాగుతోంది. ఇతర మెట్ట పంటల సేద్యం సైతం నెమ్మదిగానే కొనసాగుతోంది.

తక్కువ వర్షం జిల్లాలు

జిల్లా	నార్మల మి.మీ.	పడింది మి.మీ.	వ్యత్యాసం శాతం
పల్నాడు	76.36	51.03	- 33.17
నెల్లూరు	38.61	24.05	- 37.71
శ్రీసత్యసాయి	46.11	31.11	- 32.53
కడప	52.35	26.64	- 49.11
అన్నమయ్య	57.54	26.07	- 54.69
చిత్తూరు	61.30	37.37	- 39.04
తిరుపతి	60.01	44.83	- 25.30
శ్రీకాకుళం	124.94	99.74	- 20.17

ఇసి వివరణతో మరింత గందరగోళం

- బీహార్ ఎన్నికల జాబితా సవరణలపై సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ విమర్శ

న్యూఢిల్లీ : బీహార్‌లో ప్రస్తుతం ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్‌ఐఆర్)పై ఎలక్షన్ కమిషన్ (ఇసి) వివరణ మరింత గందరగోళం, తప్పుదారి పట్టించేవిధంగా ఉందని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ విమర్శించింది. ఏకపక్షంగా, ప్రణాళికబద్ధంగా లేని ఎస్‌ఐఆర్‌ను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్యా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌ఐఆర్ అనేది ఏటా నిర్వహించే సాధారణ కార్యక్రమంగా ఇసి పేర్కొంది. అయితే ఇలాంటి డ్రైవ్‌లో ఏనాడూ ఓటర్లను తమ పౌరసత్వం నిరూపించుకోవాల్సిందిగా అడగలేదని, కానీ కేవలం బిజెపి ప్రభుత్వ ఒత్తిళ్ల కారణంగానే ఈ దఫా పౌరసత్వ నిరూపణ తెరమీదకు వచ్చిందని సిపిఐ(ఎంఎల్) పేర్కొంది. కానీ దీనిని ఇసి సాధారణ కార్యక్రమంగా పేర్కొనడం అసమంజసం అని పేర్కొంది. దేశంలో పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉందని, అలాంటి ఓటర్లే తమ పౌరసత్వం నిరూపించుకోవాల్సిన అఘత్యం బిజెపి కేంద్ర ప్రభుత్వం వల్ల ఏర్పడిందని పేర్కొంది. బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితాల యొక్క స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ఇప్పటికే తీవ్ర విదాస్పదమైన సంగతి తెలిసిందే.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS • DEPOSITS Translating Dreams into Reality

40-5-19/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజ్ బస్టాప్ దగ్గర, మొగల్‌రాజ్‌పురం, విజయవాడ, ఏపి-520010. ఫోన్: 0866-2474781. సెల్: 7625079119.
Email: vijaywada@canfinhomes.com. CIN:L8511OKA1987LC008699

స్థిరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన

[Under Proviso to Rule 8(6) of Security Interest (Enforcement) Rules]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) సదుపాయము క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకపు ప్రకటన.

ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు తనఖా పెట్టిన క్రింద తెలిపిన స్థిరాస్తిని **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్, మొగల్‌రాజపురం, విజయవాడ** బ్రాంచి యొక్క అధీకృత అధికారి భౌతికముగా స్వాధీనము చేసుకొని **ది.05-08-2025** తేదిన **"ఎక్కడ ఎలా ఉన్నదో, ఏది ఎలా ఉన్నదో మరియు ఏదైతే ఎలా ఉన్నదో అది అలానే"** ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వారిచే **1. శ్రీ ఏనుగు రవిశాస్త్రి,** 61-254/3, ఈనాడు కాలనీ, రామలింగేశ్వర నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007. **2. శ్రీమతి ఏనుగు శ్రీ లత,** 61-254/3, ఈనాడు కాలనీ, రామలింగేశ్వర నగర్, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్-520007 వార్లను **ది.01.07.2025** నాటికి **రూ. 25,13,331/-** (అక్షరాలా ఇరవై ఐదు లక్షల పదమూడు వేల మూడు వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే) వసూలు కొరకు, తదుపరి వడ్డీ మరియు ఇతర అన్ని ఛార్జీలతో సహ.

రిజర్వు ధర: రూ.21,00,000/- (అక్షరాలా ఇరవై ఒక్క లక్షల రూపాయలు మాత్రమే) మరియు **ధరావత్తు సొమ్ము ధర: రూ.2,10,000/-** (అక్షరాలా రెండు లక్షల పది వేల రూపాయలు మాత్రమే) గా నిర్ణయించడమైనది.

స్థిరాస్తి వివరములు

కృష్ణాజిల్లా, విజయవాడ, యనమలకుదురు, శివ పార్వతి నగర్, సమీప డోర్ నెం: 4-78, ఆర్.ఎస్.నెం 5/2 వద్ద గల "అమ్మ నిలయం" రెండో అంతస్తులో 102.66 చదరపు గజాల విస్తీర్ణంలో 34.22 చదరపు గజాల అవిభక్త వాటా మరియు 740 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా, 40 చదరపు అడుగుల కామన్ ఏరియాతో గల ఫ్లాట్‌కు హద్దులు. **ఫ్లాట్ హద్దులు: తూర్పు:** మెట్లు మరియు ఉమ్మడి కారిడార్, **పడమర:** ఓపెన్ టూ స్కై, **ఉత్తరం:** కారిడార్, **దక్షిణం:** ఓపెన్ టూ స్కై. **స్థలం హద్దులు: తూర్పు:** రోడ్డు, **పడమర:** 18 అడుగుల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** మల్లా శ్రీనివాసరావు గారి ఆస్తి, **ఉత్తరం:** జన్ను కనకదుర్గ గారి ఆస్తి. **తెలిసిన ఇతర తనఖాలు: లేవు. కో-ఆర్డినేట్స్: 16.484595 80.657158**

అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనలను అధికారిక వెబ్‌సైట్ కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వద్ద లభించును. **(https:www.canfinhomes.com/searchAuction.aspx)** ను రిఫర్ చేయండి. ఈ-వేలంలో పాల్గొనడానికి లింకు కొరకు **www.bankeauctionwizard.com**

తేది: 01-07-2025
ప్రదేశము: విజయవాడ
సం/- అధీకృత అధికారి
కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

గవర్నర్‌పేట బ్రాంచి (34640)
డి.నెం.33-21-23, మంజు టవర్స్, ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రక్కన, సీతారాంపురం, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002.

డిమాండ్ నోటీసు

Notice under Sec.13(2) read with Sec.13(3) of Securitization and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002.

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/కో-ఆబ్లిగెంట్(లు)/హామీదారు(లు): శ్రీ గణేశ్వరపు గోవింద చారి, చనిపోయినందున అతని చట్టపరమైన వారసులు, శ్రీమతి గణేశ్వరపు లక్ష్మి (భార్య) మరియు ఇతర చట్టపరమైన వారసులు, జామాక్ ఫ్లాట్, బ్లాక్ నెం.సి, పార్ట్-2, ఎఫ్.ఎఫ్.-7, గురునానక్ కాలనీ, వీటిసి: విజయవాడ (గ్రామీణ), పిఒ. ఆటోనగర్, విజయవాడ రూరల్, కృష్ణాజిల్లా , ఆంధ్రప్రదేశ్-520007.

నేచర్ ఆఫ్ లిమిట్	ఎన్.పి.ఏ తేది నాటికి అంటే 09.06.2025 బకాయి మొత్తం	10.06.2025 నుండి 17.06.2025 వరకు వర్తించని వడ్డీ	జరిమానా వడ్డీ (సరళమైనది)	బ్యాంక్ చేసిన ఖర్చు, ఛార్జీలు	17.06.2025 నాటికి బకాయి మొత్తం (రూ.)
Term loan - TLU15 - A/C No. 346406650009582	Rs. 52,58,383.10	Rs. 48,903/-	Rs. 32/-	Rs. 15,355.73	Rs. 53,22,673.83

దిగువ వివరించిన స్థిరాస్తి తనఖా: ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, కంకిపాడు మండలం, పునాదిపాడు గ్రామంలోని ఆర్.ఎస్.నెం. 174/1, 182/2, ఎఫ్.ఎల్.పి నెం.22/2021/1168/AMRDA/DPMS, శ్రీ సిటీ లెజెండ్ లో ప్లాట్ నెం. 259లోని మొత్తం భూమి మరియు నివాస భవనం విస్తీర్ణం 165.08 చదరపు గజాలు లేదా 138.02 చదరపు మీటర్లు శ్రీ గణేశ్వరపు గోవింద చారి గారికి చెందినది. ఎస్.ఆర్.ఓ కంకిపాడు పరిధిలోకి వస్తుంది. **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 247 యొక్క ఆస్తి - 33.0 అడుగులు, **దక్షిణం:** ప్లాట్ నెం. 260 యొక్క ఆస్తి - 45.0 అడుగులు, **పడమర:** 12 మీటర్ల వెడల్పు రోడ్డు - 33.0 అడుగులు, **ఉత్తరం:** ప్లాట్ నెం. 258 యొక్క ఆస్తి - 45.0 అడుగులు

గౌరవనీయులైన సర్/మేడమ్

విషయం: ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి-నిరర్థక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు చెల్లించవలసిన లోన్ అకౌంట్స్ క్రింద మా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట** బ్రాంచి **(34640)** వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను **ది.09-06-2025**న నిరర్థక ఆస్తిగా (**NPA**) వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు **ది. 17-06-2025** నాటికి మొత్తము **రూ. 53,22,673.83/-** (అక్షరాలా యాభై మూడు లక్షల ఇరవై రెండు వేల ఆరు వందల డెబ్బై మూడు రూపాయల ఎనభై మూడు పైసలు మాత్రమే) అనేక మార్లు విన్నపములు చేసినప్పటికి, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు/మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పంద రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంక్ వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము /డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంక్ వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.

3) SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 18-06-2025 **అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలతో
జీవనోపాధులకే పెను ముప్పు



కన్నూరులో నిర్వహించిన ర్యాలీలో అగ్రభాగాన డాక్టర్ అశోక్ ధావలే, విజు కృష్ణన్, అమ్రారామ్ తదితరులు

- అఖిల భారత కిసాన్ సభ ఆందోళన
- సార్వత్రిక సమ్మెను జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బ్రిటన్, అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఇయు) దేశాలతో వ్యవసాయరంగంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం వల్ల దేశంలోని ప్రజల జీవనోపాధులకే పెను ముప్పు వాటిల్లుతుందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వినాశకర విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. అలాగే క్యూబాకు సంఘీభావంగా నిధిని సేకరించాలని నిర్ణయించింది. కేరళలోని కన్నూరులో ఇకె నయనార్ అకాడమీలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఎఐకెఎస్ కేంద్ర కమిటీ సమావేశాల్లో ఈ మేరకు తీర్మానించారు. తొలుత ఎఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే జెండాను ఆవిష్కరించారు. అనంతరం దేశంలోని రైతుల కోసం జరిగిన పోరాటంలో ప్రాణాలను అర్పించిన వారి త్యాగాలను గౌరవిస్తూ సభ్యులందరూ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఆహ్వాన కమిటీ చైర్మన్ ఇపి జయరాజన్ స్వాగత ప్రసంగం చేశారు. ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్ ముసాయిదా నివేదికను ప్రవేశపెట్టారు. ఎఐకెఎస్ కోశాధికారి పి కృష్ణ ప్రసాద్ తదితరలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అశోక్ ధావలే అధ్యక్ష ప్రసంగం చేస్తూ ఉద్యమం ముందున్న కీలకమైన రాజకీయ సవాళ్లను, లక్ష్యాలను వివరించారు. రైతుల హక్కుల రక్షణకు పోరాటాలను తీవ్రతరం చేయాలని, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరోధించడానికి, ప్రస్తుత బిజెపి, సంఘ్ పరివార్ పాలనా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి కార్మిక, కర్షక ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని తెలిపారు.

దేశంలోని వ్యవసాయ సంక్షోభం, బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలపై సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మిక చట్టాలు, 12 గంటల పని దినం, భూమి సేకరణ మొదలైన వాటిని ముందుకు తీసుకెళ్తున్నాయని కూడా సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. రైతులు, కార్మికులు, ఎంఎస్ఎంఇ నిర్వాహకుల ప్రయోజనాలను తుంగలో తొక్కి, సమాఖ్య సూత్రాలను ఉల్లంఘించి, పార్లమెంటును పక్కను పెట్టే సేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేయడానికి మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని విమర్శించింది.

మండల స్థాయిలో నిరసనలు

ఈ నెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐకెఎస్ కేంద్ర కమిటీ సమావేశం పిలుపునిచ్చింది. మండల స్థాయిలో శ్రమజీవులను సమీకరించి భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కోరింది. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) సంయుక్తంగా నిర్వహించే ఈ సమ్మెను విజయవంతం చేయడానికి అన్నదాతలు, వ్యవసాయ కార్మికులు కృషి చేయాలని పిలుపునిచ్చింది.

ఈ నెల 26 క్యూబా సంఘీభావ ప్రచారం

అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా ఈ నెల 26 నుండి ఆగస్టు 5 వరకు క్యూబా సంఘీభావ ప్రచారం నిర్వహించాలని కిసాన్ సభ నిర్ణయించింది.

సంఘీభావ నిధిని సేకరించి క్యూబాకు అందజేయాలని సూచించింది. అలాగే కార్మిక వ్యతిరేక కార్మిక కోడ్ల ఉపసంహరణ, విద్యుత్ ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్లను ఆపాలని డిమాండ్ చేసింది. ఎంఎస్‌పి, రుణ మాఫీ, భూమి హక్కులు, ఉపాధి హామీ, స్థానిక సమస్యలు వంటి రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై కూడా పోరాడాలని సమావేశం నిర్ణయించింది. ప్రజల భద్రతను, వ్యవసాయ భూములను అడవి జంతువుల ముప్పు నుండి రక్షించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది. వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని సవరించడానికి బిజెపి ప్రభుత్వం నిరాకరించడాన్ని ఖండించింది. మానవ ఆవాసాలపై వన్యప్రాణుల దాడులను నిరోధించడానికి విస్తృత ఐక్య కార్యాచరణ బృందాలకు పిలుపునిచ్చింది.

జార్ఖండ్‌లో అఖిల భారత భూ హక్కుల సదస్సు

రాబోయే నెలల్లో రాష్ట్ర స్థాయి భూమి హక్కుల సమావేశాల తరువాత జార్ఖండ్‌లో అఖిల భారత భూ హక్కుల సదస్సు నిర్వహించనున్నట్లు సమావేశంలో పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో అఖిల భారత నిర్మాణ కన్వెన్షన్ జరుగుతుందని పేర్కొంది. ఎఐకెఎస్ ఒక కొత్త మైలురాయిని దాటిందని, గత ఐదేళ్లుగా తన పరిధిని క్రమంగా పెంచుకున్న తర్వాత, అండమాన్ నికోబార్ దీవులు సహా 27 రాష్ట్రాలలో విస్తరించిందని తెలిపింది. ప్రస్తుతం ఎఐకెఎస్ సభ్యత్వం 1,53,5,100 కు చేరిందని కోశాధికారి కృష్ణప్రసాద్ తెలిపారు.

రైతుల హక్కుల రక్షణకు పోరాటాలు తీవ్రతరం

రైతుల హక్కుల రక్షణకు పోరాటాలను తీవ్రతరం చేయాలని అశోక్ దావలే పిలుపు ఇచ్చారు. కన్నూర్‌లో జరిగిన భారీ ప్రదర్శన, బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇపి జయరాజన్ అధ్యక్షత జరిగిన ఈ బహిరంగ సభలో విజు కృష్ణన్, ఎంపి అమ్రా రామ్, ఎఐకెఎస్ కేరళ అధ్యక్షులు ఎం విజయకుమార్, ప్రధాన కార్యదర్శి వల్సన్ పనోలి, సహాయ కార్యదర్శి ప్రకాశన్ మాస్టర్ ప్రసంగించారు.

హార్సిలీ హిల్స్‌ను రామ్‌దేవ్‌కు అప్పగించొద్దు

- సిఎం చంద్రబాబుకు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మదనపల్లి హార్సిలీ హిల్స్‌ను రామ్‌దేవ్ బాబాకు అప్పగించొద్దని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంగళవారం లేఖ రాశారు. అనంతరం ఎపి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మదనపల్లి హార్సిలీ హిల్స్‌ను రామ్‌దేవ్ బాబాకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్పొరేట్లకు మించిన కార్పొరేట్ రామ్‌దేవ్ బాబా అని విమర్శించారు.

కాంట్రాక్టర్ల కనుసన్నల్లో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కోసం చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. కేంద్రం బనకచర్ల ప్రతిపాదనలు తిప్పి పంపడం ముఖ్యమంత్రి ఏకపక్ష నిర్ణయాలకు చెంపపెట్టు అని అన్నారు. వెలుగొండ టన్నెల్ పూర్తి కాలేదన్నారు.

పచ్చటి భూములు లాక్కోవద్దు

- శక్తిపీఠ్ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రైతుల ఆందోళన

శంభాజీనగర్ : మహారాష్ట్రలో రైతులు రోడ్డెక్కారు. తమ పచ్చని పొలాల మీదుగా రహదారి నిర్మించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని మరత్వాడ రీజియన్‌లోని పలు జిల్లాల రైతులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. శక్తిపీఠ్ ఎక్స్‌ప్రెస్ వే పేరుతో నాగ్‌పూర్ నుంచి గోవా వరకు ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం భూ సర్వే చేపట్టాలని గత జూన్ 24న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అయితే సారావంతమైన భూములను ఈ ప్రాజెక్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం అందుకు సుముఖంగా కనిపించకపోవడంతో అప్పటి నుంచి ఆందోళనలు ప్రారంభమయ్యాయి. మంగళవారం నాందేడ్, హింగోలి, బీడ్, ధరాశివ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు రోడ్లు, కూడలిల్లో బైఠాయించి ఆందోళనకు దిగారు. కాంగ్రెస్‌కు చెందిన నాందేడ్ ఎంపి రవీంద్ర చవాన్ మీడియాతో మాట్లాడుతూ 'శక్తిపీఠ్ ప్రాజెక్టు కోసం సర్వే చేస్తున్నప్పుడు ప్రభుత్వం రైతులను విస్మరించింది. మేం సర్వేను వ్యతిరేకిస్తున్నాం' అని తెలిపారు. మధ్య, పశ్చిమ మహారాష్ట్రను గోవాకు అనుసంధానిస్తూ 802 కిలోమీటర్ల పొడవునా ఆరు లైన్లతో ఈ ఎక్స్‌ప్రెస్ వేను నిర్మించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసింది. మాహుర్‌లోని రేణుకా దేవి, తుల్జాపూర్‌లోని తుల్జా భవాని, కొల్హాపూర్‌లోని మహాలక్ష్మి, గోవాలోని పత్రాదేవి వంటి శక్తిపీఠాలతో సహా 18 ప్రధాన పర్యాటక క్షేత్రాలను ఎక్స్‌ప్రెస్‌వే అనుసంధానించనుంది. వార్ధా జిల్లాలోని పవ్నార్ నుంచి మహారాష్ట్ర-గోవా సరిహద్దులోని సింధుదుర్గ్ వరకూ వేళ్లే ఈ ఎక్స్‌ప్రెస్ వే మొత్తం 12 జిల్లాల్లో గుండా వెళుతోంది. ఇందులో మరాఠ్వాడ రీజన్‌లోని నాందేడ్, హింగోలి, పర్భాని, బీడ్, లాతూర్, ధరాశివ్ జిల్లాల గుండా వెళుతుందని ఒక అధికారి తెలిపారు.

ట్రంప్ సన్నిహితుల ఈ-మెయిల్స్‌ను విడుదల చేస్తాం : హ్యాకర్ల ప్రకటన

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సన్నిహితంగా ఉంటే వ్యక్తుల నుండి దొంగిలించిన మరికొన్ని ఈ-మెయిల్స్‌ను విడుదల చేస్తామని కొందరు హ్యాకర్లు ప్రకటించారు. తమకు ఇరాన్‌తో సంబంధాలున్నాయని వారు చెప్పుకున్నారు. అమెరికా ఎన్నికలకు ముందు వీరు ఇలాంటి కొన్ని ఈ మెయిల్స్‌ను మీడియాకు అందజేశారు. అధ్యక్షభవనం సిబ్బంది అధిపతి సుసీ వైల్స్, ట్రంప్ న్యాయవాది లిండ్సే హల్లిగాన్, ట్రంప్ సలహాదారు రోజర్ స్టోన్స్, సినీనటి, ట్రంప్ విమర్శకురాలు అయిన స్టార్మీ డేనియల్స్‌కు చెందిన ఖాతాల నుండి దొంగిలించిన సుమారు వంద గిగాబైట్ల ఈ-మెయిల్స్ తమ వద్ద ఉన్నాయని వారు తెలిపారు.

తమ వద్ద ఉన్న సమాచారాన్ని అమ్మే అవకాశం ఉన్నదని రాబర్ట్‌గా చెప్పుకుంటున్న ఓ హ్యాకర్ తెలిపాడు. అయితే వారి పథకమేమిటో స్పష్టంగా తెలియజేయలేదు. ఈ మెయిల్స్‌లోని సమాచారాన్ని కూడా బయటపెట్టలేదు. ఈ ఉదంతాన్ని 'అనాలోచిత సైబర్ దాడి'గా అమెరికా అటార్నీ జనరల్ పామ్ బోండీ అభివర్ణించారు. దేశ భద్రతకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా వారిపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామని ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ చెప్పారు. కాగా తాను ఎలాంటి సైబర్ గూఢచర్యానికి పాల్పడడం లేదని ఇరాన్ గతంలోనే స్పష్టం చేసింది. కాగా ట్రంప్ సన్నిహితులు కూడా తాజా పరిణామంపై స్పందించలేదు.

సంపన్నులకే ప్రయోజనం



- ట్రంప్ 'అత్యద్భుత' బిల్లుపై సెనెట్‌లో మొదలైన చర్చ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గొప్పలు చెప్పుకుంటున్న 'అత్యద్భుత బిల్లు'పై అమెరికా సెనెట్‌లో విస్తృత చర్చ జరుగుతోంది. అమెరికా శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో ఆ లోపే బిల్లుకు ఆమోదం పొందాలని రిపబ్లికన్లు ఆశిస్తున్నారు. మార్పులు, చేర్పులతో కూడిన 940 పేజీల తాజా బిల్లుపై చర్చ ప్రారంభించడానికి సెనెట్ శనివారం 51-49 ఓట్లతో ఆమోదం తెలిపింది. ఇద్దరు రిపబ్లికన్ సభ్యులు డెమొక్రాట్లతో కలిసి తీర్మానాన్ని వ్యతిరేకించినప్పటికీ స్వల్ప మెజారిటీతో చర్చను మొదలు పెట్టారు. సెనెట్‌లో రిపబ్లికన్లకు 53, డెమొక్రాట్లకు 47 స్థానాలు ఉన్నాయి. రిపబ్లికన్ల నియంత్రణలో ఉన్న అమెరికా ప్రతినిధి సభ మే 22న బిల్లును 215-214 ఓట్లతో ఆమోదించింది. అయితే సెనెట్‌లో దానికి కొన్ని సవరణలు చేశారు. సెనెట్ ఆమోదం తర్వాత అది చట్టంగా మారాలంటే ఉభయ సభలు మళ్లీ దానిని ఆమోదించాల్సి ఉంటుంది.

'రాజీ' తప్పదు

సవరణలతో తన ముందుకు వచ్చిన బిల్లును సెనెట్ ఆమోదించిన పక్షంలో ఉభయ సభల సభ్యులు రాజీకి వచ్చి ఓ బిల్లును రూపొందిస్తారు. అప్పుడు ప్రతినిధి సభలోనూ, సెనెట్‌లోనూ దానిపై ఓటింగ్ జరుగుతుంది. ప్రతినిధి సభలో రిపబ్లికన్లకు 220 స్థానాలు, డెమొక్రాట్లకు 212 స్థానాలు ఉన్నాయి. బిల్లు ఉభయ సభలలో ఆమోదం పొందిన తర్వాత అధ్యక్షుడి వద్దకు వస్తుంది. ఆయన దానిపై సంతకం చేస్తే చట్టంగా మారుతుంది. అయితే చివరికి ఓడేదెవరు? గెలిచేదెవరు? అన్నదే ఇక్కడ ప్రశ్న. బిల్లును డెమొక్రాట్లతో పాటు కొంతమంది సంప్రదాయవాదులు కూడా వ్యతిరేకిస్తున్నారు. ఒకవేళ బిల్లు ఉభయ సభల ఆమోదం పొందితే ఎక్కువ ప్రయోజనం ఎవరు పొందుతారన్న దానిపై అనేక విశ్లేషణలు వెలువడుతున్నాయి.

వీరికే ప్రయోజనకరం

ట్రంప్ ప్రతిపాదించిన బిల్లు ఉభయ సభల ఆమోదం పొందితే అధిక ఆదాయం పొందుతున్న కుటుంబాలకే ఎక్కువ లబ్ది చేకూరుతుంది. ట్రంప్ తన మొదటి పదవీకాలంలో ప్రవేశపెట్టిన పన్ను కోతలను ఈ బిల్లు పొడిగిస్తోంది. ఇది అమెరికా ప్రజలకు లాభదాయకమని ట్రంప్ చెబుతున్నప్పటికీ కొందరికి మాత్రమే ప్రయోజనకరమని చెప్పవచ్చు. వార్షిక ఆదాయం 4,60,000 డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్న కుటుంబాలకు మొత్తం పన్ను కోతలలో మూడో వంతు చేరుతుంది. వార్షిక ఆదాయం 2,17,000 డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్న కుటుంబాలకు పన్ను కోతలలో 57 శాతం అందుతుంది. సెనెట్ ముందున్న బిల్లు ప్రకారం... 2026లో ప్రతి కుటుంబానికీ సగటున 2,600 డాలర్ల చొప్పున పన్ను తగ్గుతుంది. అధిక ఆదాయం పొందుతున్న కుటుంబాలకే మరింతగా పన్ను ప్రయోజనాలు చేకూరుతాయని ట్యాక్స్ పాలసీ సెంటర్ విశ్లేషించింది. బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపితే అధిక ఆదాయం కలిగిన కుటుంబాలతో పాటు పిల్లలు ఉన్న కుటుంబాలు, సంప్రదాయ కార్ల తయారీదారులు, బహుమతులు (టిప్స్) పొందే కార్మికులు ప్రయోజనం పొందుతారు.

వీరికి నష్టమే

బిల్లు ఆమోదం పొందితే ఫుడ్ స్టాంప్ పొందుతున్న వారు, మెడిక్‌ఎయిడ్ ప్రయోజనాలు అందుతున్న అల్పాదాయ వర్గాలు, ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిదారులు నష్టపోతారు. అల్పాదాయ వర్గాలకు చెందిన వారు ఆహారం కొనుగోలు చేయడానికి ఫుడ్ స్టాంపులు ఉపయోగపడుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నెలకు 42.1 మిలియన్ల ప్రజలు ఈ కార్యక్రమం ద్వారా లబ్ది పొందారు. ఈ కార్యక్రమానికి కేటాయిస్తున్న నిధులలో కోత విధించాలని సెనెట్ ప్రతిపాదించింది. ఇక అల్పాదాయ వర్గాలకు ప్రయోజనం చేకూరుస్తున్న ఆరోగ్య రక్షణ కార్యక్రమానికి ప్రభుత్వ ఆర్థిక మద్దతును 930 బిలియన్ డాలర్ల మేర తగ్గించాలని తాజా బిల్లు ప్రతిపాదించింది. ఈ ఏడాది మార్చి నాటికి మెడిక్‌ఎయిడ్ ఆరోగ్య బీమాలో అల్పాదాయ వర్గాలకు చెందిన 71 మిలియన్ల అమెరికన్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. బిల్లుకు ఆమోదం లభిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రస్తుతం అందుతున్న పన్ను ప్రయోజనాలను వదలుకోవాల్సిందే. ఈ ఏడాది చివరి నాటికి పన్ను ప్రయోజనాలను పూర్తిగా తొలగించాలని సెనెట్ బిల్లు ప్రతిపాదించింది. ఈ బిల్లుతో ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా కార్ల తయారీ కంపెనీ కూడా నష్టపోతుంది. ఎందుకంటే ఈ కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేస్తోంది.

ఈ బిల్లును కొందరు కన్సర్వేటివ్‌లు వ్యతిరేకిస్తున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే దేశం మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సెనెట్‌లో ప్రతిపాదించిన తాజా బిల్లు ప్రకారం 2025-2034 మధ్యకాలంలో రుణ భారం 3.3 ట్రిలియన్ డాలర్లు పెరుగుతుంది. ప్రస్తుతం అమెరికా అప్పులు 36 ట్రిలియన్ డాలర్లు. అమెరికా స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) ఇది 122 శాతంగా ఉంది.

అమెరికా విదేశీ సాయంలో కోతలతో
మృత్యువు దిశగా కోటీ 40లక్షల మంది

- ఒక అధ్యయనంలో వెల్లడి



పారిస్ : అమెరికా విదేశీ సాయంలో విధించిన కోతల కారణంగా కోటీ 40లక్షల మందికి పైగా ప్రజలు మృత్యువాతకు చేరువలో వున్నారని ఒక పరిశోధనా పత్రం మంగళవారం వెల్లడించింది. ప్రతిష్టాత్మక లాన్సెట్ జర్నల్‌లో ఈ అధ్యయన పత్రాన్ని ప్రచురించారు. పలు కోతలతో సంక్షోభంలో వున్న సహాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశ్యంతో ప్రపంచ, వాణిజ్య నేతలు ఈ వారంలో స్పెయిన్‌లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో సమావేశానికి హాజరవుతున్నారు. ఆ నేపథ్యంలో ఈ అధ్యయన పత్రం వెలువడింది. ట్రంప్ ఈ ఏడాది జనవరిలో అధికారం చేపట్టేవరకు అంతర్జాతీయ మానవతా సాయంలో 40శాతానికి పైగా మొత్తాన్ని యుఎస్‌ఎయిడ్ (అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ) అందచేసేది. రెండు వారాల్లోనే ట్రంప్ ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాలంటూ తీసుకున్న చర్యల్లో భాగంగా అమెరికా విదేశీ సాయంలో కోత పడింది. అకస్మాత్తుగా నిధులు రావడం ఆగిపోవడం, కొన్ని చోట్ల తగ్గించడం వంటి కారణాల వల్ల ఆరోగ్య రంగంలో రెండు దశాబ్దాల పురోగతి స్తంభించపోయే ప్రమాదముందని ఆ అధ్యయన పత్ర సహ రచయిత డేవిడ్ రసెల్లా హెచ్చరించారు. బార్సిలోనా గ్లోబల్ హెల్త్ ఇనిస్టిట్యూట్‌లో ఆయన రీసెర్చర్‌గా పనిచేస్తున్నారు. ఈ చర్య వల్ల అనేక పేద దేశాలు, ఒక మోస్తరు ఆదాయం కలిగిన దేశాలకు పెద్ద ఎదురు దెబ్బ తగిలిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో లేదా పెద్ద ఎత్తున సాయుధ ఘర్షణలు తలెత్తినపుడు సంభవించే సంక్షోభ పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని ఆయన తెలిపారు. 133 దేశాలకు చెందిన డేటాను అంతర్జాతీయ పరిశోధకుల బృందం పరిశీలించింది. అమెరికా అందించిన విదేశీ సాయం వల్ల 2001-2021 మధ్య కాలంలో వర్ధమాన దేశాల్లో 90లక్షలకు పైగా మరణాలు నివారించబడ్డాయని ఈ బృందం అంచనా వేసింది. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా ప్రభుత్వం ప్రకటించిన 83శాతం మేరా విదేశీ సాయం కోత మరణాల రేటును ఎలా ప్రభావితం చేస్తుందో వారు అధ్యయనం చేశారు. ఈ కోతలు 2030 నాటికి కోటీ 40లక్షలకు పైగా నివారించదగ్గ మరణాలకు దారి తీయవచ్చుని అంచనా వేశారు. ఈ మరణాల్లో ఐదేళ్ళ లోపు వయస్సు గల పిల్లలు 45లక్షల మంది వరకు వుంటారని లేదా ఏడాదికి ఏడు లక్షలమంది పిల్లలు చొప్పున మరణించేందుకు అవకాశాలు వుంటాయని అంచనా వేశారు. ఈ సంఖ్యల తీవ్రత గురించి చెప్పాలంటే మొదటి ప్రపంచ యుద్ధంలో దాదాపు కోటిమంది సైనికులు మరణించి వుంటారని అంచనా దానితో పోలిస్తే ఇప్పుడు సాయంలో కోతలతో మరణించే వారి సంఖ్య చాలా ఎక్కువగా వుంది. యుఎస్ ఎయిడ్ మద్దతిచ్చిన కార్యక్రమాల వల్ల అనేక కారణాలతో మరణించే వారి సంఖ్య 15శాతం తగ్గడానికి దారి తీసింది. అదే ఐదేళ్ళలోపు చిన్నారులైతే, ఈ రేటు 32శాతంగా వుంది. అలాగే విదేశీ సాయం అధికంగా అందే దేశాలు, అసలు అందని దేశాల మధ్య పోల్చి చూసినట్లైతే హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల మరణాలు సాయం అందే దేశాల్లో 65శాతం తక్కువగా నమోదయ్యాయని అధ్యయనంలో వెల్లడైంది. అలాగే మలేరియా, ఇతర వ్యాధుల కారణంగా మరణించేవారి సంఖ్య కూడా తగ్గింది.

ఇయు దేశాలూ అదే బాట

అమెరికా చర్య నేపథ్యంలో జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ సహా పలు దేశాలు అదే బాట పట్టాయి. తమ విదేశీ సాయం బడ్జెట్లల్లో భారీగా కోతలు విధించాయి. ఈ కోతలు ముఖ్యంగా యురోపియన్ యూనియన్ దేశాల చర్యల వల్ల రాబోయే సంవత్సరాల్లో అదనంగా మరణాలు సంభవిస్తాయని అధ్యయన పత్రం సహ రచయిత కేథరినా మోంటి తెలిపారు. ఈ సాయాన్ని తక్షణమే పెంచాల్సిన సమయం ఆసన్నమైందని రసెల్లా వ్యాఖ్యానించారు.

థాయిలాండ్ ప్రధానిపై సస్పెన్షన్ వేటు



బ్యాంకాక్ : థాయిలాండ్ ప్రధాని పెటాంగ్‌టార్న్ షినవత్రను రాజ్యాంగ కోర్టు ఆ పదవి నుండి సస్పెండ్ చేసింది. లీకైన ఫోన్ కాల్ ఆమె పదవికి గండంగా మారింది. ఆ ఫోన్ కాల్‌కు సంబంధించి నైతిక ఉల్లంఘనలపై రాజ్యాంగ కోర్టు దర్యాప్తు చేస్తోంది. షినవత్రను డిస్మిస్ చేయాలని కోరుతూ 36మంది సెనెటర్లు పెట్టిన పిటిషన్‌ను పరిశీలించనున్నట్లు కోర్టు మంగళవారం ప్రకటించింది. రాజ్యాంగాన్ని అతిక్రమించి నైతిక ప్రమాణాలను ఉల్లంఘిస్తూ ఆమె మోసానికి పాల్పడ్డారని వారు ఆ పిటిషన్‌లో ఆరోపించారు. కంబోడియామాజీ నేత హన్ సెన్‌తో షినవత్ర మాట్లాడిన ఫోన్ సంభాషణ లీకైన నేపథ్యంలో ఆమెపై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. థాయిలాండ్, కంబోడియా మధ్య గల సరిహద్దు వివాదాన్ని ఆమె ఆ సంభాషణలో చర్చించారు. పైగా ఆ కాల్‌లో ఆమె, హన్ సెన్‌ను అంకుల్ అని సంబోధించడం వినిపించింది. ఆయన ఏమైనా కావాలని కోరుకున్నట్లైతే తాను దాని గురించి చూడగలనని ఆమె చెప్పారు. పైగా సీనియర్ థాయి మిలటరీ కమాండర్ గురించి కూడా ఆమె తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఆ ఫోన్ సంభాషణ పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. కంబోడియాతో అంటకాగుతూ ప్రధాని తన దేశానికే ద్రోహం చేశారంటూ విమర్శకులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు కంబోడియాను పాలించిన హన్ సెన్ ఇంకా దేశంలో శక్తివంతమైన నేతగానే వున్నారు. పైగా షినవత్ర కుటుంబానికి పాత మిత్రుడు కూడా. మంగళవారం నాటి రాజ్యాంగ కోర్టు నిర్ణయం షినవత్రకు పెద్ద ఎదురుదెబ్బ. ఈ నెల ఆరంభంలో సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వామి ఒకరు కూటమి నుండి వైదొలగినా ఆమె అధికారాన్ని అంటిపెట్టుకునే వున్నారు. దాంతో చాలా స్వల్ప మెజారిటీతోనే ప్రస్తుత ప్రభుత్వం వుంది. షినవత్ర రాజీనామా కోరుతూ శనివారం పది వేల మందికి పైగా ఆందోళనకారులు బ్యాంకాక్ వీధుల్లో నిరసన ప్రదర్శన చేశారు.

సుప్రీంకోర్టు సిబ్బంది నియామకాల్లో రిజర్వేషన్లు

- ఇదే తొలిసారి
- జూన్ 23 నుంచే అమలులోకి
- సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



దేశ సర్వోన్నత న్యాయస్థానం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. తొలిసారిగా సిబ్బందికి రిజర్వేషన్లు అమలు చేయనుంది. ప్రత్యక్ష నియామకాల్లోనూ, ఉద్యోగోన్నతి లోనూ షెడ్యూల్డ్ తరగతులు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) అభ్యర్థులకు తొలిసారిగా రిజర్వేషన్లు అమలుకానున్నాయి. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్లు అమలు అవుతున్నా..సుప్రీకోర్టు వరకు మినహాయింపు ఉండేది. అయితే ఇక నుంచి సుప్రీంకోర్టులో నాన్-జ్యుడీషియల్ పోస్టులకు ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయనున్నారు. సుప్రీంకోర్టు రిజర్వేషన్ విధానం పేరిట ఈ ఏడాది జూన్ 23 నుంచి అమలులోకి తీసుకొచ్చినట్లు భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ తెలిపారు. భారత సుప్రీంకోర్టులో పరిపాలనా పనితీరులో భారీ మార్పునకు సంకేతంగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ సంస్థలు, హైకోర్టుల్లో రిజర్వేషన్ విధానం వర్తిస్తే.. సుప్రీంకోర్టు మాత్రమే ఎందుకు మినహాయింపుగా ఉండాలి? అని గవాయ్ ప్రశ్నించారు. మన విలువలు, మన చర్యలకు అద్దం పట్టాలని హితవు పలికారు. ఈ ఏడాది జూన్ 24న జారీ చేసిన సర్క్యులర్, మోడల్ రోస్టర్ ప్రకారం ఉన్నత న్యాయస్థాన ఉద్యోగులకు పదోన్నతుల్లో ఎస్సీలకు సుప్రీంకోర్టులో 15 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. అలాగే ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. అయితే, ఈ రిజర్వేషన్లు న్యాయమూర్తుల నియామకాలకు వర్తించదు. రిజిస్ట్రార్, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్, జూనియర్ కోర్ట్ అసిస్టెంట్, ఛాంబర్ అటెండెంట్ తదితర పోస్టులకు మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుంది.

పారిశ్రామిక భద్రతా ప్రమాణాలు పాటించాలి

- ప్రమాదాలకు బాధ్యులైన వారిని శిక్షించాలి
- సిఐటియు డిమాండ్

న్యూఢిల్లీ : సంగారెడ్డిలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో సోమవారం సంభవించిన రియాక్టర్ పేలుడు కారణంగా 44మంది చనిపోవడం, పలువురు గాయపడడం అలాగే శివకాశి బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు ఘటనల పట్ల సిఐటియు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపాన్ని, సానుభూతిని తెలియచేసింది. రియాక్టర్ పేలిపోయిన ఘటనలో మరణించినవారిలో ఎక్కువమంది వలస కార్మికులేనని పేర్కొంది. మరోవైపు శివకాశిలోని బాణాసంచా ఫ్యాక్టరీలో సంభవించిన పేలుడులో కూడా ఐదుగురు మరణించారని వార్తలు వస్తున్నాయి. బాధిత కుటుంబాలకు ప్రభుత్వాలు అందచేసే ఎక్స్‌గ్రేషియాకు అదనంగా మరణించిన వారందరికీ చట్టబద్ధంగా అందాల్సిన నష్టపరిహారం కూడా ఇవ్వాలని సిఐటియు కోరింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. పారిశ్రామిక భద్రతా ప్రమాణాలు పూర్తిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్రాల కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖలను, సంబంధిత ఫ్యాక్టరీల డైరెక్టరేట్‌లను సిఐటియు కోరింది. దేశవ్యాప్తంగా ఎక్కడో అక్కడ ఇలాంటి పారిశ్రామిక ప్రమాదాలు చోటు చేసుకుంటూనే వున్నాయని, పైగా ఈ సంఖ్య పెరుగుతోందని, దీన్నిబట్టి చూస్తే కార్మికుల ప్రాణాల పట్ల పాలక వర్గాల ఉదాసీనత, నిర్లక్ష్యం వెల్లడవుతోందని విమర్శించింది. పైగా బాయిలర్లు, ఫర్నేస్‌లను సక్రమంగా, సురక్షితంగా నిర్వహించడంలో యాజమాన్యాల నిర్లక్ష్యానికి జైలుశిక్షలకు బదులుగా జరిమానాలు విధించేలా వాటిని నేరరహితం చేస్తూ కార్మిక చట్టాలను, పారిశ్రామిక భద్రతా ప్రమాణాలను విధ్వంసకరమైన రీతిలో సవరించడం, నియంత్రణల సడలింపు వంటివి పని ప్రదేశాల్లో ఇలాంటి ప్రమాదాలు పెరగడానికి ప్రధాన కారణమని విమర్శించింది. ప్రమాదాలు ఇంతలా పెరుగుతున్నప్పటికీ కేంద్రం 2023లో జన్ సురక్షా చట్టాన్ని తీసుకువచ్చింది. యాజమాన్యాల నేరాలను నేరరహితం చేయడమే ఈచట్టం ఉద్దేశ్యం. తాజా బడ్జెట్‌లో కూడా కేంద్రం జన సురక్షా బిల్లు 2.0ని తీసుకువస్తామని ప్రకటించింది. కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టే ఇటువంటి చర్యలను తక్షణమే కేంద్రం విరమించుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. కార్మిక సంఘాల సంయుక్త వేదిక పిలుపిచ్చిన మేరకు జులై 9నాటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి సిఐటియు పిలుపిచ్చింది.

బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

- ఆరుగురు కార్మికులు మృతి

శివకాశి : తమిళనాడులోని శివకాశి పట్టణానికి సమీపంలో బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు కార్మికులు మరణించారు. మరో ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. చిన్నకామన్ పట్టి గ్రామంలోని గోఖలేస్ బాణాసంచా తయారీ కేంద్రంలో మంగళవారం ఉదయం 8:45 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించిందని స్థానికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పేలుడు ధాటికి కేంద్రంలోని ఎనిమిది షెడ్‌లు నేలమట్టమయ్యాయి.

సిగాచి మృత్యుఘోష

(మొదటి పేజీ తరువాయి)

పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులకు ఉచితంగా వైద్య చికిత్స అందిస్తామన్నారు. బాధితుల పిల్లలను చదివించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రమాదానికి బాధ్యులైన వారందరిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా అన్ని రకాల చర్యలూ తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు పరిశ్రమల శాఖ అధికారులు, మంత్రులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. సిగాచీ పరిశ్రమలో అధికారులు, బాయిలర్స్ డైరెక్టర్లు తనిఖీలు చేశారా? బాయిలర్లను తనిఖీ చేసి ఏమైనా సమస్యలు గుర్తించారా? బాయిలర్ల పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా సూచనలు చేశారా? అని ప్రశ్నించారు. పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా? అని ప్రశ్నించారు. ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

సుమోటోగా స్వీకరించిన హెచ్ఆర్‌సి

పాశమైలారం అగ్నిప్రమాద ఘటనను రాష్ట్ర మానవహక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సి) సుమోటోగా స్వీకరించింది. ఈ ప్రమాద ఘటనపై విచారణ జరిపి జులై 30లోగా నివేదిక సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేబర్ కమిషనర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్, సంగారెడ్డి ఎస్‌పికి ఆదేశాలు జారీ చేసింది.

పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు

సిగాచీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై కేసు నమోదైంది. బాధిత కుటుంబానికి చెందిన యశ్వంత్ ఫిర్యాదుతో పరిశ్రమ యాజమాన్యంపై పోలీసులు బిఎన్ఎస్ 105, 110, 117 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఆటలూ ప్రయివేటుకే

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యాలు (పిపిపి), కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)తో క్రీడల్లో ప్రయివేటు పెట్టుబడులకు తలుపులు తెరవనున్నారు. 2036 ఒలింపిక్ క్రీడలతో సహా అంతర్జాతీయ క్రీడల్లో రాణించడానికి ఇండియా బలమైన పోటీదారుగా ఉండేందుకు ఈ పాలసీ ఉపయోగపడుతుందని అశ్వనీ కుమార్ చెప్పుకొచ్చారు.

మరిన్ని నిర్ణయాలు

ఇఎల్ఐ పథకం : తయారీ రంగంలో ఉపాధిని పెంచేందుకు వీలుగా ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకం ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ (ఈఎల్ఐ)కి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. రూ.99,446 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ పథకం కింద మొదటిసారి ఉద్యోగులు ఒక నెల వేతనం (రూ. 15,000 వరకు) పొందుతారు. అదనపు ఉపాధిని సృష్టించేందుకు యజమానులకు రెండేళ్ల వరకు ప్రోత్సాహకాలు అందిస్తారు. తయారీ రంగానికి మరో రెండేళ్లు పాటు ఈ ప్రయోజనాలు లభిస్తాయి. ఇందుకోసం రూ.రెండు లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారులు : దక్షిణ భారతదేశంలో మౌలిక సదుపాయాలకు పెద్ద ప్రోత్సాహకంగా, తమిళనాడులోని జాతీయ రహదారిలోని పరమకుడి-రామనాథపురం సెక్షన్‌ను నాలుగు లేన్లుగా మార్చడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అశ్వనీకుమార్ తెలిపారు. 46.7 కిలోమీటర్ల రోడ్డును రూ.1,853 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పంబన్ వంతెన దగ్గర డబుల్ లైన్ రహదారి ఉందని.. ధనుష్కోడి వరకు సముద్ర తీరానికి సంబంధించిన డిపిఆర్ కూడా జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

జీవన సారథ్యం

చేయగలిగే శక్తి ఉన్నవారి కంటే, చెయ్యాలనే కోరిక, సంకల్పం ఉన్నవారు ఎక్కువ చెయ్యగలరు.

మీ కోసం

గ్లాసు పాలలో చిటికెడు పసుపు వేసి కాచుకొని రోజూ ఉదయాన్నే తాగితే జలుబు, దగ్గు, గొంతు సమస్యలు తగ్గుతాయి.



పల్లెటూరు



పల్లెటూరు మన ఊరు
ఆత్మీయతకు మారుపేరు

కష్టాలలో ఆదరించు
కన్నతల్లి మన ఊరు

కులమత భేదం లేని
బంధాలకు పొదరిల్లు

మమతానురాగాలకు
పల్లెటూరె ఆనవాలు

కష్టమైనా సుఖమైనా
కలిసి పంచుకునే తీరు

కర్షక కార్మిక శ్రామిక
పనివారల పుట్టినిల్లు

పాడి పంటలు పశువుల
నెలవే మన పల్లెటూరు

పచ్చని చెట్లూ చేమలు
ప్రకృతి అందాల జోరు

ఎండనక వాననకా
కష్టించే రైతన్నలు

పగలనక రేయనకా
పనిచేసే కార్మికులు

కష్టించే తత్వానికి
ప్రతి రూపం మన ఊరు

కలిమైనా లేమియైన
కష్టమైన సుఖమైనా

చిన్నా పెద్దని ఎరుగని
జీవనగమనమె ఊరు

అంతా ఒకటని చాటే
ఐక్యతకు పెట్టింది పేరు

ఆపదలో ధైర్యంగా
ఆనందంలో కలివిడిగ

అవసరాల్లో ఆదరించు
ఆదర్శ భూమి మన ఊరు

అనుబంధం ఆప్యాయతల
అలయ్ బలయ్ పల్లెటూరు

- నాగరాజు కామర్సు,
తెలుగు ఉపాధ్యాయుడు, దుబ్బాక,
92480 93580.


నేను గీసిన బొమ్మ





ఆరిపాక సూర్య ప్రకాష్,
3వ తరగతి,
శ్రీ వేణు విద్యా నికేతన్,
కే కోటపాడు,
అనకాపల్లి జిల్లా.

ఓపిక - ప్రణాళిక



అక్షరం అక్షరం పేర్చాను
పలికే ఒక పదమయ్యింది!

పదమూ పదమూ కూడాను
అర్థవంతమైన వాక్యమయ్యింది!

వాక్యం వాక్యం కూర్చాను
విషయం బోధించే వ్యాసం అయ్యింది!

వ్యాసం వ్యాసం కలిపాను
జ్ఞానం పంచే పుస్తకమయ్యింది!

పుస్తకం పుస్తకం చేర్చాను
విజ్ఞాన భాండాగారమయ్యింది!

ప్రణాళికతో పని చేస్తూ పోతే
ఏదీ కష్టం కాదనిపిస్తుంది!

ఓపికతో ముందుకు వెళ్తూ పోతే
సాధించలేనిది ఏదీ లేదనిపిస్తుంది!

- తిప్పాన హరిరెడ్డి,
విజయవాడ,
94938 32412.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

భయం భయంగా ఈ శతాబ్దం!

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత సమాజంలో మానవ జీవనం రోజురోజుకూ కుంచించుకుపోతోంది. ఎన్నెన్నో నూతన ఆవిష్కరణలకు తెరలు తీస్తున్నప్పటికీ ఈ శతాబ్ద మొదలు నుండే అభద్రత, అనిశ్చిత, భావోద్రేకాలు, మరెన్నో శారీరక అనారోగ్యాలు, కొత్త కొత్త వైరస్‌ల రూపంలో తలకెత్తుతున్న ఆరోగ్య సంక్షోభాలు మనిషి మనుగడని ప్రశ్నార్థకం చేశాయి. వీటికి తోడు మనసును ఛిద్రం చేస్తున్న మానసిక ఆందోళన నేటితరాన్ని, భవిష్యత్తు తరాల మనుగడలను ప్రశ్నార్థకంగా మారుస్తోంది.



వేగంగా మారుతున్న సామాజిక పరిస్థితులలో మనిషి ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పరుగులు తీయడం మన ముందర ఉన్న యధార్థ దృశ్యం. ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల ప్రజానీకం ఈ ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొనడంలో భాగస్వాములు అవుతూనే ఉన్నారు. మారుతున్న ఈ ఆధునిక జీవన పోకడలు, సాంకేతిక అభివద్ధి అందిపుచ్చుకోవటం నాణానికి ఒకవైపే. మరొకవైపు అతివేగంగా, అనూహ్యంగా పెరుగుతున్న మానసిక దౌర్భాల్యాలు లేదా రుగ్మతలు.

ఈ శతాబ్దం అంటే 21వ శతాబ్దాన్ని భయాందోళనల శతాబ్దంగా లేదా పానిక్ సెంచరీగా అభివర్ణించవచ్చు. శతాబ్దం ప్రారంభమై 25 సంవత్సరాలకే సమాజంలో మానసిక ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. ఈ పరిస్థితి, రానున్న 75 సంవత్సరాలలో ఇంకా పెను మార్పులకి దారితీస్తుంది. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే, ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో ఎదుర్కొనే ఏ విపత్తులనైనా మానసిక ధైర్యంతో ఎదుర్కొనే విధంగా తమ ప్రవృత్తులను మార్చుకోవలసిన అవసరం ఉంది.

ఐదు శతాబ్దాల వరుస పరిశీలనలు చేస్తే, 17వ శతాబ్దం జ్ఞానోదయానికి పునాదులు వేసింది అని చెప్పవచ్చు. తత్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం గణనీయమైన పురోగమనానికి నాంది పలికాయి. అందుకే ఈ శతాబ్దాన్ని జ్ఞానోదయ శతాబ్దంగా పిలుస్తారు. 18వ శతాబ్దాన్ని హేతుబద్ధత కలిగిన శతాబ్దంగా పిలుస్తారు. హేతుబద్ధతతో కూడిన విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధి, సమాజాన్ని మెరుగుపరచటానికి ముఖ్యమైన విజ్ఞాన శతాబ్దంగా చెప్పవచ్చు. 19వ శతాబ్దాన్ని పురోగమన శతాబ్దంగా పిలుస్తారు. 18వ శతాబ్ద చివరి భాగంలో ఏర్పడిన పారిశ్రామిక విప్లవం 19వ శతాబ్దంలో మరెన్నో నూతన ఆవిష్కరణలకు పునాదులు వేయడమే కాక మానవ సమాజాన్ని పురోగమనం వైపు నడిపించింది, 20వ శతాబ్దాన్ని పరిశీలించినట్లయితే దీనిని ఆందోళనల శతాబ్దంగా పిలుస్తారు. ఈ శతాబ్ద కాలంలోనే మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు, ఊహించని ఉత్పాతాలు, దేశాల మధ్య శత్రుత్వాలు, మరెన్నో ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి.

ప్రస్తుత 21వ శతాబ్దంలో పానిక్ (తీవ్ర భయం లేదా ఆందోళన) అనేది వివిధ రూపాల్లో వ్యక్తమవుతోంది. ఆధునిక జీవితంలోని వేగవంతమైన మార్పులు, సాంకేతికత ప్రభావం, ప్రపంచవ్యాప్త సవాళ్లు వంటివి దీనికి కారణమవుతున్నాయి.

ఎందుకిలా?

సాంకేతికత ప్రభావం, సమాచార ఓవర్లోడ్ : ఇంటర్నెట్, సోషల్ మీడియా వల్ల సమాచారం విపరీతంగా పెరిగిపోయింది. ఇది ప్రపంచంలోని వివిధ సమస్యలు, విపత్తుల గురించి నిరంతరం తెలియజేయడం వల్ల ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. తప్పుడు సమాచారం (ఫేక్ న్యూస్) కూడా గందరగోళానికి, భయానికి దారి తీస్తుంది.

ఆర్థిక అనిశ్చితి : ఆర్థిక సంక్షోభాలు, నిరుద్యోగం, పెరుగుతున్న ఖర్చులు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటివి వ్యక్తుల్లో భవిష్యత్తు గురించి తీవ్రమైన ఆందోళనను కలిగిస్తాయి.

పర్యావరణ సమస్యలు : వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, కాలుష్యం వంటి వాటిపై పెరుగుతున్న అవగాహన ప్రజల్లో తీవ్రమైన భయాన్ని, నిస్సహాయతను కలిగిస్తోంది. దీనిని క్లైమేట్ యాంగ్జైటీ అని కూడా అంటారు.

ఆరోగ్య అభద్రత : కోవిడ్-19 వంటి మహమ్మారులు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేశాయి. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై నమ్మకం కోల్పోవడం, వ్యాధుల గురించి భయం వంటివి తీవ్ర ఆందోళనకి దారితీశాయి.

సామాజిక, రాజకీయ అస్థిరత : ప్రపంచవ్యాప్తంగా రాజకీయ అస్థిరత, సంఘర్షణలు, మతతత్వం, ఉగ్రవాదం, సామాజిక అసమానతలు వంటివి ప్రజల్లో అభద్రతా భావాన్ని, ఆందోళనను పెంచుతాయి.

వ్యక్తిగత ఒత్తిళ్లు : పోటీతత్వ జీవనశైలి, పని ఒత్తిడి, సంబంధాలలో సమస్యలు, ఒంటరితనం వంటి వ్యక్తిగత కారణాలు కూడా ఆందోళన సమస్యలు, రుగ్మతలకు దారితీస్తాయి.

పానిక్ ప్రభావాలు

మానసిక ఆరోగ్యంపై ... : తీవ్ర భయం లేదా ఆందోళన పానిక్ అటాక్స్, జనరలైజ్డ్ యాంగ్జైటీ డిజార్డర్, డిప్రెషన్ వంటి మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.

శారీరక లక్షణాలు : వేగవంతమైన గుండె కొట్టుకోవడం, చెమటలు పట్టడం, వణుకు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పి వంటి శారీరక లక్షణాలు కనిపించవచ్చు.

సామాజికంగా ... : పానిక్ వల్ల వ్యక్తులు సామాజిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం, భయపడటం, రోజువారీ కార్యకలాపాలకు ఆటంకం కలగడం వంటివి జరుగుతాయి.

నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బంది : తీవ్ర ఆందోళనలో ఉన్నప్పుడు స్పష్టంగా ఆలోచించడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతుంది.

పానిక్‌ను ఎదుర్కోవడానికి మార్గాలు

1 ఆందోళన లేదా పానిక్ తీవ్రంగా ఉన్నప్పుడు మానసిక ఆరోగ్య నిపుణులను (సైకాలజిస్ట్, సైకియాట్రిస్ట్) సంప్రదించడం చాలా ముఖ్యం.


2 క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుంది.

3 ధ్యానం, యోగా, శ్వాస వ్యాయామాలు వంటివి ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను చేకూర్చగలవు.

4 వార్తలు, సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించడం ద్వారా అనవసరమైన ఆందోళనను తగ్గించుకోవచ్చు.

5 స్నేహితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడటం, మద్దతు తీసుకోవడం వల్ల ఒంటరితనం తగ్గి ఆందోళన నుండి ఉపశమనం లభిస్తుంది.

మానవ జీవన పురోగమనంలో బుద్ధి జీవి అయిన మనిషి సాధారణ అభిలాష తన తరం, తన ముందు తరాల పరంపరలు ఆనందంగా, ఆదర్శంగా, హాయిగా జీవించడం. కానీ ఈ శతాబ్దంలో ఇప్పటివరకు జరిగిన, జరుగుతున్న పరిణామాలు గమనిస్తే, జరగబోయే పరిస్థితులు మానవ జీవితాలను ఎటువంటి సంక్షోభాలకు గురి చేస్తాయో అన్న భయం వెంటాడుతోంది. ఈ ఉద్వేగ పరిస్థితులను సమగ్రంగా అర్థం చేసుకుంటూ అడ్డుకట్ట వేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. సామాజిక శ్రేయోభిలాషులు, పాలకులు, మీడియా, సోషల్ మీడియా ప్రతినిధులు ఈ సమస్యలకు పరిష్కారం కనుక్కోవాలి. ఒక తరం మరొక తరానికి అందించాల్సిన అసలు సిసలైన వారసత్వం సామాజిక భద్రత, సామాజిక సమతుల్యతలు కలిగిన ఆరోగ్యకరమైన సమాజం.



- అమరనాథ్ జగర్లపూడి,
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్,
98495 45257.



'తమ్ముడు' సూపర్‌హిట్ ఖాయం : దిల్‌రాజు

'మా ఎస్వీసీ బ్యానర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత వస్తున్న 'తమ్ముడు' చిత్రం మరో సూపర్ హిట్ ఇవ్వబోతోంది. అన్ని హంగులతో సరికొత్తగా ఈ సినిమాను తెరకెక్కించాం. క్లాస్, మాస్ ప్రేక్షకులు మెచ్చేలా అన్ని అంశాలూ మేళవించి ఈ సినిమాను నిర్మించాం. ఖచ్చితంగా ప్రేక్షకుల అంచనాను ఈ సినిమా అందుకుంటుంది.' అని ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. హైదరాబాద్‌లో 'తమ్ముడు' మూవీ రిలీజ్ ట్రైలర్‌ను ఆయన ఆవిష్కరించారు. నితిన్ కథానాయకుడిగా దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహించారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషించారు. ఈనెల 4న ఈ సినిమా విడుదల కానుంది.

రాజ్ తరుణ్ 'చిరంజీవ' వెబ్ సిరీస్



టాలీవుడ్ యంగ్ హీరో రాజ్ తరుణ్ ఓ మైథలాజికల్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్‌తో రాబోతున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. ఈ సిరీస్‌తో ఆహా వీడియో ఓటీటీలోకి రాబోతున్నట్లు వెల్లడించారు. 'అందరి ఆయుష్షు అతి త్వరలోనే చెప్పేస్తాం. 'చిరంజీవ' టీజర్ త్వరలోనే రానుంది' అని పోస్టు చేశారు. ఈ వెబ్ సిరీస్ పోస్టర్‌ని తాజాగా ఆహా ప్లాట్‌ఫామ్ షేర్ చేసింది. త్వరలోనే ఈ సిరీస్‌కు సంబంధించిన టీజర్ కూడా రాబోతున్నట్లు ఆహా వెల్లడించింది. ఈ సిరీస్‌ను ప్రముఖ కమెడియన్ అదిరే అభి అలియాస్ అభినయ కృష్ణ తెరకెక్కిస్తున్నారు. రాహుల్ యాదవ్, సుహాసినీ రాహుల్ నిర్మిస్తున్నారు.

'విశ్వంభర' స్పెషల్ సాంగ్‌లో మౌనీరాయ్



చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' చిత్రం టాకీ పార్ట్ ఎప్పుడో పూర్తిచేశారు. ఇంకా ఒక సాంగ్ మాత్రమే మిగిలింది. తాజాగా ఈ సాంగ్‌ని షూట్ చేయబోతున్నారు. ఈ సాంగ్‌ని కీరవాణితో కాకుండా భీమ్స్ సిసిరోలియోతో చేయించారు. ఈ ప్రత్యేక పాటలో నటించేందుకు బాలీవుడ్ నటి మౌనీరాయ్‌ని చిత్రబృందం ఫిక్స్ చేసింది. బింబసార ఫేమ్ వశిష్ఠ మల్లిడి ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష హీరోయిన్‌గా చేస్తున్నారు. యువి క్రియేషన్స్ బ్యానేర్‌పై వంశి ప్రమోద్, నిరంజన్ రెడ్డి, విక్రమ్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



సరికొత్తగా 'ప్రేమిస్తున్నా'

'అన్ని ప్రేమకథల్లోనూ ప్రేమ ఉంటుంది. కానీ ఈ ప్రేమకథలో అనంతమైన ప్రేమ ఉంటుంది. లవ్‌లో ఇదివరకు ఎవ్వరూ గుర్తించని ఒక ప్రత్యేక సందేశంతో 'ప్రేమిస్తున్నా' సినిమాను తెరకెక్కించాం. యంగ్ జనరేషన్ మళ్ళీ మళ్ళీ చూడాలనుకునే అనేక ఎలిమెంట్స్ ఈ సినిమా ఉంటుంది. ఈ చిత్రం నుండి 'అరెరె..' సాంగ్‌ను భీమ్స్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. సుద్దాల అశోక్ తేజ అద్భుతంగా రాశారు. అనురాగ్ కులకర్ణి ఈ పాటను తనదైన శైలిలో పాడారు.' అని నిర్మాత కనక దుర్గారావు పప్పుల, దర్శకుడు భాను అన్నారు. బాలనటుడు సాత్విక్ వర్మ, తెలుగమ్మాయి ప్రీతి నేహా ఈ సినిమాతో ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. సిద్ధార్థ్ సాలూరి సంగీతం అందించారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్, ఫస్ట్ సాంగ్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఐబిఎం మెగా మ్యూజిక్ ఆడియో కంపెనీ ద్వారా పాటను విడుదల చేశారు.

30 ఏళ్ల తరువాత కలిశారు..



బాలీవుడ్‌లో ఓ ఫేమస్ జంట విడిపోయిన మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ కలిశారు. బాలీవుడ్ సీనియర్ నటుడు రణ్‌ధీర్ కపూర్- బబిత 1971లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొన్నాళ్లకే ఇద్దరి మధ్య విబేధాలు తలెత్తాయి. 1988 నుంచి ఇద్దరూ విడివిడిగానే ఉంటున్నారు. కానీ చట్టపరంగా విడాకులు తీసుకోలేదు. అప్పటికే వారికి కరీనా కపూర్- కరీష్మా కపూర్ ఉన్నారు. ఈ మధ్యనే తన తల్లిదండ్రులు మళ్లీ ఒక్కటైనట్లు కరీనా కపూర్ వెల్లడించారు. ఇద్దరూ వృద్ధాప్యాన్ని కలిసి గడపాలని నిర్ణయించుకున్నారని ఆమె ఓ కార్యక్రమంలో తెలిపారు. 'నాకు, నా సోదరికి ఇది ఒక జీవితచక్రం పూర్తికావడం లాంటిది. వారి జీవిత ప్రయాణం ఎక్కడ మొదలైందో మళ్లీ సరిగ్గా అక్కడికే చేరింది' అని చెబుతూ ఆమె తమ ఫ్యామిలీ ఫొటో షేర్ చేశారు.

ఇద్దరు స్పిన్నర్లతో టీమిండియా

- నేటినుంచి ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్
- మ. 3.30గం॥ల నుంచి



ఎడ్జ్‌బాస్టన్: తొలిటెస్ట్‌లో ఓడిన టీమిండియా ఇక రెండో టెస్ట్‌పై దృష్టి సారించింది. బర్మింగ్‌హామ్ వేదికగా ఇంగ్లండ్‌తో బుధవారం నుంచి జరిగే టెస్ట్‌కు టీమిండియా ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. అదే జరిగితే తుదిజట్టులో కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌లకు చోటు దక్కడం ఖాయం. తొలుత కుల్దీప్ యాదవ్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు ఇవ్వాలని టీమిండియా మేనేజ్ మెంట్ భావించింది. కుల్దీప్‌తోపాటు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు చోటివ్వాలని హెడ్‌కోచ్ గంభీర్ భావిస్తున్నాడు. నెట్స్‌లో సుందర్ తీవ్రంగా శ్రమించడం ఇందుకు మరింత ఊతమిచ్చింది. అయితే ప్రీ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన భారత జట్టు సహాయక కోచ్ ర్యాన్ టెన్ డస్కటే మాత్రం ఈ విషయంపై ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు.

బుమ్రాపైనే భారం

రెండో టెస్ట్‌కు పేసర్ జస్ప్రీత్ బుమ్రా తుది జట్టులో ఉంటాడని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. ఫిట్‌నెస్, పనిభారం దృష్ట్యా బుమ్రా ఇంగ్లండ్‌తో ఐదింటిలో మూడు టెస్టులు మాత్రమే ఆడతాడని జట్టు మేనేజ్‌మెంట్ ఈ సిరీస్‌కు ముందే ప్రకటించింది. తాజాగా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. "బుమ్రా అందుబాటులో ఉన్నాడు. అతడి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ గురించి మేము ఆలోచిస్తున్నాం. అయితే, మేము సరైన కూర్పుతో జట్టును ఎంపిక చేసుకోగలం. అప్పుడే బుమ్రా విషయంలో నిర్ణయం తీసుకుంటాం. ఈ సిరీస్ ఎంత ముఖ్యమో మాకు తెలుసు. కనీసం మూడు మ్యాచ్‌లకైనా బుమ్రా అందుబాటులో ఉంటాడు. తను జట్టు లేకపోతే ఆ లోటు స్పష్టంగా తెలుస్తుంది. కానీ అధిక పనిభారాన్ని మోపడం కూడా సరికాదు. 20 వికెట్లు కూల్చడం సహ భారీగా పరుగులు రాబట్టగలిగే జట్టు కూర్పు కోసం ప్రయత్నిస్తున్నాం" అని తెలిపాడు. తొలిటెస్ట్‌లో ఆడిన బుమ్రా తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు కూల్చాడు. కానీ ఫీల్డింగ్ తప్పిదాలతో టీమిండియా ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

పిచ్ స్వభావం..

ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్ ఫలితం రావడం ఖాయం. ఈ మైదానంలో భారతజట్టు ఆడిన 8మ్యాచుల్లో ఏకంగా 7 మ్యాచుల్లో ఓటమిపాలైంది. ఒక మ్యాచ్‌ను మాత్రమే డ్రా చేసుకోగలిగింది. మరోవైపు ఇంగ్లండ్‌కు కలిసొచ్చే మైదానాల్లో ఇది ఒకటి. ఇక్కడ ఆ జట్టు ఒక్క పరాజయాన్ని కూడా చవిచూడలేదు. చివరిసారిగా 2022లో భారతజట్టు ఇంగ్లండ్ చేతిలో 7వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఓవరాల్‌గా ఈ మైదానంలో మొత్తం 56మ్యాచులు జరగ్గా.. తొలుత బ్యాటింగ్‌కు దిగిన జట్టు 29సార్లు, రెండోసారి బ్యాటింగ్‌కు దిగిన జట్టు 12సార్లు విజయాన్ని నమోదు చేసుకున్నాయి. మరో 15మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. 2011లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు భారత్‌పై 710/7 భారీస్కోర్‌ను నమోదు చేసింది. 2010లో ఈ మైదానంపై పాకిస్తాన్ జట్టు కేవలం 72పరుగులకే కుప్పకూలింది. ఇక్కడ టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన జట్టు 13మ్యాచుల్లో గెలిచి, 11 మ్యాచ్‌లను డ్రా చేసుకొంది. మరో 16మ్యాచుల్లో ఓటమి పాలైంది. ఇక ఫీల్డింగ్‌కు దిగిన జట్టు 16మ్యాచ్‌లకు గాను 7మ్యాచుల్లో గెలిచి, 4మ్యాచులను డ్రా చేసుకొని, మరో 5మ్యాచుల్లో ఓటమిపాలైంది.

జట్లు(అంచనా)...

భారత్ : శుభ్‌మన్(కెప్టెన్), సాయి సుదర్శన్, జైస్వాల్, కెఎల్ రాహుల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), కరణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్, జడేజా/సుందర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్.

ఇంగ్లండ్: బెన్ స్టోక్స్(కెప్టెన్), క్రాలే, డకెట్, పోప్, రూట్, బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), వోక్స్, కర్సే, టంగ్, బషీర్.

7 ఫ్రాంచైజీల మధ్య 2025 ఆంధ్ర ప్రిమియర్ లీగ్ టోర్నీ

ప్రజాశక్తి-మధురవాడ (విశాఖపట్నం)

ఆంధ్ర ప్రిమియర్ లీగ్(ఎపిఎల్)-2025 టోర్నీ ఈసారి ఏడు ఫ్రాంచైజీల మధ్య జరగనుంది. ఈ లీగ్‌కు సంబంధించిన బిడ్డింగ్ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. డా. వైఎస్‌ఆర్ ఎసిఎ-విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఎపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఏడు ఫ్రాంచైజీల పేర్లను అధికారికంగా ప్రకటించింది. 1. ఆర్.కె. స్పోర్ట్స్(సౌత్ జోన్) 2. అక్షర ఎంటర్ ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(సౌత్ జోన్) 3. విజేత సూపర్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్(సౌత్ జోన్) 4.అపర్ణా మెరైన్ ఎక్స్‌పోర్ట్స్(సెంట్రల్ జోన్) 5.మైత్రి మూవీ మేకర్స్(సెంట్రల్ జోన్) 6.మార్లిన్ గ్లోబల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్(నార్త్ జోన్) 7.స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(నార్త్ జోన్) సంస్థలు ఫ్రాంచైజీలను సొంతం చేసుకున్నట్లు ప్రకటించింది. బిడ్డింగ్ జూన్ 27 నుంచి జులై 1తో ముగిసింది. ఎసిఎ అధ్యక్షులు, ఎంపి కేశినేని శివనాథ్, గౌరవ కార్యదర్శి, ఎంపి సానా సతీష్ బాబు సహకారంతో ఈసారి బిడ్డింగ్‌కి అద్భుత స్పందన లభించిందని ఎపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు తెలిపారు. కోశాధికారి, గవర్నింగ్ కౌన్సిల్ మెంబెర్ దండమూడి శ్రీనివాస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెగూలకు షాక్

తొలిరౌండ్‌లో అన్‌సీడెడ్ క్రీడాకారిణి చేతిలో ఓటమి ● వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్



లండన్: వింబుల్డన్ గ్రాండ్ స్లామ్ టోర్నీలో పెను సంచలనం నమోదైంది. 3వ సీడ్, పెగూల (అమెరికా) తొలిరౌండ్‌లో అన్‌సీడెడ్ క్రీడాకారిణి చేతిలో ఓటమిపాలైంది. మంగళవారం జరిగిన తొలిరౌండ్‌లో పెగూల 2-6, 3-6తో ఇటలీకి చెందిన కోసియారెంటో చేతిలో పరాజయాన్ని చవిచూసింది. మరో పోటీల్లో 26వ సీడ్, ఉక్రెయిన్‌కు చెందిన కోస్ట్యుక్ 6-3, 3-6, 4-6తో స్లోవేనియా క్రీడాకారిణి ఎర్జెవిక్ చేతిలో ఓడింది. ఇతర పోటీల్లో 23వ సీడ్ టాసన్(డెన్మార్క్) 2-6, 6-4, 6-3తో స్థానిక క్రీడాకారిణి వాట్సన్‌ను చిత్తుచేయగా.. 18వ సీడ్, రష్యాకు చెందిన అలెగ్జాండ్రోవా, 16వ సీడ్ కసట్కినా (ఆస్ట్రేలియా) ప్రత్యర్థులపై గెలిచి రెండోరౌండ్‌కు చేరారు.

రెండోరౌండ్‌కు సినర్, టామీ పాల్..

ఇక పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్‌తోపాటు 13వ సీడ్, అమెరికాకు చెందిన టామీ పాల్ రెండోరౌండ్‌కు చేరారు. సినర్ 6-4, 6-3, 6-0తో సహచర ఆటగాడు నార్డిని చిత్తుచేయగా.. పాల్ 6-4, 6-4, 6-2తో బ్రిటన్‌కు చెందిన మండేను ఓడించాడు. 11వ సీడ్ డి-మినార్(ఆస్ట్రేలియా) 6-2, 6-2, 7-6(7-2)తో స్పెయిన్‌కు చెందిన కరిబలిస్‌ను చిత్తుచేయగా.. 27వ సీడ్ షపొవలోవ్ 6-3, 4-6, 1-6, 4-6తో నవోనే(అర్జెంటీనా) చేతిలో ఓటమిపాలయ్యాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68